హైదరాబాద్
గురువారం
1-2-2018
సంపుటి: 2, సంచిక: 63
పేజీలు: 12+16, వెల: రూ. 5
/manamnews
www.manamnews.com

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

'టాప్' ఫైట్

నేడు ఇండియా, సౌతాఫ్రికా తొలి వన్డే

స్పోర్ట్స్‌లో..



మెట్టుదిగిన ట్రంప్

వలసలపై కాస్త పట్టింపు.. కొంత సడలింపు..

షరతులతో 'డ్రీమర్ల'కు పౌరసత్వ మంజూరు

భారత సాంకేతిక నిపుణులకు అత్యధిక లబ్ధి!

సుభద్ర-సురక్షిత.. సగర్వ-సమర్థ దేశమే లక్ష్యం

తొలిసారి 'స్టేట్ ఆఫ్ ది యూనియన్' ప్రసంగం

7లో..

ఇదీలోకం!



ఇక నుంచి బ్యాంకులకు కన్నం వేసి టైం వేస్ట్ చేసుకోకు మావా..!

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో గురువారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి రాత్రి ఉష్ణోగ్రతలలో మార్పులేదు. చలిగాలుల తీవ్రత స్వల్పంగా పెరుగుతుంది. గంటకు 15 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 32 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 15 డిగ్రీలు

గాలిలో తేమ: 35 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: పాడ్యమి మ.3.44 తదుపరి విదియ; నక్షత్రం: ఆశ్లేష మ.3.04 తదుపరి మఖ; వర్జ్యం: రా.2.01-3.28; దుర్ముహూర్తం: మ.3.07-4.38; రాహుకాలం: మ.1.54-3.19; అమృతఘడియలు: మ.1.40-3.07; శుభసమయం: మ.1.00-1.30.

సూర్యోదయం: 6.52

సూర్యాస్తమయం: 6.08

అరుణ వర్ణంలో నిండు చందురుడు



ఆకాశంలో అద్భుతం

హైదరాబాద్, జనవరి 31:

తెల్లగా మెరిసే చంద్రుడు అరుణ వర్ణంలో కనువిందు చేశాడు. అరుదుగా వచ్చే చంద్రగ్రహణాన్ని చూసేందుకు ప్రజలు ఆతృతగా ఎదురుచూశారు. గ్రహణం **మిగతా 5లో..**



గద్దెపై కొలువుదీరిన సారలమ్మ





పగిడిద్దరాజు, గోవిందరాజు కూడా..

జంపన్న వాగుపై ఆసీనుడైన జంపన్న

భక్తుల పబ్బతులతో హోరెత్తిన అడవి

మొదలైన మేడారం జాతర మహాసంరంభం

నేడు వేంచేయనున్న సమ్మక్క తల్లి

వనమంతా జన ప్రవాహమే...

మేడారం మనం న్యూస్ నెట్‌వర్క్:

మేడారం మహాజాతరలో తొలి అంకం ఆవిష్కృతమైంది. రెండు సంవత్సరాలుగా కోట్లాది మంది భక్తులు కళ్లల్లో వత్తులు వేసుకుని ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఘడియలు రానే వచ్చాయి. ఆదివాసీల ఆరాధ్య దైవాలైన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర కోసం అనేక ప్రాంతాల నుండి బయలుదేరి మేడారం చేరుకుని చల్లని తల్లుల కరుణా కటాక్షాలకై వేచి చూస్తున్న కోట్లాది భక్తుల ఎదురు చూపులు ఫలించాయి. కన్నెపల్లి సారలమ్మ తల్లి మేడారానికి తరలివచ్చింది. తల్లి **మిగతా 6లో..**

ట్రాఫిక్ జామ్.. గర్భిణి మృతి

3లో..



ఆకర్షణా... వివేచనా!

నేడే లోక్‌సభలో కేంద్ర బడ్జెట్ సమర్పణ

జైట్లీ పద్దు మొగ్గేది ఎటువైపు?

ఎన్నికల ఏడాదిలో 'కత్తిమీద సాము'

7లో..

కొత్త సీఎస్ జోషి

ఎస్పీ సింగ్ స్థానంలో నియామకం.. బాధ్యతలు స్వీకరించిన శైలేంద్ర కుమార్

కేంద్ర.. రాష్ట్రాల్లో కీలక పదవులు

1984 బ్యాచ్ ఐఏఎస్ అధికారి

స్పెషల్ సీఎస్‌గా విశేష సేవలు

ప్రజాసేవకు పునరంకితం.. జోషి

సీఎస్‌కు అధికారుల శుభాకాంక్షలు



హైదరాబాద్, జనవరి 31(మనం ప్రతినిధి):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా శైలేంద్ర కుమార్ జోషి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బాధ్యతలు స్వీకరించిన నాలుగో సీఎస్ ఎస్కే జోషి.. ఈ సందర్భంగా సీఎస్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జోషి కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధిలో దూసుకు వెళుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రాధాన్యం ఇస్తానని, సీఎం కేసీఆర్ ఆదేశాలతో పనిచేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు తన శక్తిసామర్థ్యాల మేరకు సేవచేసేందుకు పునరంకితమవుతానని జోషి పేర్కొన్నారు. 2019 డిసెంబర్ నెలాఖరు వరకు **మిగతా 6లో..**



అఫ్ఘాన్‌లో భూకంపం

హిందూకుష్‌లో 6.2 తీవ్రతతో ప్రకంపనలు

భారత్.. పాక్‌లలోనూ ప్రభావం

శ్రీనగర్‌లో కూలిన ఫ్లైఓవర్ పిల్లర్.. తప్పిన ప్రాణనష్టం

మంచు చరియలు కూలే ప్రమాదం

7లో..



నేరుగా రాహుల్‌నే కలుస్తా

గెలుపును దూరం చేసుకుంటున్నాం

నా సూచనలు అమలు చేయాల్సిందే

చక్కదిద్దడంలో కుంతియా విఫలం

మార్చిలోగా సగం మంది అభ్యర్థులను ప్రకటించాలి

అవకాశమిస్తే రాష్ట్రాన్ని చుట్టేస్తా..: కోమటిరెడ్డి

హైదరాబాద్, జనవరి 31 (మన ప్రతినిధి):

ఎన్నికలు సమీపిస్తున్నప్పటికీ టీపీసీసీ నాయకత్వం వేగం పెంచకపోవడంపై సీఎల్పీ ఉపనేత, ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తద్వారా గెలుపును దూరం చేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి తన సూచనలు అమలు చేయాల్సిందేనని పేర్కొంటూ.. లేదంటే ఈ విషయంలో నేరుగా ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీనే కలుస్తానని తేల్చిచెప్పారు. ఎలాంటి ప్రణాళికలు లేకుండానే 70 స్థానాల్లో విజయం సాధిస్తామని ప్రకటించడమేంటని ప్రశ్నించారు. బుధవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి కుంతియా పార్టీ సీనియర్ నేతలతో భేటీ **మిగతా 6లో..**



ఓడితే సన్యాసం

వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్‌దే గెలుపు.. మరో 20 ఏండ్లు కేసీఆరే సీఎం

అభివృద్ధిని మర్చిన కాంగ్రెస్: కేటీఆర్.. జోగులాంబ గద్వాలలో చేనేత పార్కు ప్రారంభం

గద్వాల, జనవరి 31 (మనం ప్రతినిధి):

తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సీఎం కేసీఆర్ మరో 20 ఏళ్లు కొనసాగుతారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్‌దే గెలుపని, ఒకవేళ ఓడితే రాజకీయ సన్యాసం తీసుకుంటానని అన్నారు. బుధవారం జోగులాంబ గద్వాల జిల్లాలో బుధవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి కేటీఆర్ గద్వాలలో **మిగతా 6లో..**



చంద్రగ్రహణం ఎఫెక్ట్
ఆలయాల మూసివేత

కరీంనగర్, జనవరి 31(మనం న్యూస్ బ్యూరో): చంద్రగ్రహణం ప్రభావంతో బుధవారం ఆలయాలు మూతపడ్డాయి. కాళేశ్వర ముక్తేశ్వరస్వామి ఆలయం, దక్షిణ కాశీగా పిలువబడే వేములవాడ ఆలయం, కొండగట్టు ఆలయం, ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయం, కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయం, జగిత్యాల జిల్లా కోటిలింగాల కోటేశ్వరస్వామి ఆలయాలకు నిర్వాహకులు తాళం వేశారు. గురువారం ఉదయం సంప్రోక్షణ అనంతరం ఆయా దేవాలయాలు తిరిగి తెరుచుకోనున్నాయి.

పబ్లిక్ గ్రీవెన్స్ అథారిటీ
ఏర్పాటుకు డిమాండ్

హైదరాబాద్, జనవరి 31 (మనం న్యూస్): అనైతిక కార్యకలాపాలకు పాల్పడుతున్న పోలీసులపై చర్యలు తీసుకునేందుకు 'పబ్లిక్ గ్రీవెన్స్ అథారిటీ' ఏర్పాటు చేయాలని పీపుల్స్ ఫోరం ఫర్ రైట్ టూ ఇన్ఫర్మేషన్(పీఎఫ్ఆర్ఐ) ప్రధాన కార్యదర్శి పార్థసారథి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పబ్లిక్ గ్రీవెన్స్ అథారటీ ఏర్పాటు అంశం పోలీసు మాన్యువల్‌లో ఉందని, ఇప్పటివరకు ఏర్పాటు జరగలేదన్నారు. పోలీసుల అప్రజాస్వామిక దాడులు, చట్ట ఉల్లంఘన, నిర్బంధాలు, మానవ, ప్రజాస్వామిక హక్కుల ఉల్లంఘన, అవినీతి, క్రమశిక్షణా రాహిత్యం, ఆశ్రిత పక్షపాతం వంటి వాటిపై బాధితులు ఈ అథారటీలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ అథారిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని, కోర్టులో పిల్ కూడా దాఖలు చేశామని పీఎఫ్ఆర్ఐ కార్యదర్శి సిరాజుద్దీన్ చెప్పారు. పబ్లిక్ గ్రీవెన్స్ అథారిటీని ఏర్పాటు చేయాలని గతేడాది ఏప్రిల్‌లో హైకోర్టు ఆదేశించినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదన్నారు. ప్రభుత్వం నియంతృత్వపోకడలతో ముందుకుపోతోందని, పౌరహక్కులను హరించివేస్తోందని పీఎఫ్ఆర్ఐ ఉపాధ్యక్షుడు భగవంత్ రెడ్డి అన్నారు. ఐపీసీ సెక్షన్ 506, 507ను నాన్ బెయిలబుల్ సెక్షన్లుగా మారుస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

5న తెలంగాణ బంద్

- మావోయిస్టు పార్టీ పిలుపు

వరంగల్ అర్బన్ జిల్లా, జనవరి 31(మనం ప్రతినిధి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలకు నిరసనగా మావోయిస్టు పార్టీ ఫిబ్రవరి ఐదో తేదీన తెలంగాణలో ఒక్క రోజు బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ మేరకు వరంగల్, జయశంకర్, భూపాలపల్లి, పెద్దపల్లి డివిజన్ కమిటీ కార్యదర్శి దామోదర్ పేరుతో ఓ లేఖ విడుదలయ్యింది. అడవుల్లోని వనరులను దోచుకునేందుకు, మావోయిస్టు పార్టీని నిర్మూలించేదుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా పెట్టుకున్న లక్ష్యం 'సమాధాన్ 2022' అని లేఖలో పేర్కొన్నారు. 2017 ఆగస్టు నుంచి 2018 జనవరి 10 మధ్యకాలంలో 60మందికి పైగా ఉద్యమకారులను బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపారని పేర్కొన్నారు. దండకారణ్యంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలపై పాశవిక నిర్బంధం కొనసాగుతూనే ఉందని, పాలకవర్గాలు అనుసరిస్తున్న విధానాలను, పోలీసు దాడులను ప్రజలు ప్రతిఘటించాలని, విప్లవోద్యమాన్ని కాపాడుకుంటూ ఆదివాసీల మనుగడకు ముప్పు తెచ్చి పెడుతున్న ముష్కరదాడులను ఖండించాలని లేఖలో కోరారు. సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న దళిత నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, నేరెళ్ల, అభంగపట్నం ఘటనలు ఘోరమైనవిగా లేఖలో అభివర్ణించారు. రిజర్వేషన్‌లలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించిన ఆదివాసులను అరెస్టు చేస్తున్నారని, వరవరరావు, కోదండరాంలతో సహా ప్రజాశ్రేయస్సు కోసం గళం విప్పుతున్న వారిని అరెస్టు పేరుతో నిర్బందిస్తున్నారని దామోదర్ లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు 5న దండకారణ్యం తెలంగాణ బంద్‌కు పిలుపునిస్తున్నామన్నారు. బంద్‌ను పాటించి పాలకుల తీరుపై నిరసన వ్యక్తం చేయాలని, మావోయిస్టు పార్టీ ఉద్యమాన్ని బలపరచాలని దామోదర్ లేఖలో విజ్ఞప్తి చేశారు.

నిందితులకు పోలీసులకు
తేడా తెలియడంలేదు

- 'బొడ్డుపల్లి' కేసు విచారణలో న్యాయమూర్తి వ్యాఖ్య

హైదరాబాద్, జనవరి 31(మనం లీగల్ ప్రతినిధి): బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసులో నిందితుల్ని మీడియా ఎదుట హాజరుపర్చడంపై హైకోర్టు న్యాయమూర్తి ఏవీ శేషసాయి ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ఈ కేసును సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలంటూ శ్రీనివాస్ భార్య, నల్లగొండ మునిసిపల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి దాఖలు చేసిన కేసు విచారణ సందర్భంగా మీడియా సమావేశంలో ఎవరు నిందితులో, ఎవరు పోలీసులోకూడా తెలియడం లేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. తొలుత కేసును లంచ్ మోషన్ రూపంలో విచారణ చేయాలని ఆమె లాయర్ కోరారు. పోలీసుల విచారణలో నిజాయితీ కనబడటం లేదని, ప్రభుత్వ ఒత్తిళ్లు ఉంటాయని చెప్పడానికి ఘటన జరిగిన రోజు నాటి పరిణామాలే నిదర్శమని, కాబట్టి సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) లేదా సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీనివాస్ టీఆర్ఎస్‌లో చేరాలనే ఒత్తిళ్లకు లొంగకపోవడం, ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయకపోవడం వల్ల తన భర్తను టార్గెట్ చేశారని, నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం తమపై ఒత్తిడి చేశాక బెదిరింపులు కూడా వచ్చాయని లక్ష్మి తన రిట్‌లో పేర్కొన్నారు. ఈ పరిణామాలతో ఆందోళన చెంది రక్షణ కల్పించాలంటూ స్వయంగా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసుకున్నా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. దర్యాప్తు సజావుగానే జరుగుతోందని, కౌంటర్ దాఖలుకు సమయం కావాలని ప్రభుత్వ ప్రత్యేక లాయర్ కోరారు. దాంతో కౌంటర్ దాఖలు చేయాలని నల్లగొండ ఎస్పీని ఆదేశించిన న్యాయమూర్తి విచారణను 3 వారాలకు వాయిదా వేశారు.

స్థానిక రిజర్వేషన్ కోసం హైకోర్టులో రిట్

హైదరాబాద్, జనవరి 31(మనం లీగల్ ప్రతినిధి): అయిదో తరగతి నుంచి టెన్త్ వరకూ పాలమూరు జిల్లాలో చదివినందున తనను తెలంగాణ రాష్ట్రానికి చెందిన అభ్యర్థిగా పరిగణించాలని కోరుతూ కర్నూలు జిల్లా రెమట గ్రామానికి చెందిన రంగస్వామి దాఖలు చేసిన కేసులో హైకోర్టు స్పందించింది. స్థానికత ఆధారంగా తన దరఖాస్తును ఉపాధ్యాయ నియామక పరీక్షలకు ఆమోదించాలని, అయిదేళ్లు పూర్తిచదివి ఉంటే స్థానికత వస్తుందనే వాదనను న్యాయమూర్తి ఎమ్మెస్ రామచంద్రరావు ఆమోదించారు. రిజర్వేషన్ కూడా వర్తింపజేయాలనే పిటిషనర్ అభ్యర్థననూ ఆమోదించారు. ఆన్‌లైన్ గడువు ముగిసినందున పిటిషనర్ దరఖాస్తును పత్రాల ద్వారా తీసుకోవాలని న్యాయమూర్తి టీఎస్‌పీఎస్సీని ఆదేశించారు.

నకిలీ వజ్రం @1.20 కోట్లు


- వ్యాపారిని బురిడీ కొట్టించిన మోసగాళ్లు
- ఇద్దరి అరెస్టు.. రూ. 1.15 కోట్ల స్వాధీనం

హైదరాబాద్, జనవరి 31: తమ దగ్గర భారీ వజ్రం ఒరిజినల్‌ది ఉందని, మార్కెట్‌లో దాని ధర చాలా ఎక్కువ పలుకుతుందని చెప్పి వ్యాపారిని బురిడీ కొట్టించి.. సాధారణ రాయిముక్కను రూ. 1.20 కోట్లకు అంటగట్టిన మోసగాళ్లను పోలీసులు అరెస్టుచేశారు. వారి వద్ద పలు పరికరాలతో పాటు రూ. 1.15 కోట్ల సొమ్మును కూడా స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 1996 నుంచి 2000 వరకు నాంపల్లిలోని మహ్మద్‌ఖాన్ జ్యూయలర్స్‌లో సేల్స్‌మన్‌గా పనిచేసిన మహ్మద్ సలామ్ ఖాన్.. తన స్నేహితుడు మహ్మద్ అతర్ సిద్ధిఖీతో కలిసి గతంలో తన సహోద్యోగి అయిన మహ్మద్ హాజీకి ఈ నకిలీ వజ్రాన్ని అంటగట్టారు. తమవద్ద 25 క్యారట్ల అసలు సిసలు వజ్రం ఉందని, దానికి మార్కెట్లో మంచి విలువ ఉందని చెప్పారు. వాళ్లను నమ్మిన హాజీ.. ఈనెల 18న రూ. 1.20 కోట్లు ఇచ్చి ఆ 'వజ్రం' తీసుకున్నారు. తర్వాత దాని అసలు విలువ ఎంతో తెలుసుకుందామని 25న పరీక్షించగా, అది అసలు వజ్రమే కాదని తేలడంతో అతడు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. కాగా, నిందితుడు సల్మాన్ ఖాన్ 2016 సంవత్సరంలో తన తమ్ముడు జుబైర్ హయత్‌ఖాన్‌ను ఉద్యోగంకోసం ఆస్ట్రేలియా పంపడంతో దానికి అప్పు చేయాల్సి వచ్చింది. అతడితో పాటు అతర్ సిద్ధిఖీ కలిసి రాళ్లు అమ్మేవారు. ఆ వ్యాపారంలో కూడా నష్టాలు రావడంతో అప్పులు పెరిగాయి. దీంతో.. హాజీని మోసం చేసి డబ్బు సంపాదించాలనుకున్నారు. చార్మినార్ వద్ద సండే మార్కెట్‌లో ఆ రాయిని రూ.3,500కు కొన్నారు. తర్వాత హాజీని స్వదేశ్ లాడ్జికి పిలిచి, రూ.1.20 కోట్లకు బేరం కుదుర్చుకున్నారు. అనుకున్న ప్రకారమే జనవరి 18న ఆ 'వజ్రం' ఇచ్చారు. సలామ్ ఖాన్ దాన్ని తనదగ్గరున్న టెస్టింగ్ మిషన్‌తో పరీక్షించి, దాన్ని సెక్టార్-2 వజ్రమని చెప్పాడు. దాంతో మొత్తం డబ్బు



లిచ్చి హాజీ దాన్ని తీసుకున్నారు. తర్వాత దాన్ని అమ్మడానికి ప్రయత్నించగా అసలు విషయం తెలిసింది. దాంతో అతడు పోలీసులకు ఫిర్యాదుచేయగా, నిందితులిద్దరినీ అరెస్టుచేసి, వారివద్ద రూ. 1,15,20,000 నగదును, నకిలీ వజ్రాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఆహా.. అద్భుతం
ఆనందాశ్రమం



బిచ్చగాళ్లను ఆదరిస్తున్న జైళ్ల శాఖ ..రోజూ సన్నబియ్యంతో భోజనం

- వారానికోసారి గుడ్డు, చికెన్
- ఉదయం చక్కటి అల్పాహారం
- ఆపై పాఠాలు, నైపుణ్య శిక్షణ
- కొత్త బట్టలు, పరుపులు, బెడ్‌షీట్లు
- కాలక్షేపానికి ఎల్ఈడీ టీవీ సదుపాయం
- బెగ్గర్స్ ఫ్రీ హైదరాబాద్‌కు జైళ్ల శాఖ కృషి



హైదరాబాద్, జనవరి 31(మనం ప్రతినిధి): ఫుట్‌పాత్‌లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో చలికి వణుకుతూ, ఎండకు ఎండుతూ నేలపై పడుకునే వారు.. ఇప్పుడు మెత్తని పరుపుల్లో, సరికొత్త బ్లాంకెట్లు కప్పుకుని హాయిగా నిద్రిస్తున్నారు. ఉదయం లేవగానే వ్యాయామం తర్వాత వేడి నీటి స్నానం చేసి, కొత్త బట్టలు కట్టుకుని హుందాగా కనిపిస్తున్నారు. టీ స్టాళ్ల వద్ద, హోటళ్ల వద్ద ఎవరైనా పెడితే తిందామని వేచి చూసేవారు.. ఇప్పుడు దర్జాగా నచ్చిన అల్పాహారాన్ని, తేనీరునూ సేవిస్తున్నారు. చిల్లర కోసం సిగ్నళ్ల వద్ద ఛీత్కారాలు, విదిలింపులకు గురయ్యేవారు.. ఇప్పుడు తమ బెడ్‌పై పడుకుని 56 ఇంచుల ఎల్ఈడీ టీవీలో నచ్చిన కార్యక్రమం చూస్తూ దర్జాగా గడుపుతున్నారు. హైదరాబాద్‌లోని గుళ్ల వద్ద, సిగ్నల్ జంక్షన్ల వద్ద అడుక్కునే బిచ్చగాళ్లు ప్రస్తుతం గడుపుతున్న జీవితమిది. 'బెగ్గర్స్ ఫ్రీ హైదరాబాద్' కార్యక్రమంలో భాగంగా తెలంగాణ జైళ్లశాఖ నగరంలోని బిచ్చగాళ్లను తరలించిన ఆనందాశ్రమంలోని వసతులు ఇవి.. ఇక్కడున్న సౌకర్యాలు డీలక్స్ హాస్టల్ అని పేరు పెట్టుకుని రూ. వేలు వసూలు చేస్తున్న ప్రైవేటు హాస్టళ్లలోనూ ఉండవేమోననడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్, అమెరికా అధ్యక్షుడి కూతురు ఇవాంకా ట్రంప్ పర్యటన నేపథ్యంలో బిచ్చగాళ్లను పునరావాస కేంద్రాలకు తరలించడం ప్రారంభించి విమర్శలు మూటగట్టుకున్న పోలీసులు.. వారికి అందిస్తున్న అపారమైన సేవలతో ప్రస్తుతం ప్రశంసలందుకుంటున్నారు.

మూడువేలకు పైగా..

జీఈఎస్ నేపథ్యంలో 'బెగ్గర్స్ ఫ్రీ హైదరాబాద్' కార్యక్రమాన్ని గతేడాది అక్టోబర్ 20న ప్రారంభించారు. చంచల్‌గూడ జైలులో పురుషుల కోసం, చర్లపల్లి జైలులో మహిళా యాచకుల కోసం 'ఆనందాశ్రమం' పేరుతో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్టోబరు 20 నుంచి జనవరి 30 వరకూ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల నుంచి 3011 మంది బిచ్చగాళ్లను పోలీసులు ఆనందాశ్రమాలకు తరలించారు. వీరందరి వద్ద వేలి ముద్రలు, ఆధార్ కార్డు నంబర్లతో సహా పూర్తి చిరునామా సేకరిస్తున్నారు. ఆధార్ లేని వారికి ఆధార్ ఇప్పించేందుకు యత్నిస్తున్నామని జైళ్లశాఖ సిబ్బంది తెలిపారు. భిక్షాటన చేస్తూ తొలిసారి పట్టుబడిన వారి వద్ద వివరాలన్నీ తీసుకుని ఆశ్రయం కల్పిస్తున్నారు. అనంతరం కుటుంబసభ్యులకు లేదంటే సంబంధీకులకు వివరాలు చేరవేస్తున్నారు. వారు వచ్చి భిక్షాటన చేయించబోమని హామీ ఇచ్చినా లేదా బిచ్చగాడే బయటకు వెళ్తానని కోరినా, మరోసారి భిక్షాటన చేయబోనన్న రాతపూర్వక హామీ తీసుకుని పంపించేస్తున్నారు. భిక్షాటన చేస్తూ రెండోసారి పట్టుబడితే కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. అయితే, సులభంగా డబ్బు సంపాదించేందుకు అలవాటు పడ్డ కొందరు ఈ హెచ్చరికలను సైతం బేఖాతరు చేసి తిరిగి యాచిస్తుండటం గమనార్హం. కాగా, యాచకుల పునరావాస కార్యక్రమానికి పౌరుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. పోలీసుల సూచనల మేరకు యాచకులు కనపడగానే నగరవాసులు స్వచ్ఛందంగా స్పందిస్తున్నారు.


పురుషులే అధికం..

భిక్షాటన చేస్తున్న వారిలో పురుషులే అధికంగా ఉన్నారు. పోలీసులు తరలించిన 3011 మందిలో 2024 మంది మగవారే. వీరిలో 1893 మందిని కుటుంబ సభ్యుల హామీతో లేదా భిక్షాటన చేయబోమన్న సొంత హామీతో ఆనందాశ్రమం నుంచి పంపించేశారు. ఇలా హామీ ఇచ్చి బయటకు వెళ్లిన వారిలో కొంత మంది మళ్లీ భిక్షాటన చేస్తూ పట్టుబడ్డారు. ఇలాంటి వారిని ఆనందాశ్రమంలోనే ఉంచి వారికి నచ్చిన పనిలో శిక్షణ ఇస్తున్నారు. నగరంలోని ఎస్ఎస్ స్టీల్స్ కంపెనీ ఆనందాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న ఐదుగురు యాచకులను ఉద్యోగానికి ఎంపిక చేసుకోవడం విశేషం. కాగా, ఇప్పటి వరకూ 987 మంది మహిళా యాచకులను ఆనందాశ్రమానికి తరలించారు.

సకల సౌకర్యాలు..

ఆనందాశ్రమంలో బిచ్చగాళ్లకు అందిస్తున్న సేవలు సొంతింటికి ఏ మాత్రం తీసిపోవు. ఉదయం లేవగానే వ్యాయామం చేయిస్తున్నారు. చలికాలం కావడంతో స్నానానికి వేడి నీటిని అందిస్తున్నారు. ప్రతి ఒక్కరికీ సెపరేట్ బెడ్, దుప్పటి, దిండు, రెండు జతల కొత్త బట్టలు ఇస్తున్నారు. రోజుకో రకం అల్పాహారం అందిస్తున్నారు. చదవగలిగిన వారికి పుస్తకాలు, దినపత్రికలు అందుబాటులో ఉంచుతున్నారు. ప్రతి మంగళవారం గుడ్డు, ఆదివారం చికెన్‌తో భోజనం పెడుతున్నారు. మిగతా రోజుల్లో పప్పు, చారు, పచ్చడి, కూరలు వడ్డిస్తున్నారు. కాలక్షేపం కోసం ప్రతి రూమ్‌లో 56 ఇంచుల ఎల్ఈడీ టీవీలు ఏర్పాటు చేశారు.


95 శాతం ప్రొఫెషనల్ బెగ్గర్స్..



యాచక వృత్తిలో ఉన్న వారిలో 95శాతం మంది ప్రొఫెషనల్ బెగ్గర్స్. సులభంగా డబ్బు సంపాదించడం కోసం, లేదంటే బద్ధకంతో ఈ వృత్తిని ఎంచుకుంటున్నారు. కొందరు వీరి వెనకాల ఉంటూ పెద్ద మొత్తంలో డబ్బు సంపాదిస్తున్నారు. ఇలాంటి వారే ఈ కార్యక్రమాన్ని విమర్శిస్తున్నారు. ప్రభుత్వ సహకారంతో జీహెచ్ఎంసీ, హైదరాబాద్ పోలీస్, జైళ్లశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వినూత్న కార్యక్రమం ఇది. ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదు. ఆనందాశ్రమంలో కల్పించిన సౌకర్యాలు స్టార్ హోటళ్లలో కూడా ఉండవు. మానవ హక్కుల సంఘాల వారు సూచనలు చేస్తే స్వీకరిస్తాం. ఇంకొన్ని నెలల్లో హైదరాబాద్‌లో యాచకుల సమస్య తీరిపోతుంది.

-వి.కె. సింగ్, జైళ్లశాఖ డైరెక్టర్

మానసికంగా కుంగిపోయి..



తల్లిదండ్రుల మరణంతో మానసికంగా కుంగిపోయి నగరానికి వచ్చి భిక్షాటన చేశా.. గత ఏడాది డిసెంబరులో జైళ్ల శాఖ సిబ్బంది నన్ను ఆనందాశ్రమానికి తీసుకొచ్చారు. అనంతరం కౌన్సిలింగ్ ఇప్పించడంతో కోలుకున్నా! డిగ్రీ పూర్తిచేసిన నాకు అధికారులు బేసిక్ కమ్యూనికేషన్స్‌లో శిక్షణ ఇప్పించి, ఆయుర్వే దిక్ విలేజ్‌లో రిసెప్షనిస్టుగా ఉద్యోగమిచ్చారు. ప్రస్తుతం ఆనందా శ్రమంలో ఉంటూనే ఉద్యోగం చేసుకుంటున్నాను. ఈ జీవితంతో నాకు సంతృప్తిగా ఉంది.

-ఉదయ్, నల్లగొండ

బీజేపీ.. పోరు సభలు!

- ప్రభుత్వ వైఫల్యాలే ఎజెండా
- బీసీ సబ్ ప్లాన్, నిరుద్యోగం..
- రైతు ఆత్మహత్యలే ఆయుధాలు
- ఈ నెలలోనే రాష్ట్రానికి అమిత్‌షా
- ఎన్నికల వ్యూహానికి పదును



హైదరాబాద్, జనవరి 31 (మనం ప్రతినిధి) : రాష్ట్రంలో చలిగాలులు తగ్గుతున్న వేళ.. ఎన్నికల వేడి మొదలైంది. 2019 ఎన్నికలకు పార్టీలు 'ఆట' మొదలెట్టాయి. రాజకీయ రణరంగంలో గెలుపు కోసం, ప్రధాన పార్టీలతో పాటు, చిన్న చితకా పార్టీలూ వ్యూహరచన చేస్తుండగా.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దూకుడు పెంచేందుకు రంగం సిద్ధం చేస్తుంది. తెలంగాణలో కాషాయ జెండా ఎగురవేసేందుకు బీజేపీ నేతలు కసరత్తు మొదలు పెట్టారు. ప్రజా సమస్యలే ఎజెండాగా గులాబీ దళాన్ని గద్దె దించుతామని కమలనాథులు చెబుతున్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో టీడీపీతో జతకట్టేది లేదని బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. ఈ సారి ఒంటరిపోరేనని బీజేపీ సీనియర్ నేత ఇటీవలే ప్రకటించారు. దీంతో గులాబీదళంతో కూడా పొత్తు ఉండకపోవచ్చనేది స్పష్టమవుతోంది. ఏపీతో పోల్చుకుంటే బీజేపీకి తెలంగాణలోనే బలమెక్కువ. ఈ క్రమంలో బీజేపీ అధిష్ఠానం ఇక్కడ వ్యూహాత్మకంగా పావులు కదుపుతుందా? అంటే.. రాజకీయ విశ్లేషకులు అవుననే సమాధానం చెబుతున్నారు. గత ఎన్నికల్లో టీఆర్ఎస్ ఇచ్చిన హామీలు ప్రకటనలకే పరిమితం అయ్యాయని, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోవటంలేదని బీజేపీ నాయకులు ఘాటుగానే విమర్శిస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలనే తమకు సానుకూల అంశాలుగా మార్చుకునేలా బీజేపీ నేతలు ప్రణాళికలను రూపొందిస్తున్నట్టు తెలుస్తోంది.

'బీసీ' రాగం ..

ప్రస్తుతం ఏ పార్టీని కదలించినా, ఏ నేత వ్యాఖ్యానించినా 'బీసీ' రాగామే వినిపిస్తోంది. తెలంగాణలో బీసీ జనాభా దాదాపు 54 శాతం. గెలుపు బరిలో నిలవాలంటే బీసీలను ప్రసన్నం చేసుకోవాల్సిందేనని గత ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. 2019 ఎన్నికల్లోనూ ఆయా పార్టీలు 'బీసీ'లకే అగ్రపీఠం వేస్తారని విశ్లేషకులు భావిస్తున్నారు. గులాబీనేతలు గత ఎన్నికల్లో బీసీల అభివృద్ధి కోసం గుప్పించిన హామీలు అమలు కాకపోవటాన్ని కాషాయ పార్టీ అస్త్రంలా వినియోగించుకోవాలనుకుంటోంది. బీసీల ప్రయోజనానికి రూ. 25 వేల కోట్లు ఏటా ఖర్చు చేస్తామన్న కేసీఆర్ ఆ మేరకు నిధులు కేటాయించలేదన్నది బీజేపీ ప్రధాన ఆరోపణ. 'బీసీ సబ్ ప్లాన్' హామీ టీఆర్ఎస్ ప్రకటనలకే పరిమితమైందని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ముస్లింలను బీసీలలో చేర్చి బీసీల వాటాకు కోత వేశారని, బీసీ నిధుల నిరుపయోగం చేశారని బీజేపీ నేతలు ఇప్పటికే విమర్శిస్తున్నారు. ఈ క్రమంలో బీసీలను ఆకట్టుకోవాలని బీజేపీ నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు.

దళితులకు న్యాయం..

ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత విషయంలో ప్రభుత్వం బాధ్యత మరిచిందన్నది బీజేపీ ప్రధాన ఆరోపణ. కేసీఆర్ పాలనలో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని వారు పేర్కొంటున్నారు. దళితుడిని ముఖ్యమంత్రిగా చేస్తానన్నా కేసీఆర్ మాట తప్పారని బీజేపీ పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని నిర్ణయించింది. దళితుల కోసం రూ. 50 వేల కోట్ల కేటాయింపు కలగానే మిగిలిందని, భూ-పంపిణీ మాటలకే పరిమితమైందని కమలనాథులు ఆరోపిస్తూ వస్తున్నారు. దళితులను ఆకట్టుకునేందుకు బీజేపీ ఇప్పటికే ఎస్సీ వర్గీకరణలో ఒక అడుగు ముందుకేసింది. వర్గీకరణ ఉద్యమనేత మంద కృష్ణ అరెస్టు విషయంలో బీజేపీ నేతలు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.

నిరుద్యోగ తెలంగాణ..

నీళ్లు, నిధుల, ఉద్యోగాలతో ఎన్నికల్లో విజయం సాధించి అధికారం చేపట్టిన టీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని విస్మరించిందని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఉద్యోగాల విషయంలో సీఎం కేసీఆర్ మాటలు నీటి మూటలే అంటూ ఇప్పటికే బీజేపీ అనుబంధ విద్యార్థి విభాగం ఏబీవీపీ ఆందోళనలు చేపట్టింది. ఉద్యోగ, ఉపాధ్యాయ నియమకాలపై ప్రత్యేక కార్యాచరణనూ బీజేపీ నేతలు రూపొందిస్తూ టీఆర్ఎస్ ప్రభుత్వ తీరును ఎండకట్టనున్నారు.

రైతు కన్నీరు..

గిట్టుబాటు ధర అడిగిన రైతులకు ఖమ్మంలో పోలీసులు బేడీలు వేయటంపై బీజేపీ నేతలు ప్రభుత్వ తీరును విమర్శించారు. రుణమాఫీలో వడ్డీని కలపకపోవటం, రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు పెరగటం, బాధిత కుటుంబాలకు పరి హారం ఇవ్వకపోవటంపై గళమెత్తనుంది. రైతుల సంక్షేమంకోసం కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్ భీమా యోజన అమల్లో రాష్ట్రం వైఫల్యం వంటి అంశాలపై రైతులను చైతన్య పరుస్తూ అనుకూలంగా మార్చుకోవాలని బీజేపీ నేతలు చూస్తున్నారు.

నారీ భేరి..

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మహిళలకు రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు లేకపోవటం, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, మహిళలకు వడ్డీలేని రుణాలు ఇస్తామని టీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలను మోసం చేసిందని బీజేపీ ప్రచారం చేయాలని భావిస్తోంది.

రాష్ట్రానికి రానున్న అమిత్ షా

జమిలి ఎన్నికలను ప్రాధాన్యత ఇస్తున్న బీజేపీ అధిష్ఠానం తెలంగాణలోనూ పట్టు సాధించేందుకు చాపకింద నీరులా చర్యలు చేపట్టింది. పార్టీ జాతీయ అధ్యక్షులు అమిత్ షా వచ్చేనెల హైదరాబాద్‌కు వస్తున్నట్లు సమాచారం. పార్టీ తీరును, రాష్ట్ర పరిస్థితులను, అధికార పార్టీ పాలన తీరుతెన్నులతో పాటు, మిత్ర పక్షాల ఎత్తులు పై ఎత్తులపై సమీక్షించి తగిన వ్యూహాన్ని ఖరారు చేసేందుకు సమయమిస్తున్నట్లు తెలుస్తోంది. బీజేపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయడం, పార్టీని ఎన్నికలకు సమాయత్తాం చేయడంపైనే అమిత్ షా దృష్టి పెట్టనున్నారు.

నా భార్యతో
ఎస్సైకి సంబంధం

- న్యాయం చేయాలంటూ డీసీపీని ఆశ్రయించిన భర్త

మేడ్చల్/జవహర్‌నగర్, జనవరి 31 (మనం న్యూస్): ఫిర్యాదు చేయడానికి వచ్చిన తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ వ్యక్తి పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు జవహర్‌నగర్ ఎస్సైపై మల్కాజగిరి డీసీపీ ఉమామహేశ్వరశర్మకు సతీష్‌కుమార్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. జవహర్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధి దమ్మాయిగూడకు చెందిన జ్యోత్స్నదేవికి, భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన అన్నబోయిన సతీష్‌కుమార్‌కు 2015లో విహహం జరిగింది. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. భార్తభర్తల మధ్య కొంతకాలంగా మనస్పర్ధలు ఉన్నాయి. గతేడాది నవంబర్‌లో జ్యోత్స్న దేవి తన భర్త సతీష్‌పై జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు తీసుకున్న ఆ స్టేషన్ ఎస్సై నర్సింహ ఆమెతో పరిచయం పెంచుకున్నాడని, వారి మధ్య వివాహేతర సంబంధం ఉందని సతీష్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. నర్సింహకు చెందిన క్రెడిట్ కార్డులో జ్యోత్స్న పలుమార్లు షాపింగ్ కూడ చేసిందని పేర్కొన్నాడు. జ్యోత్స్నకు విడాకులు ఇవ్వాలని లేదంటే జైలులో పెడతానని నర్సింహ తనను బెదిరిస్తున్నాడని, రక్షణ కల్పించాలని సతీష్ కుమార్ డీసీపీని కోరారు. కాగా, సతీష్ చేస్తున్న ఆరోపణలను అతని భార్య జ్యోత్స్న ఖండించింది. ఎస్సై నర్సింహకు తనకు ఎలాంటి సంబంధంలేదని చెప్పింది. సతీష్, తనకు మధ్య గొడవలు ఉన్నాయని, తనను వేధిస్తుండడంతో 2015లో జవహర్‌నగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానని జ్యోత్స్న చెప్పింది.



సత్తుపల్లి అభివృద్ధికి కృషి

- నియోజకవర్గ ప్రజలను మరవను: మంత్రి తుమ్మల

సత్తుపల్లి, జనవరి 31(మనం న్యూస్): అభివృద్ధిలో సత్తుపల్లిని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లిలో రూ.22 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తుమ్మల మాట్లాడారు. తనను రాజకీయంగా ఆదరించిన సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలను మరిచిపోలేనన్నారు. ప్రస్తుతం 200 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మిస్తున్నామని, స్థలం దొరికిన వెంటనే మరిన్ని నిర్మాణాలు చేపడతామన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో సత్తుపల్లిని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రజల సూచనల మేరకే బైపాస్ రహదారి నిర్మాణం చేస్తామన్నారు. మరో మూడేళ్లలో సత్తుపల్లి రైల్వే లైన్ పనులు పూర్తవుతాయని, ఉగాదిలోగా ఇంటింటికీ నీరు సరఫరా చేస్తామన్నారు.

అబ్బో...! ఆశ్చర్యాలు...!!

ఆహా ఓహోలు...!!

జంపన్న వాగుకు లక్నవరం నీరు

- నిమిషానికి 2.50 లక్షల స్నానాలు
- 5664 నల్లాలు
- తొలిసారిగా ఇన్‌చార్జి కలెక్టర్ నేతృత్వంలో..
- విశేషాల సమాహారం.. మేడారం

మేడారం నుంచి మనం ప్రతినిధి బాదిని నర్సింహ: భక్తులకు ఆధ్యాత్మికానుభూతులు మిగిల్చే మేడారం వనజాతర పలు విశేషాల సమాహారం. బయలుదేరినది మొదలుకుని అమ్మల దర్శనం చేసుకుని ఆశీర్వాదాలు పొంది తిరిగి ఇంటికి చేరుకునే దాకా యాత్ర అసాంతం అద్భుతాలు, వింతలు, ప్రత్యేకతలెన్నో... కొన్ని అబ్బో అనిపిస్తే, మరికొన్ని ఆశ్చర్యం కలిగిస్తాయి. ఇవన్నీ చూపరులతో ఆహా... ఓహో... అనిపిస్తాయి. కన్నేపల్లి నుంచి వైభవోపేత ప్రదర్శనతో తరలి వచ్చిన సారలమ్మ బుధవారం గద్దెపై కొలువుదీరండంతో మొదలైన జాతర నేపథ్యంలో కొన్ని విశేషాలపై 'మనం' రిపోర్టింగ్...



రోజుకు 30 ఎంసీఎఫ్‌టీ నీరు

జాతరకు వచ్చే భక్తులు జంపన్నవాగులో స్నానమాచరించి అమ్మలను దర్శనం చేసుకోవడం ఆనవాయితీ. పుణ్యస్నానాలు పూర్తయ్యాక భక్తులు స్నానఘట్టాలపై కొలువై ఉన్న జంపన్న, నాగులమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లిస్తారు. కొంతమంది భక్తులు జంపన్నవాగులో స్నానం చేయడమే మొక్కుగా చెల్లిస్తారు. వాగులో పుణ్యస్నానం చేసేందుకు రెండేండ్లకోసారి వచ్చే జాతర కోసం భక్తులు ఎదురుచూస్తుంటారు. స్నానాలకు నీటిని సరఫరా చేసేందుకు తాత్కాలికంగా బోరుమోటార్లు వేశారు. అయితే జాతరకు కోటిమందికి పైగా భక్తులు రానున్న నేపథ్యంలో అవి ఏమాత్రం సరిపోవు. దీంతో అధికార యంత్రాంగం లక్నవరం జలాశయం నుంచి నీటిని ఇక్కడికి తరలించింద జలాశయం నుంచి ప్రతిరోజు 30 ఎంసీఎఫ్‌టీ నీరు చొప్పున జాతర మొత్తంగా 200 ఎంసీఎఫ్‌టీ నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు.

కాకతీయ రాజుల కాలంలో నిర్మించిన లక్నవరం చెరువు నుంచి విడుదలైన నీరు 25 కిలో మీటర్ల మేర ప్రయాణించి జంపన్నవాగులోకి చేరుతుంది. మొదటగా లక్నవరం నుంచి విడుదలయిన నీరు రెండు కిలోమీటర్ల దూరంలోని సద్దిమడుగు రిజర్వాయర్‌లోకి చేరుతుంది. ఈ రిజర్వాయర్ తూముల వద్ద నీటినివిడుదల చేస్తారు. అలా విడుదలైన నీరు పక్కనే ఉన్న దయ్యాలవాగులోకి చేరుతుంది. అక్కడి నుంచి దాదాపు 23 కిలోమీటర్లు ప్రయాణించి జంపన్నవాగులోకి ప్రవేశిస్తుంది.

జెండాతో సిగ్నల్

ప్రస్తుతం మేడారం మహాజాతరలో ఎవరైనా తప్పిపోతే.. మైక్‌లో అనౌన్సెమెంట్ చేసి కలుసుకుంటారు. ఇందుకోసం ప్రత్యేకంగా కౌంటర్లను సైతం ఏర్పాటు చేస్తున్నారు. వారి సంబంధీకులు కలిసేంతవరకు పోలీసులు వారిపట్ల అప్రమత్తంగా ఉంటారు. మరీ పాతకాలంలో ఎవరైనా మేడారం జాతరలో తప్పిపోతే ఏం చేసేవారో తెలుసా?.. జాతరలో తప్పిపోయిన వారిని వెతికేందుకు పాతకాలంలో ఏలాంటి సౌకర్యాలు ఉండేవి కాదు. అలాంటి తరుణంలో తప్పిపోయిన తమ వారిని వెతికేందుకు వెదురు కర్రలకు చివరన కండువా(టవల్) కట్టి పైకెత్తి పట్టుకుంటారు. అలా ఎన్ని కర్రలు పైకెత్తి ఉంటే.. అంతమంది తప్పిపోయినట్టే.. తప్పిపోయిన వారు కర్ర ఎత్తిపట్టుకున్న వారి దగ్గరికెళ్లి సులభంగా కలుసుకునేవారు. ఎంతయినా పాత తరం.. పాతతరమే..

బాపురెడ్డి నుంచి మొదలు...

మేడారం సమ్మక్క-సారక్క జాతరను 1968 సంవత్సరంలోనే ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించింది. కానీ 1996 సంవత్సరంలోనే రాష్ట్ర పండుగగా గుర్తించి నిధులు కేటాయించింది. ఇదిలావుంటే.. మేడారం జాతర బాధ్యతలను పూర్తిస్థాయిలో కలెక్టర్ చేతుల్లోకి వెళ్లింది మాత్రం 1982లోనే అని గిరిజనులు చెబుతున్నారు. అప్పటి జిల్లా కలెక్టర్ జె.బాపురెడ్డి నుంచి కలెక్టర్ ఆధ్వర్యంలో జాతర నిర్వహించే సంప్రదాయం మొదలైంది. 1982 నుంచి బాపురెడ్డితో మొదలై 2016లో వాకాటి కరుణ వరకు ఈ సంప్రదాయం కొనసాగింది. ఈ మధ్య కాలంలో 18 మంది కలెక్టర్లు జాతరను పకడ్బందీగా నిర్వహించారనే చెప్పాలి. ఈ సంప్రదాయం మొదలైనప్పటి నుంచి తొలిసారిగా జాతరను ఇన్‌చార్జి కలెక్టర్ నేతృత్వంలో నిర్వహిస్తున్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన జిల్లాల విభజనలో వరంగల్ జిల్లా ఐదు జిల్లాలుగా విడిపోయింది. ప్రస్తుతం మేడారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోకి వెళ్లింది. అయితే ఈ జిల్లాకు కలెక్టర్‌గా ఆకునూరి మురళిని నియమించినప్పటికీ.. ఇటీవల వివిధ కారణాల రీత్యా ఆయన స్థానంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఇన్‌చార్జి కలెక్టర్‌గా ఆర్‌వీ కర్ణన్ బాధ్యతలు స్వీకరించారు. వాస్తవానికి వరంగల్ జిల్లాకు 1950లోనే మొట్టమొదటిసారిగా ఎం.వి రజ్వేడ జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. అప్పటి నుంచి జిల్లాల విభజన వరకు 38 మంది కలెక్టర్లు పనిచేశారు. కానీ జాతర నిర్వహణ బాధ్యతలను 1982 నుంచి కలెక్టర్లకు వచ్చాయి.

జాతర నిర్వహించిన కలెక్టర్లు...

సంవత్సరం	కలెక్టర్
1982	జె.బాపురెడ్డి
1984	వి.పి.జౌహరి
1986	పంకజ్ ద్వివేది
1988	ఎ.చెంగప్ప
1990	కోదండరామిరెడ్డి
1992	బి.పి.ఆచార్య
1994	ఎన్.ఎన్.మహంతి
1996	అజయ్ మిశ్రా
1998	శాలిని మిశ్రా
2000	ఆదిత్యనాథ్ దాస్
2002	కె.ప్రభాకర్‌రెడ్డి
2004	ఎన్.శివశంకర్
2006	బి.మహేశ్‌దత్ ఎక్కా
2008	కె.దమయంతి
2010	ఎన్.శ్రీధర్
2012	రాహుల్ బొజ్జా
2014	జి.కిషన్
2016	వాకాటి కరుణ

5664 నల్లాలు... నిమిషానికి 2,83,200 మంది స్నానాలు...

భక్తకోటి స్నానమాచరించేందుకు అధికారులు జంపన్నవాగుకు ఇరువైపులా మూడున్నర కిలోమీటర్ల పొడవునా స్నానఘట్టాలను ఏర్పాటు చేశారు. ఈ ఘట్టాలపై మొత్తం 354 'బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్'నుఅమర్చారు. ఒక్కో ట్యాప్‌కు 16 నల్లాల చొప్పున మొత్తం 5664 నల్లాలు బిగించారు. అధికారుల అంచనా ప్రకారం.. ఒక్కో నల్లా కింద నిమిషానికి ముగ్గురు స్నానం చేస్తారు. 16 నల్లాల కింద దాదాపు 50 మంది చొప్పున నిమిషానికి 5664 నల్లాల కింద 2,83,200 మంది స్నానాలు చేస్తారని అధికారులు చెబుతున్నారు.







కందులు కొనండి

ఈసారి రాష్ట్రంలో 2.84 లక్షల టన్నుల దిగుబడి.. 1.50 లక్షల టన్నులు కొనుగోలు చేయాలి

- కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర పభుత్వం లేఖ
- కందుల కొనుగోళ్ల అక్రమాలపై కొరడా
- జనగామ మార్కెట్ కార్యదర్శిపై చర్యలు
- కందుల రీసైక్లింగ్‌ను ఉపేక్షించేది లేదు
- ప్రత్యేక బృందాలతో నిఘా: హరీశ్‌రావు

హైదరాబాద్, జనవరి 31 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో ఈ సీజన్‌లో కందుల పంట దిగుబడి ఈసారి 2.84 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉండనుందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 1.50 లక్షల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. మొదట కేంద్ర ప్రభుత్వం 33,500 మెట్రిక్ టన్నుల కందుల కొనుగోలుకు కేంద్రం అంగీకరించింది. నిరంతర సమీక్షలు, పర్యవేక్షణ వల్ల కేంద్ర ప్రభుత్వం 53, 600 మెట్రిక్ టన్నులసేకరణకు ఒప్పుకున్నది. కానీ కందుల పంట దిగుబడి అనూహ్యంగా ఉండటంతో కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని మంత్రి హరీశ్‌రావు భావించారు. ఆయన ఆదేశాలతో ఎం.పి.జితేందర్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి పార్థసారధి ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్‌ను, ఆ శాఖ ఉన్నతాధికారులను కలిసి విజ్ఞప్తి చేయడంతో ఎట్టకేలకు 1,13, 600 మెట్రిక్ టన్నుల కందుల సేకరణకు కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తున్నట్లు ప్రభుత్వానికి తెలిపింది. అయితే రాష్ట్రంలో కందుల దిగుబడి దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఈ పరిమితిని సడలించాలని 1,50,000 మెట్రిక్ టన్నుల సేకరణకు ఆదేశించాలని హరీశ్‌రావు కోరారు. కందుల కొనుగోళ్లలో అక్రమాలు, అవకతవకలు జరిగితే సహించబోనని మంత్రి హెచ్చరించారు. కందుల రీసైక్లింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రైతుల ముసుగులో కొందరు ట్రేడర్లు, దళారులు ఎక్కువ ధరకు అమ్ముతున్నందున అటువంటి కార్యకలాపాలను అరికట్టాలని కోరారు. జనగామ, భువనగిరిలలో కందుల క్రయ, విక్రయాల్లో అవకతవకలు జరిగినందున జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేక బృందాలతో నిఘాపెట్టాలని ఆదేశించారు.



నాలుగేళ్లలో రైతుల ఆదాయం రెట్టింపు: హరీశ్

వచ్చే నాలుగేళ్లలో రాష్ట్రంలోని రైతన్నల ఆదాయం రెట్టింపు అవుతుందని మంత్రి హరీశ్‌రావు దీమా వ్యక్తం చేశారు. ఎకరానికి సీజన్‌కు 4 వేల రూపాయల చొప్పున తెలంగాణ ప్రభుత్వం అమలుచేయనున్న పంట పెట్టుబడి పథకం, పెరగనున్న సాగునీటి వసతి, పలు సంక్షేమ కార్యక్రమాలు, మార్కెటింగ్ రంగంలో తీసుకువచ్చిన సంస్కరణలతో 2022 నాటికి ఆదాయం రెట్టింపు అవుతుందని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హరియాణా, కర్ణాటకలలో అమలవుతున్న వ్యవసాయ మార్కెటింగ్ కార్యకలాపాలపై అధ్యయనం చేసి వచ్చిన మార్కెటింగ్ ఉన్నతాధికారుల బృందం మంగళవారం రాత్రి మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆయా రాష్ట్రాల్లో రైతులు వేసే పంటలు, దిగుబడులు, నిల్వ సదుపాయాలూ, మార్కెట్ యార్డుల పరిస్థితి, మద్దతు ధర, రైతులకు చెల్లింపులు, మార్కెట్ స్థిరీకరణ నిధి వంటి పెక్కు అంశాలపై తమ అధ్యయనాన్ని ఈ బృందం మంత్రికి వివరించింది. మహారాష్ట్రలో 30 ఏళ్లుగా కాటన్ మార్కెటింగ్ కార్పొరేషన్ పనిచేస్తున్నట్టు మార్కెటింగ్ అధికారులు మంత్రికి తెలిపారు. అలాగే ఆ రాష్ట్ర మార్కెటింగ్ సంస్థ కందులు కొనుగోలు చేసి, పప్పులుగా మార్చి మధ్యాహ్న భోజన పథకానికి, హాస్టళ్లకు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. మధ్యప్రదేశ్ లో ''భావంతర్ భుగ్తాన్ '' పేరిట అమలు చేస్తున్న కార్యక్రమాన్ని మంత్రికి వివరించారు. ఈ పథకం కింద కనీస మద్దతు ధర కన్నా మార్కెట్లో రైతులకు తక్కువ ధర పలికిన సందర్భాల్లో మిగతా డబ్బును నష్టపరిహారం కింద ఆ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చెల్లిస్తున్నదని మార్కెటింగ్ అధికారులు తెలియజేశారు. ఎమ్మెస్పీతోపాటు తమ రైతుల కోసం ''సరాసరి ధర''ను మధ్యప్రదేశ్ అమలుచేస్తున్నదని చెప్పారు. ధరల స్థిరీకరణ కింద రూ. 4,000 కోట్లను మధ్యప్రదేశ్ సమకూర్చిందని మార్కెటింగ్ అధికారులు చెప్పారు. హరియాణాలో ఉల్లి, టమాటా, క్యాలిఫ్లవర్ వంటి కూరగాయలను పండించే ముందే ఆయా పంటలు, వాటి దిగుబడి అంచనాతో ప్రాథమిక ధరను ప్రభుత్వం ఖరారు చేస్తున్నదని చెప్పారు. కర్ణాటకలో దాదాపు పదేళ్లుగా ధరల స్థిరీకరణ నిధి అమలు చేస్తున్నట్టు మార్కెటింగ్ అధికారులు మంత్రికి చెప్పారు. మద్దతు ధర రాని పక్షంలో ప్రభుత్వం వివిధ పద్ధతుల్లో సహకరిస్తున్నదని,ఆర్థిక సహకారం అందిస్తున్నదని తెలిపారు.ఈ నాలుగు రాష్ట్రాల అధ్యయన నివేదికను సీఎం కేసీఆర్‌ను సమర్పించిన తర్వాత తగిన నిర్ణయాలు తీసుకుం టామని మంత్రి హరీశ్ రావు తెలిపారు. వ్యవసాయ పనులు ప్రారంభించే నాటి నుంచి పంట దిగుబడి మార్కెట్ కు వచ్చేంతవరకు, ఆతర్వాతవాటి కొనుగోలుకు తీసుకుంటున్న చర్యలు, రైతులకు తప్పనిసరిగా మద్దతు ధర లభించేలా జరుపుతున్న కృషిలో తెలంగాణ ఇతర రాష్ట్రాల కన్నా అగ్రగామిగా ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు.తాజా కూరగాయలతో నడుపుతున్న ''మన కూరగాయలు'' ఔట్‌లెట్‌ల సంఖ్య 100కు పెంచాలని మంత్రి ఆదేశించారు.ఈ సమావేశంలో మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ బాయి, జాయింట్ డైరెక్టర్ లక్ష్మణుడు తదితరులు పాల్గొన్నారు.



20కి.మీ. మేర ట్రాఫిక్ జామ్

- ములుగు నుంచి వస్రా వరకు నిలిచిన వాహనాలు

ములుగు రూరల్, జనవరి 31(మనం న్యూస్)ః మంగళవారం రాత్రి 12 గంటల నుండి బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకు సుమారు 12 గంటల కాల వ్యవధిలో 20 కిలోమీటర్ల పొడవునా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచాయి. ములుగు నుండి మేడారం వెళ్లాలంటే మామూలుగా అయితే గంటన్నర సమయం పడుతుండగా నేడు మాత్రం 6 నుండి 7 గంటలు పట్టింది. ములుగు నుండి పస్రా వరకు నాలుగు వరుసలుగా వాహనాలు నిలిచాయి. భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అవసరమైన సేవలు అందించడంలో అధికారులు విఫలమయ్యారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేడారం జాతరకు ఇందిర, గరుడ బస్సులు నడిపిస్తామని చెప్పిన ఆర్టీసి అధికారులు ఎర్ర బస్సులు వేశారు. ప్రైవేట్ వాహనాల్లో వెళ్లే భక్తులు పార్కింగ్ ప్లేసులో కూడా నిలువకుండా పంపిస్తే ఇంత ట్రాఫిక్ జామ్ అయ్యిందంటే అది అధికారుల నిర్లక్ష్యమేనని వారు చెబుతున్నారు.

ట్రాఫిక్ జామ్ వల్ల గర్భిణి మృతి.. బిడ్డ క్షేమం


దేశంలో అతిపెద్దదైన మేడారం జాతరకు దేశ నలుమూలల నుండి అధిక సంఖ్యలో బుధవారం ఉదయం భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ములుగు గట్టమ్మ నుండి పస్రా వరకు దాదాపు 4 నుండి 5 గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది. నిర్మల్ జిల్లా సాప్టమ్ గ్రామానికి చెందిన గర్భిణి ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకొని మరణించింది. ఆమె కడుపులో పాప క్షేమంగా ఉంది. స్థానిక సబ్ రిజిస్ట్రార్ ఆర్థిక సహాయం చేసి ప్రైవేట్ వాహనాన్ని మాట్లాడి వారి స్వగ్రామానికి వారిని పంపించారు. ఇలాంటి ఘటనలు మరోమారు జరగకుండా చూసుకోవాలిని ప్రజలు కోరుతున్నారు.

రేపు సమ్మక్క-సారలమ్మపై రేడియోలో నాటకం ప్రసారం

హైదరాబాద్, జనవరి 31 (మనం ప్రతినిధి) : ఆసియాలో అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధిచెందిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరపై రూపొందించిన 'కుంకుమ భరిణ' నాటకం శుక్రవారం రేడియోలో ప్రసారం కానుందని ఆకాశవాణి అధికారులు బుధవారం తెలిపారు. మేడారం జాతర నేపథ్యంలో సింగరేణి కాలరీస్ కంపెనీకి చెందిన ఘణాశంకర్ పూజారి రచించారు. రాఘవులు దర్శకత్వం వహించారు. ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రం ఆధ్వర్యంలో చారిత్రక కోణంలో ఈ నాటకాన్ని రూపొందించారు. సమ్మక్క-సారలమ్మల జీవితం, వీర మరణం, గిరిజనులకే కాక యావత్ దేశానికి ఆరాధ్యాదైవాలుగా మారిన అంశాలను నాటకంలో పొందు పర్చారు. ప్రముఖ రేడియో కళాకారులు ఈ నాటకంలో నటించారు. ఈ నెల 2వ తేదీ ఉదయం 11 గంటలకు హైదరాబాద్ కేంద్రం నుంచి ఈ నాటకం ప్రసారం కానుంది. రాష్ట్రంలోని ఇతర రేడియో కేంద్రాలు కూడా ప్రసారం చేయనున్నాయి.

కేటీపీఎస్ బాయిలర్ ట్రయల్‌రన్

- సీఎండీ ప్రభాకర్‌రావుకు కేసీఆర్ అభినందనలు



హైదరాబాద్, జనవరి 31: తెలంగాణ విద్యుత్ రంగంలో మరో ఘన విజయం చోటు చేసుకుంది. కేటీపీఎస్ ఏడవ దశ నిర్మాణంలో భాగంగా బుధ వారం బాయిలర్‌ను వెలిగించి ట్రయల్‌రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో-జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుకు సీఎం కేసీఆర్ ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. పనుల్లో వేగం సాధించాలనే లక్ష్యాలతో విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాన్ని ప్రభుత్వరంగ సంస్థలకు అప్పగిం చామని, ఈ లక్ష్యం నెరవేరుతుండడం సంతోషకరమన్నారు. తక్కువ సమయంలో నిర్మిస్తున్న కేటీపీఎస్‌ను స్ఫూర్తిగా తీసుకుని భద్రా ద్రి, యాదాద్రి ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని పిలుపునిచ్చారు. తెలంగా ణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా విద్యుత్ ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని సీఎం అభినందించారు.

గురుకుల రాత ఫలితాలు విడుదల

- ఈ నెల 7-9 మధ్య సర్టిఫికెట్ల పరిశీలన

హైదరాబాద్, జనవరి 31: వివిధ సొసైటీల్లోని గురుకులాలకు నిర్వహించిన ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ల రాత పరీక్ష ఫలితాలను టీఎస్‌పీఎస్సీ బుధవారం ప్రకటించింది. ఒక్కో పోస్టుకు ఇద్దరు అభ్యర్థుల చొప్పున మొత్తం 963 మందిని సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపిక చేసింది. ఫిబ్రవరి 7 నుంచి 9వ తేదీ వరకు నగరంలోని మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది.

ప్రతీ గ్రామానికి భగీరథ నీళ్లు: వేముల

హైదరాబాద్, జనవరి 31 (మనం ప్రతినిధి): ఈ నెల 5 నుంచి రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి దశల వారీగా మిషన్ భగీరథ నీటిని సరాఫరా చేస్తామని భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఈ ఎండాకాలం నుంచి నీటి సరాఫరాకు ప్రత్యేకంగా ఎలాంటి నిధులు విడుదల చేయవద్దని ఆదేశించారు. బుధవారం సచివాయంలోని తన కార్యాలయంలో మిషన్‌భగీరథ సివిల్, ఎలక్ట్రో మెకానికల్ పనులపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. దాదాపు 8 గంటలపాటు సాగిన సమావేశంలో ఎలక్ట్రో మెకానికల్ పనుల ప్రస్తుత స్థితి, పనులు పూర్తయ్యే తేదీలపై చర్చించారు. పనులు ఆలస్యంగా జరుగుతున్న చోట గ్యాంగులను పెంచడంతోపాటు ఇతర సౌకర్యాలను కల్పించేలా అధికారులను ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యంగా ఉంటే బ్లాక్ లిస్ట్ చేయడానికి కూడా వెనుకాడమన్నారు. ఈ సమీక్షలో సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఈఎన్సీ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సహకార సంఘాల' గడువు పొడిగింపు

హైదరాబాద్, జనవరి 31(మనం ప్రతినిధి): రాష్ట్రంలోని సహకార సంఘాల పాలకవర్గం పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తున్నామని క్యాబినెట్ సబ్ కమిటీ ప్రకటించింది. సహకార సంఘాల పదవీకాలంపై చర్చించేందుకు రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు, ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవాదాయ శాఖ మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డితో కూడిన క్యాబినెట్ సబ్ కమిటీ బుధవారం సచివాలయంలో సమావేశమయ్యింది. ఈ సందర్భంగా మంత్రి పోచారం మాట్లాడుతూ రాష్ట్రంలోని 456 సహకార సంఘాల పదవీ కాలంలో ఈ నెలాఖరుతో ముగియనుందని, 427 సంఘాల పదవీ కాలం ఫిబ్రవరి మూడో తేదీతో ముగుస్తుందన్నారు. కాగా, సహకార సంఘాలతో పాటు జిల్లా, రాష్ట్ర సహకార కేంద్ర బ్యాంకుల పాలకవర్గాల పదవీకాలాన్ని కూడా మరో ఆరు నెలలు పొడిగిస్తూ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఆరు నెలలలోపు మరోసారి సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. ఈ సమావేశంలో టీఎస్‌క్యాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పాల్గొన్నారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
గురువారం, ఫిబ్రవరి 1

జమిలి జగడం

దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల ప్రక్రియ మళ్లీ చర్చనీయాంశమైంది. ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశంలోనే కాకుండా, ఈసారి ఏకంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పార్లమెంటు ప్రసంగంలోనూ జమిలి ఎన్నికల ప్రస్తావన రావడంతో రాజకీయ వర్గాల్లో మళ్లీ కలకలం మొదలైంది. ఈ అంశంపై జాతీయ పార్టీలు, ప్రాంతీయ తదితర అస్తిత్వవాద పార్టీలు భిన్నమైన వైఖరులతో ఉన్నాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు జమిలి ఎన్నికల నిర్వహణను సమర్థిస్తుండగా, వామపక్షాలు, ప్రాంతీయ పార్టీలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయి. విభిన్న జాతులు, సంస్కృతులు కలిగిన విశాల దేశంలో ఏకకాల ఎన్నికల నిర్వహణ ప్రాంతీయ పార్టీల ఆకాంక్షలను మరుగు పరుస్తుందని ప్రాంతీయ పార్టీల వాదన. విడతల వారీగా ఎన్నికల నిర్వహణను కాలహరణంగాను, ఎన్నికల కోడ్ వల్ల అభివృద్ధి పథకాల అమలుకు ఆటంకంగాను, డబ్బు ఖర్చుగాను పరిగణించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అవి భావిస్తున్నాయి. అదీకాక ఏ కారణంగానైనా గడువులోపు ఎన్నికలు జరపకుండా సుదీర్ఘకాలం కొనసాగే నిరంకుశ రాజ్యాలు ఏర్పడే ప్రమాదముందని కొందరు రాజకీయ నిపుణుల అభిప్రాయం. ఏకకాలంలో ఎన్నికలు జరిగితే ఏదైనా ఒక్క పార్టీకే ఓటేసే అవకాశాలు 77 శాతం వరకూ ఉన్నాయని విశ్లేషకుల అభిప్రాయం.

జమిలి ఎన్నికలు నిర్వహణ ప్రతిపాదన 2012లో బీజేపీ కురువృద్ధ నాయకుడు ఎల్.కె.అద్వానీ ముందుకు తెచ్చారు. అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి ఈ విషయం ప్రత్యేకంగా లేఖ రాశారు. అయితే 2014 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ తిరుగులేని పార్టీగా విజయం సాధించిన నేపథ్యంలో దాన్ని సుస్థిరం చేసుకునేందుకు, దేశవ్యాప్తంగా విస్తరించేందుకు జమిలి ఎన్నికలే ప్రధాన సాధనంగా భావిస్తూ నరేంద్ర మోదీ రెండేళ్ల క్రితం ఈ ప్రతిపాదనను మరోసారి తెరపైకి తెచ్చారు. దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కేవలం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కింలలోనే జమిలి ఎన్నికలు జరుగుతున్నాయి. ఒకేసారి ఎన్నికలు ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీస్తుందని, జాతీయ అంశాలు ప్రాంతీయ ఆకాంక్షలను అధ్యారోపిస్తాయనే వాదనను ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో జరుగుతున్న జమిలి ఎన్నికలే పూర్వ పక్షం చేశాయి. అదీకాక అత్యవసరమైన అభివృద్ధి పథకాల అమలుకు ఎన్నికల సంఘం మినహాయింపులు ఇస్తున్న నేపథ్యంలో సాధారణ పాలన కుంటుపడుతుందన్న విమర్శ సహేతుకంగా లేదు. అయితే విడివిడిగా ఎన్నికలు జరుగుతున్న సమయంలో దేశ ప్రధాని నుంచి వివిధ రాష్ట్రాల ముఖ్య నేతలు తరలివచ్చి ఆ రాష్ట్ర ఎన్నికల్లో ప్రచారం చేయడం, ఉప ఎన్నికల సందర్భంలో ఆ రాష్ట్ర మంత్రివర్గమంతా తమ అభ్యర్థులను గెలిపించుకోవడంలో అధికార దుర్వినియోగానికి పాల్పడడం ఆనవాయితీగా వస్తోంది.

స్వాతంత్ర్యానంతరం 1951–52 సార్వత్రిక, శాసనసభ ఎన్నికలు జమిలి ఎన్నికల ప్రక్రియ జరిగింది. అయితే కేరళ, పంజాబ్ రాష్ట్రాలు కొత్తగా ఏర్పడటం, ఆ తర్వాత అక్కడి అధికార పక్షాలు మెజారిటీ కోల్పోవడంతో 1954లో ఆ రాష్ట్రాలలో మధ్యంతర ఎన్నికలు జరగడంతో దేశంలో విడివిడి ఎన్నికల ప్రక్రియ మొదలైంది. 1967 తర్వాత తరుచూ రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు మెజారిటీ కోల్పోయి మధ్యంతర ఎన్నికలు జరగడమనే ధోరణి ముందుకొచ్చింది. దాంతో దేశవ్యాప్తంగా ఏదో ఒక ప్రాంతంలో ఎన్నికలు జరుగుతుండడం ఒక రాజకీయ దృగంశంగా మారింది. 1990ల తర్వాత ప్రపంచీకరణ ప్రక్రియ పర్యవసానంగా ఉనికిలోకి వచ్చిన వ్యక్తిగత విశ్వాసాలు, ఉద్వేగాల పునాదిగా ప్రజాభిప్రాయం రూపొందుతున్న సత్యానంతర (పోస్ట్ ట్రూత్) సంకీర్ణ రాజకీయ యుగంలో విడివిడి ఎన్నికల నిర్వహణ ఒక అనివార్యమైన పద్ధతిగా స్థిరపడింది. దాంతో చట్టసభల్లో తగినంత మెజారిటీ లేనపుడు విపక్ష సభ్యులను లోబర్చుకోవడమనే రాజకీయ విన్యాసం ఉభయ తెలుగు రాష్ట్రాలతో సహా దేశవ్యాప్తంగా ఉనికిలోకి వచ్చింది. ప్రాంతీయ తదితర అస్తిత్వ పార్టీలను బుజ్జగించే సంకీర్ణ రాజకీయాలు జాతీయ పార్టీలకు తలనొప్పిగా మారినమాట నిజమే. 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం, సంకీర్ణ కూటముల (ఎన్డీఏ, యూపీఏ) పాలనా వైకల్యం తదితర కారణాల నేపథ్యంలో దేశంలో ఒకే జాతీయ పార్టీ బీజేపీ పాలన ఏర్పడింది. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు సుదర్శన్ నాచియప్పన్ నాయకత్వంలోని పార్లమెంటు స్థాయీ సంఘం అధ్యయనం ఒకేదఫా ఎన్నికల నిర్వహణ సరైనదేనని తేల్చి చెప్పింది. జమిలిగా లేదా దఫదఫాలుగా నిర్వహించే ఎన్నికలు ఏవైనా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఎన్నికలు వాగ్దానాలన్నీ గాలికొదిలి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నాయి. మీడియా, ప్రతిపక్షాల నోళ్లు నొక్కేస్తున్నాయి. న్యాయ వ్యవస్థ సహా రాజ్యాంగ వ్యవస్థల స్వయంప్రతిపత్తిని కాలరాస్తున్నాయి. కొన్ని దేశాల్లో మాదిరిగా రికాల్ హక్కు లేనప్పటికీ, హామీలు అమలు చేయని అధికార పక్షం ప్రవేశపెట్టే విధానాలను స్తంభింపచేసే, రికాల్ చేసే రాజ్యాంగ పరమైన అవకాశమున్నప్పటికీ ఆచరణలో అది అసాధ్యంగా తయారైంది. ఆశ్రిత కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను నెరవేర్చే, నేరపూరిత రాజకీయాలు మారనంత వరకు ఎన్నికలు ఏ రూపంలో జరిగినా ఫలితమొక్కటే!



మంచిమాట



'ఎదుగుదల కనపడడం లేదనే చింతన వలదు..!! మహా వృక్షమైనా సరే మౌనంగానే ఎదుగుతుంది..!! నీ ప్రయత్నం నీవు చేయి... ఫలితం మాత్రం భగవంతునికి వదిలేయి.'

- రామకృష్ణ పరమహంస

ఫోర్త్ ఎస్టేట్ ప్రజా విపక్షం




వెన్నెలకంటి రామారావు
సెల్ : 9550367536

ప్రతిఫలనం

వార్తా మాధ్యమాలను 'ఫోర్త్ ఎస్టేట్' అని పిలవడం నెపోలియన్ కాలం నుంచి ప్రారంభమైంది. విశిష్ట రాజకీయ అధికారాలున్న ఒక ప్రధాన రాజకీయ లేదా సామాజక సమూహం లేదా వర్గాన్ని ఎస్టేట్ అని పిలుస్తారు. పారిశ్రామిక విప్లవ సమయంలో యూరోపియన్ సమాజంలోని సామాజిక అధికార కేంద్రాలుగా పనిచేసే ప్రజా సమూహాలను మతాధికారులు, కులీనులు, సామాన్యులు అనే విభజనతో కూడిన అంతస్తులను థర్డ్ ఎస్టేట్‌గా పరిగణిస్తారు. ఈ మూడు అంతస్తులకు తోడు సమాజాన్ని ప్రభావితం చేసే నాల్గవ శక్తిగా వార్తాపత్రికలు రంగంలోకి రావడంతో వార్తా మాధ్యమాన్ని నాల్గవ ఎస్టేట్‌గా (ప్రాబల్యశక్తి) పరిగణించారు. ఇంగ్లీషు మినహా ఇతర యూరోపియన్ భాషలలో రాజ్యంలోని శాసన, న్యాయ, కార్యనిర్వాహక శాఖలను ఎస్టేట్‌లుగాను, మీడియాను ఫోర్త్ ఎస్టేట్‌గా పిలిచేవారు. అయితే భారత ప్రథమ ప్రధాన మంత్రి జవహర్లాల్ నెహ్రూ ఈ రెండు భావనలకు భిన్నంగా రాజ్యంలోని (సమాజంలోని ప్రజా సమూహాలు కాదు) నాలుగు ఎస్టేట్ (విభాగాలు)లను తీసుకొచ్చి ప్రజాస్వామిక సౌధానికి నాలుగు స్తంభాలుగా మార్చివేశారు.

మానవ సమాజం పరిణామంలో ఉనికిలోకి వచ్చిన బానిస, ఫ్యూడల్, పెట్టుబడిదారీ వ్యవస్థల్లాగా ఒక భౌతిక సామాజిక వ్యవస్థగా ప్రజాస్వామ్యాన్ని పరిగణించరాదు. పైన పేర్కొన్న సామాజిక వ్యవస్థలన్నిటిలో మెజారిటీ ప్రజల అభిప్రాయం మేరకు ఆధిపత్యవర్గాల మధ్య అధికార పంపక ప్రక్రియగా ప్రజాస్వామ్యం ఉంటుంది. అంటే ప్రజాస్వామ్యమనేది అన్ని సామాజిక వ్యవస్థల్లో పాలనాధికార కేంద్రాన్ని ఏర్పాటు చేసుకునేందుకు పాటించే ప్రక్రియ మాత్రమే. ఆ తర్వాత అది క్రమంగా వివిధ రాజకీయ పక్షాలు ఒకరి విధానాన్ని మరొకరు విమర్శించే 'అపవాదు'గా మారింది. ప్రజాస్వామ్య ప్రక్రియ బానిస వ్యవస్థలో బానిసలకు, ఫ్యూడల్ వ్యవస్థలో అర్ధబానిసలకు, పెట్టుబడిదారీ వ్యవస్థలో చాలాకాలం పాటు వేతన బానిసలైన శ్రమజీవులకు, ఆధునిక వ్యవస్థలో తప్ప మిగిలిన అన్ని చారిత్రక వ్యవస్థలలోనూ మహిళలకు వర్తించ లేదు. ఆధునిక సమాజంలో సార్వజనీన ఓటు హక్కు ఏర్పడిననాటి నుంచి ప్రజాస్వామ్యమనేది వ్యవస్థలోని ఆధిపత్య వర్గాల ప్రయోజనాలకు అనుగుణంగా పాలన చేపట్టే ఒక కార్యనిర్వాహక వర్గం(ప్రభుత్వం) ఏర్పాటుకు అంటే రాజకీయ, పాలనా అధికారాన్ని పాలకవర్గాలు సొంతం చేసుకునేందుకు ఎన్నికల రూపంలో జరిగే ఒకతంతు (ఉపరితల విన్యాసం)గా ప్రజాస్వామ్య ప్రక్రియ ఉనికిలోకి వచ్చింది. పైకి అది ప్రజలందరి అభీష్టం మేరకు ప్రజాప్రతినిధులను ఎన్నుకున్నట్లు కనపడినా, అంతస్సారంలో సమాజంలోని ఆర్థిక, సామాజిక ఆధిపత్య వర్గాల్లోని ఒక ముఠా ప్రయోజనాలను నెరవేర్చే కార్యనిర్వాహక వర్గాన్ని శాసన వ్యవస్థ రూపంలో కొంతకాలం పీఠంపై కూర్చోబెట్టడం తప్ప వేరు కాదు. పాలక భావజాలంతో ఉన్న ప్రజానీకంలోని మెజారిటీ పాలకవర్గాలలోని ఒక ముఠాను అధికారపీఠంపై కూర్చోబెట్టే ప్రక్రియే ఎన్నికలు. ఈ ప్రక్రియను ప్రజాస్వామిక ప్రక్రియగా పిలుస్తారే గానీ దానికదే ఒక సామాజిక వ్యవస్థగా పరిగణించకూడదు. అయితే ఆ ప్రక్రియను నెహ్రూ ఒక భౌతికరూపాన్ని సంతరించుకున్న ఆ వర్చువల్ ప్రజాస్వామిక సౌధంగా అభివర్ణిస్తూ, రాజ్యంలోని విభాగాలైన శాసన, న్యాయ, కార్యనిర్వాహక విభాగాలను స్తంభాలుగా నిలబెట్టడం కేవలం 'అసంబద్ధత' తప్ప హేతుబద్ధమైన సూత్రీకరణ కాదు.

సామాజిక శాస్త్రాలను బట్టి రాజ్యం శాసన, న్యాయ, కార్యనిర్వాహక విభాగాలతో పాటు రక్షణ విభాగాన్నీ (సైన్యం, పోలీసు వ్యవస్థలు) పరిగణనలోకి తీసుకొని నాలుగు ఎస్టేట్‌లుగా గుర్తించాలి. అంతేగాని రాజ్యం విభాగాల్లో మీడియాను కూడా చేర్చి ప్రజాస్వామ్య సౌధానికి నాలుగు స్తంభాలని తప్పుగా సూత్రీకరించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే.



> స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో జాతీయోద్యమ స్ఫూర్తితో పత్రికారంగం గుబాళించేది. 1980వ దశకం చివరికల్లా జాతీయోద్యమ కాలంనాటి సామాజిక విలువలు భారతదేశ మీడియాలో క్రమంగా సన్నగిల్లాయి. సోషలిజం, ప్రజాస్వామ్య భావాల స్థానంలో లాభార్జనే పరమలక్ష్యమన్న విలువలు చోటు చేసుకున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో మీడియాలో ఆదర్శాలు అంతరించి ఆస్తి సంపాదన ఆధి పత్యం వహిస్తోంది. కులం, మతం, ప్రాంతాల్లాంటి పలు సామాజిక వికారాలు జర్నలిస్టుల్లో పరాకాష్ట కు చేరుకున్నాయి. తదనుగుణమైన లాబీలు, ముఠాలు ఏర్పడి పరస్పరం కీచులాడుకుంటున్నాయి.


అమెరికాలో మీడియాను ప్రభుత్వంలో నాల్గవశాఖ (ఫోర్త్ బ్రాంచ్)గా పరిగణిస్తారు. ప్రభుత్వ యంత్రాంగంలో మీడియాను అంతర్భాగం చేస్తే మీడియా స్వేచ్ఛకు అర్థమేముంది? రాజ్యంలోని నాలుగు విభాగాలు (నెహ్రూ అన్నట్లు నాలుగు స్తంభాలు) ప్రజాస్వామికంగా నడిస్తే ప్రభుత్వాలు జనరంజక పాలనను అందించగలవేగానీ, ఆ విభాగాలు సవ్యంగా నడిస్తేనే ప్రజాస్వామ్య సౌధం పటిష్ఠంగా ఉంటుందనడంలో అసలు అర్థమేలేదు. నెహ్రూ స్తంభాల పోలిక ఆలవోకగా చేసిన పొరపాటు సూత్రీకరణ ఎంతమాత్రమూ కాదు. మీడియాను రాజ్యయంత్రాంగంలో ఒక శాఖగా పనిచేయాలన్నది ఆయన అంతరార్థంగా గుర్తించాలి. మీడియాను 'నాల్గవ స్తంభం', 'ఫోర్త్ ఎస్టేట్' అనే అర్థరాహిత్యాన్ని తలకెక్కించుకొన్న జర్నలిస్టు మేధావులు ఈ మీడియా స్వేచ్ఛను ప్రభుత్వాల, రాజకీయ పక్షాల, వాణిజ్య వేత్తల, కార్పొరేట్ శక్తుల, వివిధరకాల మాఫియా, ఫ్యాక్షనిస్టుల కార్యకలాపాల పక్షపాత కథనాలలో, వాళ్లందించే నజరానాలలో, పెట్టుబడులలో చూసుకుంటున్నారు. సామ, దాన, భేద దండోపాయాలతో మీడియాను పంచమాంగ దళంగా మార్చుకునే క్రమం రెండు తెలుగు రాష్ట్రాలు సహా దేశవ్యాప్తంగా నడుస్తోంది. కార్పొరేట్, ప్రభుత్వ విధానాల కుంభకోణాలపై సంచలన కథనాలను ప్రచురించిన మీడియా సంస్థలు, పక్షపాత రహితంగా వార్తల్ని వార్తలుగా ఇస్తూ, ప్రజాపక్షం వహిస్తామని గంభీర ప్రకటనలు చేసిన దినపత్రికలు సైతం అంతిమంగా ఏదో ఒక రాజకీయ పక్షానికి అనుగుణంగా (బహిరంగంగా లేదా రహస్యంగా) మారిపోతున్నాయి. పత్రికలు ప్రజాపక్షంగా కనిపిస్తూ సారాంశంలో పాలకపక్షాలలో ఏదో ఒకదానితో లోపాయికారీ సంబంధాలతో ఉన్నాయి.

వార్తాపత్రికల నుంచి వార్తలు పరాయీకరణకు గురై వాటి స్థానాన్ని సంచలనాలు ఆక్రమించాయన్నది సర్వవిదితమే. ప్రపంచంలోని వివిధ సంఘటనలు, విషయాలకు సంబంధించి ఎలా? ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలుగా 'మెయిన్ పేజీ'ల కథనాలుండాలి, 'ఎందుకు?' అనే ప్రశ్నకు సమాధానంగా సంపాదకీయాలు, సంపాదకీయ వ్యాసాలు ఉండాలి. అలాంటిది నేడు సాధారణ వార్తలు సైతం సంపాదకీయాల్లా మారి, పక్ష, మాస పత్రికల్లాగా రాజకీయ, వ్యాపార ప్రయోజనాలకు అనువైన కథనాలు, వ్యాఖ్యానాలే ప్రముఖంగా ఉంటున్నాయి. ప్రజలు చదవరనీ, డ్రై సబ్జెక్టు అనే ప్రాధామ్యాల సాకుతో జాతీయ, అంతర్జాతీయ వార్తలు, రాజకీయ మనోవిశ్లేషణలు, విజ్ఞానశాస్త్రం, పర్యావరణం లాంటి విషయాలను దినపత్రికలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. దీర్ఘకాలిక ప్రయోజనం గల సామాజికార్థిక విధానాలు, ప్రజా సంక్షేమం లక్ష్యంగా గల విశ్లేషణలు తగ్గి, రాజకీయ పక్షాల ఎత్తులు, జిత్తులకు సంబంధించిన అంశాలకు ప్రాముఖ్యత పెరగడం లాంటి అవలక్షణాలు నేడు ప్రధాన స్రవంతి వార్తా పత్రికల స్వభావంగా మారింది. యాజమాన్యం మూలవిరాట్టుగా, సంపాదకులు ఉత్సవ విగ్రహాలుగా మారారు. తెలుగు భాష వికృతీకరణకు గురైంది. అదే సమయంలో వివిధ సామాజిక శాస్త్రాలు, ప్రకృతి శాస్త్రాలకు చెందిన భావనలు, పారిభాషిక పదాలు అందరికీ అర్థమయ్యే భాషలో ఉండాలనే పేరుతో తప్పుడు అర్థాలు వచ్చే పదజాలాన్ని తెలుగు మీడియా బాధ్యతా రహితంగా వాడుతూ ప్రజల్ని తప్పుదారి పట్టిస్తోంది. చందాదారులపై ఆధారపడడం కంటే 'లూజ్ సేల్స్' పైనే పత్రికలు ఆధారపడడంతో యాజమాన్యాలు, సంపాదకులు, విలేఖర్లు కలసి తొలిపుటను సింగారించడంపైనే కేంద్రీకరిస్తారు. సినిమా డైలాగులు, పేర్లతో, అంత్యప్రాసల విన్యాసాలతో, అర్థరహితమైన ద్విపద బంధాలతో, తెలుగు భాషను అడ్డంగా విరచి, ధ్వంసం చేస్తున్న తొలిపుట శీర్షికలతో ఆకర్షించేలా సింగారింపబడుతోంది. కోట్ల రూపాయల ప్రభుత్వ, వ్యాపార ప్రకటనలు రాబట్టుకునేందుకు పాలకుల, కార్పొరేట్ శక్తుల దయాదాక్షిణ్యాల కోసం వెంపర్లాడడంతో పత్రిక ప్రమాణాలు దిగజారిపోతున్నాయి. అర్థశాస్త్ర సూత్రాల ఓనమాలు తెలియని వారు బిజినెస్ పేజీ నడిపిస్తారు. సామాజిక శాస్త్రాల, సిద్ధాంతాల గురించి బొత్తిగా తెలియనివారు మెయిన్ పేజీలను, ఎడిట్ పేజీని, సాహిత్యంలో నిరక్షరకుక్షులు సాహిత్య పేజీని ఆలవోకగా నడిపించేస్తుంటారు. పీటీఐ వార్తాసంస్థ కథనాల పైపై పరిజ్ఞానంతో సర్వజ్ఞులుగా, మేధావుల్లా ఫోజులు కొడుతూ సున్నితమైన సామాజిక అంశాలను అడ్డదిడ్డంగా వండివారుస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు జన మాధ్యమాల రంగంలో పలు అప్రజాస్వామిక ధోరణులు, సామాజిక కుల, మత, జాతి ప్రాంత తదతర భావజాల వైపరీత్యాలు పరాకాష్ఠకు చేరుకున్నాయంటే అతిశయోక్తి కాదేమో!

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో జాతీయోద్యమ స్ఫూర్తితో పత్రికా రంగం గుబాళించేది. 1980వ దశకం చివరికల్లా జాతీయోద్యమ కాలంనాటి సామాజిక విలువలు భారతదేశ మీడియాలో క్రమంగా సన్నగిల్లాయి. సోషలిజం, ప్రజాస్వామ్య భావాల స్థానంలో లాభార్జనే పరమ లక్ష్యమన్న విలువలు చోటు చేసుకున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో మీడియాలో ఆదర్శాలు అంతరించి ఆస్తి సంపాదన ఆధిపత్యం వహిస్తోంది. కులం, మతం, ప్రాంతాల్లాంటి పలు సామాజిక వికారాలు జర్నలిస్టుల్లో పరాకాష్టకు చేరుకున్నాయి. తదనుగుణమైన లాబీలు, ముఠాలు ఏర్పడి పరస్పరం కీచులాడుకుంటున్నాయి. యాజమాన్యవర్గం తన ఉనికిని ధ్రువీకరించే మీడియా మేధావుల్ని సృష్టించుకుంది, లేదా అధమపక్షం ప్రలోభాలతో రూపాంతీకరణకు గురిచేసింది. ఆధునిక భారతీయ అమానవీయ సామాజిక స్వభావానికి సజీవ ప్రతిబింబంగా మీడియా రూపుదాల్చింది. మౌలిక సామాజిక పరిణామాలు మాత్రమే ఈ పరిస్థితిని చక్కదిద్దగలవు.

కార్పొరేట్‌పై కరుణ...రైతుకు నిరాదరణ

దేశంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసలెక్కువ అవుతున్నాయి. సమాజాలను నిర్మించడంలో సహజంగా పట్టణీకరణ అవసరమే. సమాజాల పురోగతిలో ఇది తగినదే! భారతీయుల్లో 400 మిలియన్ల మంది పట్టణ కేంద్రాల్లో నివాశితులై ఉండాలని ప్రపంచబ్యాంక్ నిర్దేశిస్తోంది. చివరకు 85 శాతం జనం నగరాల్లో నివసిస్తున్నారని కేంద్రమాజీ ఆర్థికమంత్రి పి.చిదంబరం ఒక సందర్భంలో అభిప్రాయపడ్డారు. దేశ జనాభా 1.3 బిలియన్‌లో 400 మిలియన్లమంది పట్టణ ప్రాంతాల్లో నివశిస్తుంటే మిగిలిన వారు గ్రామాల్లో ఉంటున్నారు. అభివృద్ధికి పట్టణీకరణే నమూనా వంటిదని కొంతమంది తేలిగ్గా భావిస్తారు. కానీ ఒకే విధానంతో సమాజాలు ఏర్పడవు. ఎక్కువ మంది పట్టణాల్లో నివశిస్తూ కొద్దిమంది మాత్రం గ్రామాల్లో ఆదాయం పెద్దగా సమకూర్చని వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నప్పటికీ దేశాల అభివృద్ధి పట్టణీకరణపైనే ఆధారపడి వుంటుందని విధాన నిర్ణయకర్తలు భావిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో నివశించేవారంతా అధికంగా రాయతీలపై ఆధారపడి బతుకు కడుభారంగా గడుపుతున్నారు. ప్రపంచ బ్యాంకు ఆదేశాల ప్రోత్సాహంతో మన రాజకీయ నాయకులంతా ఇదే కోరుకుంటున్నారు. యూరప్‌లో పెట్టుబడిదారీ విధానం, పట్టణీకరణ రెండూ సహజసిద్ధంగా ఉండవు.



భూ యజమానులు, పెరుగుతున్న పారిశ్రామికవేత్తలకు, రైతులకు మధ్య ఘర్షణలు, వివాదాలు సాధారణ అంశాలుగా కనిపిస్తున్నాయి. ఫలితంగా పట్టణీకరణ వివిధ స్థాయిలకు, ఆధునీకతకు ఈ పోరాటాలు ఏర్పడుతున్నాయి. పెట్టుబడి ఆవిష్కరణ పుస్తకంలో రైతులు అదృశ్యంగా దృగ్గోచరం కాని చేతిలో కీలుబొమ్మలుగా ఫ్యాక్టరీ కూలీగా అవతరిస్తున్నారని ఆర్థిక చరిత్రకారుడు మైఖేల్ పెరెల్‌మెన్ వివరిస్తాడు. అంటే రైతు కాస్త ఫ్యాక్టరీ కూలీగా అవతరిస్తాడన్నమాట. అయితే, విదేశాల్లోని ముఖ్యంగా యూరప్ దేశాల్లో రైతుకూలీలు తమ గ్రామీణ జీవనవిధానాన్ని వదిలిపెట్టరు. తమ భూమిని వదిలిపెట్టి జీవనోపాధికోసం కొత్తగా పుట్టుకొచ్చిన పారిశ్రామిక పెట్టుబడులతో నిర్మించిన అపాయకర ఫ్యాక్టరీల్లో కూలీలుగా పనిచేసేందుకు సుముఖంగా ఉండరు. సంప్రదాయంగా వస్తున్న విధానాలను చెదరగొట్టి రైతులను కూలీలుగా మార్చేందుకు ఎన్నో చట్టాలు, విధానాలు ముంచుకొస్తున్నాయి. సామాన్యులతో ఎటువంటి సంబంధాలు లేకుండా అడ్డుగోడలు నిర్మిస్తూ రైతుల్ని వారి భూములకు దూరంచేసేలా పుట్టుకొచ్చిన ఎన్నో చట్టాలను, విధానాలను పెరెల్‌మెన్ వివరిస్తాడు. గతంలో రైతులు తమ భూములతో ఎలా సౌకర్యవంతంగా ఉండేవారో, సక్రమ దోపిడీకి అనుగుణంగా ఎలా సహకరించేవారో ప్రారంభంలో పెట్టుబడిదారులు, వారి ప్రోత్సాహకులు తెలుపుతుంటారు. వారి దారిద్ర్యాన్ని ఆసరాగా తీసుకుని ఏ విధంగా వారిని భూములు వదిలిపెట్టి ఫ్యాక్టరీల్లో తక్కువ వేతనాలకు పనిచేసేలా చేసేందుకు ప్రముఖవ్యక్తులు మార్గాలు సూచించారు. ఈ విధంగా స్వయం ప్రతిపత్తితో జీవించే రైతుల్ని వారి భూముల నుంచి దూరంచేసి తరిమివేయబడ్డారు. కార్మికవర్గానికి స్వీయ ఆధారపడే విధంగా స్వీయవిద్య, పునర్వినియోగ ఉత్పత్తుల, పొదుపు తదితర ప్రయోజనాలను ప్రారంభంలో ఆశజూపినా క్రమక్రమంగా ప్రకటనల ద్వారా, పెట్టుబడిదారీ విధానంతో తయారైన ఉత్పత్తుల క్షంగా విదేశీపెట్టుబడులు అనేవి వినడానికి, చెప్పుకోవడానికి ఎంతో గౌరవప్రదంగా కనిపిస్తాయి. తద్వారా మేకింగ్ ఇండియా, వ్యవసాయాన్ని వ్యాపారంగా మరల్చడం వంటి పదాలు ప్రపంచబ్యాంక్, కార్పొరేట్ వాక్చాతుర్యంతో ఎంతో ఆకర్షణీయంగా తలుస్తాము. ఇంగ్లండ్‌లో తొలి పారిశ్రామిక పెట్టుబడులతో రైతుల పాలిట తయారైన విధంగానే భారతీయ రైతుల పాలిట కూడా క్రూరంగా తయారవుతాయి. ఇంగ్లండ్‌లోని రైతుల మాదిరిగా భారతీయ రైతుల్ని కూడా వారి భూములనుంచి, వ్యవసాయం నుంచి దూరంగా పారదోలే చర్యలుగానే వీటిని భావించాలి. చౌక ఆహారం పేరుతో రైతుల్లో దారిద్ర్యాన్ని పెంచేందుకు మాత్రమే జీడీపీవృద్ధి అగ్నిలో ఆజ్యంలా దోహదపడుతోంది. వారిఆదాయం, ప్రభుత్వరంగంలో పనిచేస్తున్న వారు సహా మిగిలిన జనాభాకు మధ్య తారతమ్యం మరింత విస్తారమైంది. 40 ఏళ్ల క్రితం ఉన్న గ్రామీణవాతావరణానికి, ప్రస్తుతానికి ఎంతో తేడా ఉంది. మరోపక్క కార్పొరేట్ రంగానికి మరింత ఆధారంగా తొలగించేశారు. 'అట్టడుగువారి అభ్యున్నతిని, పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని మేము సైబర్ నగరాలను, సాంకేతిక పార్కులను, ఐటీలను నిర్మిస్తాం. ఇందుకు రైతులు ఏ విధంగా సహకరిస్తారో లేదో అనే దానితో మాకు సంబంధం లేదు. మిలియన్ల మంది పేదలు ఏవిధంగా దుర్భరంగా జీవిస్తున్నారో అర్థంచేసుకోవడంలో మేము విఫలురమయ్యాం. ఆధునిక విమానాశ్రయాలు, ప్రధాన రహదారులపై బ్రిడ్జిలు, ఐటీలు, కార్పొరేట్ల అవసరాలకు అనుగుణంగా పెట్టుబడులు పెట్టి, పేదలు పోగొట్టుకున్న వాటికి తగిన విధంగా కనీస అవసరాలు కల్పిస్తూ వారు అభివృద్ధి చెందేలా చూస్తా'మని పారిశ్రామిక వేత్తలు చెబుతున్నారు. పట్టణీకరణ పేరుతో దేశానికి ఆహారాన్ని అందించే రైతుల్ని వారు నిత్యం పడుతున్న కష్టాల నుంచి దూరం చేసే ప్రయత్నాలు చేపట్టడం లేదు. నగరవాసులు కూడా భిన్నంగా ఆలోచించడం లేదు. ఇదే అభిప్రాయాలు కలిగివున్నారు. రైతు రుణాల రద్దు ఆర్థికరంగంపై తీవ్రప్రభావం చూపుతుందని, అనుత్పాదకతకు, ప్రభావశూన్యతకు కారణమవుతుందని పెట్టుబడిదారులు, వారి ప్రోత్సాహకులు అభిప్రాయపడుతున్నారని పెరెల్‌మెన్ వ్యాఖ్యానించారు. నయా ఉదారవాదాలు భారతీయ రైతుల పాలిట డెత్ వారంట్ వంటిది. ప్రత్యక్షంగా హెచ్చుస్థాయిలో చేయూతలు, రుణాలు ఉదారంగా లభిస్తున్నాయి. ఉపాధి కల్పన పేరుతో వడ్డీలేని రుణాలు, రుణహామీలతో కార్పొరేట్‌రంగం వెలిగిపోతోంది. అదే వ్యవసాయం దగ్గరికొచ్చేసరికి ఎటువంటి చేయూతలుండవు; ప్రోత్సాహకాలుండవు. అయినప్పటికీ ఉత్పత్తిని అత్యధికస్థాయిలో పెంచేందుకు రైతులు చేస్తున్న కృషి అద్వితీయం. ఒకపక్క గిట్టుబాటు ధరలు లేక, రుణవిమోచన మార్గం కానరాక రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతూనే సమాజావసరాలకు తగిన విధంగా పంట దిగుబడిని సాధిస్తున్నారు. రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడు కనిపించడం లేదు. 1997 నుంచి ఆర్థిక సంక్షోభాలకు మూడు నుంచి నాలుగు మిలియన్ల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. రైతుల దుస్థితిపై, వారికి అందించాల్సిన సాయంపై అనేక నివేదికలు ఎన్నో సూచనలు చేశాయి. స్థానిక పంటలను ప్రోత్సహించడం, రైతుల ఆర్థికాభివృద్ధికి అనుగుణమైన వ్యవసాయ విధానాన్ని అమలులోకి తేవడం వంటి చర్యలు ఎన్నో బాధ్యతలు ప్రభుత్వంపై ఉన్నాయి.

◆ కాలిన్ టాడ్‌హంటర్

మన లేఖలు

టిఎస్‌పిఎస్‌సి పటిష్ఠ చర్యలు చేపట్టాలి

తెలంగాణ రాష్ట్రంలో ఫిబ్రవరి చివరి వారంలో ఉపాధ్యాయ నియామకాల రాత పరీక్షలు జరగబోతున్నాయి. అయితే గతంలో ఉద్యోగ నియామక రాతపరీక్షల్లో టెక్నాలజీని ఉపయోగించి మోసాలకు పాల్పడ్డ సంఘటనలు జరిగాయి. ఈసారి అలా జరగకుండా టిఎస్‌పిఎస్‌సి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. రాత పరీక్షల్లో బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టినా మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్, ఒకరికి బదులు మరొకరు పరీక్షలు రాస్తూ పట్టుబడుతున్నారు. కొన్నిచోట్ల ఇన్విజిలేటర్లను కూడా కొనేస్తున్నారు. దీంతో వాస్తవంగా కష్టపడి చదివిన విద్యార్థులు నష్టపోతారు. పరీక్షా కేంద్రాల్లో నిరుద్యోగ అభ్యర్థులు ఎలాంటి మోసాలకు పాల్పడకుండా అడ్డుకునేందుకు గాను టిఎస్‌పిఎస్‌సి పటిష్ఠ చర్యలు చేపట్టాలి. అన్ని టిఆర్‌టి పరీక్షా కేంద్రాల వద్ద తప్పనిసరిగా జామర్లని ఏర్పాటు చేయాలి.

- గూరుడు అశోక్,
గోదూర్, జగిత్యాల జిల్లా.

జాతరపేరిట ప్రజాధనం కైంకర్యం

ప్రపంచంలోనే అతిపెద్ద ఆదివాసుల జాతర సమ్మక్క – సారక్కల మహాజాతర. ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా జరుపుకునే జాతరను ప్రభుత్వం చేతుల్లోకి తీసుకొని వ్యాపారీకరణ చేయడంతో పర్యావరణ విధ్వంసం జరుగుతున్నది. ఈ జాతర అభివృద్ధికి ఏటా వందలకోట్ల ప్రజాధనాన్ని మంజూరు చేసి తాత్కాలిక ఏర్పాట్లుచేసి పబ్బం గడుపుకోవడం ఆనవాయితీగా మారింది. ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులకు కార్యకర్తలకు సంబంధిత కాంట్రాక్టర్లు, అధికార్లకు వరంగా మారింది. శాశ్వత ఏర్పాట్లు చేస్తే, తమకు తమ అనుచరవర్గానికేమీ లాభించదనే లోపాయికారీతనంతో కోట్లాది నిధులను కేటాయించాలని ప్రతిసారి డిమాండ్ వస్తున్నది. ఈ లోపాయికారీ అవినీతిపరులకు ఆదివాసి జాతరపేరిట అభివృద్ధి పనులు చేయటం కాదు. మంజూరయ్యే నిధుల మీదనే ప్రేమ. ఇప్పటికైనా ప్రభుత్వానికి నిజమైన ప్రేమాభిమానాలున్నట్లయితే జాతరకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలి.

-నల్లెల్ల రాజయ్య, వరంగల్
9989415571



వనదేవతలకు వందనం

5 KUTUMBAM హైదరాబాద్
మనం కుటుంబం
గురువారం, 1 ఫిబ్రవరి 2018
www.manamnews.com





తరలి వచ్చిన వనదేవత..

మొదలైన జనజాతర





వన దేవతల్లో ఒకరైన సారలమ్మ కన్నేపల్లి నుంచి బయలుదేరి ప్రదర్శనగా మేడారం తరలివచ్చింది. వివిధ రాష్ట్రాల నుంచి తండోపతండాలుగా తరలి వచ్చిన భక్తుల జయజయ ధ్వానాలు... సంతోషాల సందడి మధ్య... గిరిజన పూజారులు ముందు నడవగా తరలి వచ్చిన తల్లి గద్దెపై ఆసీనురాలయింది. భక్తుల కోర్కెలు తీర్చే ఆశీర్వాదాలివ్వడంతో జాతర ప్రారంభమైంది. ఈ సందర్భంగా మేడారం ప్రాంతంలో చోటు చేసుకున్న చిత్రాలు...



















ఓడితే సన్యాసం

(మొదటి పేజీ తరువాయి)



నిర్వహించిన బహిరంగసభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై మంత్రి నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ఎప్పుడు కూడా అభివృద్ధి గురించి ఆలోచించలేదని, ఆ పార్టీ అభివృద్ధి అనే విషయాన్నే మర్చిపోయిందని కేటీఆర్ అన్నారు. గద్వాలలో ఒకే రోజు రూ.45 కోట్లతో అభివృద్ధి పనులకు స్వీకారం చుట్టామంటే జిల్లా అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామనే విషయం అర్థమవు తుందని అన్నారు. ఇందులో భాగంగా గద్వాల మండల పరిధిలో పూడూర్ గ్రామంలో 14.98 కోట్ల రూపాయల నిధులతో చేనేత పార్కును ప్రారంభించామని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదేని, తాము చేస్తుంటే అడ్డుపుల్లలు వేస్తున్నారని చెప్పారు. కార్య క్రమంలో మంత్రులు లక్ష్మారెడ్డి, జూపల్లి కృష్ణా రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు నిరం జన్‌రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండ్ల క్రిష్ణమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త సీఎస్‌గా జోషి

(మొదటి పేజీ తరువాయి)

జోషి పదవిలో కొనసాగుతారు. మరోవైపు నూతన సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌కే జోషిని డీజీపీ మహేందర్ రెడ్డి, పలువురు అధికారులు సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఎస్పీ సింగ్ పదవీకాలం పూర్తి కావడం, పొడిగింపు లభించకపోవడంతో ఆయన స్థానంలో జోషిని నియమిస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. అందుకు అనుగుణంగా బుధవారం ఎస్‌కే జోషిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ సాధారణ పరిపాలనా శాఖ ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే! ఎస్‌కే జోషి సీఎస్‌గా నియమితులైన సందర్భంగా సచివాలయంలో పలువురు అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

రైల్వే ఇంజనీర్ నుంచి సీఎస్ దాకా..

ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో శంకర్‌లాల్ జోషి, శ్యామా జోషి దంపతులకు శైలేంద్ర కుమార్ జోషి జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం స్థానికంగానే పూర్తిచేసిన జోషి 6 నుంచి 8 వరకు తెలుగు థర్డ్ లాంగ్వేజ్ గా చదివారు. ఐఐటీ రూర్కీలో 1977–1981 మధ్య కాలంలో ఇంజినీరింగ్(ఈసీఈ) చదివారు. ఐఐటీ ఢిల్లీ నుంచి పీజీ చేశారు. 2010లో పీహెచ్‌డీ పట్టా పొందారు. అను రాధతో శైలేంద్ర కుమార్ జోషికి వివాహమైంది. జోషి కూతురు రిహ జోషి ఐఆర్ఎస్ ఆఫీసర్ కావడం విశేషం! ఐఏఎస్‌కు ముందు జోషి రైల్వేలో కొంతకాలంపాటు కమ్యూనికేషన్ ఇంజనీర్‌గా పనిచేశారు. ఈ ఉద్యోగానికి సంబంధించి హైదరాబాద్‌లోనే శిక్షణ పూర్తిచేశారు. అనంతరం 1984లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. నెల్లూరు అసిస్టెంట్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ అందుకున్నారు. అనంతరం తెనాలి, వికారాబాద్‌లలో సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. ఆపై కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. తర్వాత కేంద్ర సర్వీసులలో భాగంగా 9 ఏళ్ల పాటు అటవీ, పర్యావరణ శాఖలో పలు కీలక హోదాల్లో పనిచేశారు.

కేంద్ర సర్వీసుల్లో రెండు దఫాలుగా కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖలో జోషి పనిచేశారు. జర్మనీ, జోహన్నెస్‌బర్గ్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సుల్లోనూ మనదేశ ప్రతినిధిగా పాల్గొన్నారు. మేనేజ్ మెంట్ ఆఫ్ ట్రాన్స్ బౌండరీ వాటర్ రీసోర్సెస్ అనే పుస్తకాన్ని రచించారు. కృష్ణా జిల్లా కలెక్టర్‌గా, రాష్ట్రంలో మున్సిపల్, ఇరిగేషన్, ఐటీ, ఎనర్జీ, వైద్యారోగ్యం, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విశేష సేవలందించారు.

ప్రభుత్వ లక్ష్యాలు చేరుకోవడమే ఎజెండా: జోషి

ప్రభుత్వ లక్ష్యాలు చేరుకోవడమే తన ఎజెండా అని, కాళేశ్వరం ప్రాజెక్టును నిర్ణీత గడువులోగా పూర్తి చేయడమే తన స్వప్నమని సీఎస్ శైలేంద్ర కుమార్ జోషి వెల్లడించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు.ప్రభుత్వం ముందు అనేక సవాళ్లు ఉన్నాయని, వాటన్నింటిని అధిగమించడమే తన కర్తవ్యం అని చెప్పుకొచ్చారు. అందరితో కలుపుకుని వెళ్లి సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరిస్తానని తెలిపారు. చిన్నతనంలో హైదరాబాద్ నగరాన్ని చూడాలని అనుకునేవాడిని కానీ ఇప్పుడు సీఎస్ కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో పలు ప్రాజెక్టుల ద్వారా ప్రత్యేకించి పాలమూరు ప్రాజెక్టు ద్వారా పంటపొలాలకు నీరు అందడం వృత్తిపరంగా తనకు ఎంతో సంతృప్తినించిందన్నారు. సీఎస్‌గా నియమించిన సీఎం కేసీఆర్‌కు జోషి కృతజ్ఞతలు తెలిపారు.

టీఆర్టీ పరీక్ష షెడ్యూల్ విడుదల


ఫిబ్రవరి 24నుంచి మార్చి 4వరకు.. టీఎస్‌పీఎస్సీ వెల్లడి

హైదరాబాద్ సిటీ,జనవరి 31(మనం ప్రతినిధి):

టీఆర్టీ పరీక్షల షెడ్యూల్ టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. ఫిబ్రవరి 24 నుంచి మార్చి 4 వరకు పరీక్షలు జరగనున్నాయి. రంగారెడ్డి, మెదక్, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, ఖమ్మం, నల్లగొండలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్,ఆఫ్‌లైన్‌లో పరీక్షలు జరుగుతాయి.

పరీక్ష తేదీల షెడ్యూల్..

- ఫిబ్రవరి 24న స్కూల్ అసిస్టెంట్, భాషా పండిట్–తెలుగు పరీక్ష
- ఫిబ్రవరి 25న ఎస్జీటీ– తెలుగు, ఆంగ్లం
- ఫిబ్రవరి 26న స్కూల్ అసిస్టెంట్– ఆంగ్లం, గణితం, సాంఘికశాస్త్రం
- ఫిబ్రవరి 27న స్కూల్ అసిస్టెంట్– సామాన్యశాస్త్రం
- ఫిబ్రవరి 27న స్కూల్ అసిస్టెంట్ భాషా పండిట్– ఉర్దూ, మరాఠీ, హిందీ
- ఫిబ్రవరి 28న స్కూల్ అసిస్టెంట్– హిందీ, కన్నడ, తమిళం, ఉర్దూ
- ఫిబ్రవరి 28న పీఈటీ– తెలుగు, ఉర్దూ, కన్నడ, మరాఠీ, హిందీ
- మార్చి 2న ఎస్జీటీ– తెలుగు, హిందీ, ఉర్దూ, బెంగాలీ, కన్నడ, మరాఠీ
- మార్చి 2న స్కూల్ అసిస్టెంట్– ఫిజికల్ ఎడ్యుకేషన్
- మార్చి 3న స్కూల్ అసిస్టెంట్– జీవశాస్త్రం, గణితం, సాంఘికశాస్త్రం
- మార్చి 3న స్కూల్ అసిస్టెంట్– భౌతికశాస్త్రం(ఆంగ్ల మాధ్యమం)
- మార్చి 4న స్కూల్ అసిస్టెంట్– గణితం, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రం
- మార్చి 4న పీఈటీ– ఆంగ్ల మాధ్యమం పరీక్ష జరగనుంది. కాగా టీఆర్టీ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది.



హైదరాబాద్ పూరీ జగన్నాథ్ ఆలయం నుంచి బ్లడ్ మూన్ (ఫొటోగ్రాఫర్ :నాని)

అరుణ వర్ణంలో
నిండు చందురుడు

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమైనా.. సంపూర్ణంగా మారిన తర్వాత నింగిలో అద్భుతం సాక్షాత్కరించింది. ఆకాశంలో సరికొత్తగా కనిపించిన చంద్రుడిని చూసి ప్రజలు ఆనందించారు. సాయంకాలమే చంద్రగ్రహణం ప్రారంభమైనా సూర్యాస్తమయం తర్వాత చంద్రుడు అరుణవర్ణంలో మెరిసిపోయాడు. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఒక్కోచోట ఒక్కోలా కనిపించాడు. సాయంత్రం 5:15 గంటలకు ప్రారంభమైన గ్రహణం 6:22 గంటలకు సంపూర్ణమై 7:22 నిమిషాల తర్వాత నెమ్మదిగా తొలగిపోవడం ప్రారం భించింది. రాత్రి 8:41 గంటలకు గ్రహణం వీడిన చంద్రుడు ప్రకాశవం తంగా కనిపించాడు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో బ్లడ్‌మూన్ కనిపించిందిలా..



అవినీతి 'కమీషనర్'

- **140 కోట్లపైగా అక్రమాస్తులు**
- **21 చోట్ల విలువైన స్థలాలు**
- **హైదరాబాద్‌లో రెండెకరాల పొలం**
- **రూ.40 లక్షల బంగారు ఆభరణాలు**
- **సిక్కోలులో ఇంద్రభవనం లాంటి ఇల్లు**
- **వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారి లక్ష్మీ ప్రసాద్ అక్రమాల పుట్ట బద్ధలు**
- **ఏకకాలంలో 20 చోట్ల ఏసీబీ సోదాలు**

అమరావతి/విజయవాడ/శ్రీకాకుళం, జనవరి 31 (మనం ప్రతినిధి):

రాష్ట్రంలో మరో అవినీతి అధికారి అక్రమాల పుట్ట బద్ధలైంది. ప్రజలు, వ్యాపారులను లంచాల పేరుతో పీక్కుతింటూ భారీగా ఆస్తులను కూడబెట్టిన అక్రమార్కుడిపై ఏసీబీ పంజా విసిరింది. విజయవాడలో వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న గెడ్డపు లక్ష్మీ ప్రసాద్ అక్రమాస్తుల గుట్టు ఏసీబీ బయటకు లాగింది. బుధవారం ఉదయం నుంచి విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, శ్రీకాకుళం, నరసన్నపేట, హైదరాబాద్‌లలో మొత్తం 20 ప్రదేశాలలో ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఏసీబీ డీజీ ఆర్పీ ఠాకూర్ పర్యవేక్షణలో మొత్తం 20 బృందాలు తనిఖీలు నిర్వహించాయి. భారీగా ఇళ్ల స్థలాలకు సంబంధించిన డాక్యుమెంట్లు, నగదు, ఆభరణాలు, బ్యాంక్ పాస్ పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా స్వాహా చేసిన మొత్తం రూ.140 కోట్లకు పైనే ఉంటుందని ఏసీబీ వర్గాలు చెబుతున్నాయి. శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండలం కాకరపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీప్రసాద్ 1987లో వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగిగా చేరారు. గుంటూరు జిల్లా నర్సారావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లిలో వాణిజ్య పన్నుల శాఖలో పనిచేశారు. 1994లో అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. తర్వాత 1998లో డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి పొంది విజయవాడ, హైదరాబాద్, కర్నూలులో విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ విభాగంలో పనిచేశారు. 2017 నుంచి రాష్ట్ర ప్రధాన వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా (జీఎస్‌టీ) పనిచేస్తున్నారు. కాగా రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడి దగ్గర కొంతకాలం ఓఎస్డీగా పనిచేసిన ఈయన అనారోగ్య కారణాలతో మళ్లీ వాణిజ్య పన్నుల శాఖకు వెళ్లినట్లు తెలిసింది. రాజకీయంగా ఉన్నత వర్గాల్లో ఉన్న పలుకుబడిని అడ్డుపెట్టుకుని ఉన్నాతాధికారులను సైతం లెక్కచేయకుండా లక్ష్మీ ప్రసాద్



భారీగా అక్రమార్జనకు తెరతీశాడు. బుధవారం ఉదయం ఆరు గంటల నుంచే ప్రారంభించిన దాడుల్లో కళ్లు బయర్లుకమ్మేలా ఆస్తులు చిట్టా బయట పడింది. విజయవాడలో ప్రస్తుతం ఆయన ఉంటున్న ఇంటితో పాటు మరో రెండు చోట్ల, గుంటూరులో మూడు ప్రాంతాల్లో, శ్రీకాకుళంలో మూడు, విశాఖపట్నంలో మూడు ప్రదేశాల్లో, హైదరాబాద్‌లో ఎనిమిది ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన మొదటి భార్య అలివేలు, రెండో భార్య మల్లిక పేర్ల మీద భారీగా ఇళ్లు, ఇళ్లస్థలాలు ఉన్నట్లు గుర్తించారు.


చాంతాడంత ఆస్తులు చిట్టా

లక్ష్మీ ప్రసాద్ ఆస్తుల చిట్టా చూసి ఏసీబీ అధికారులే షాక్ తిన్నారు. ఆయనతో పాటు కుటుంబసభ్యుల పేరు మీద 21 చోట్ల స్థలాలు ఉన్నాయి. శ్రీకాకుళంలో 7000 చదరపు అడుగుల్లో ఇంద్రభవనం లాంటి ఇల్లు ఆయన పేరుతో ఉంది. మూడంతస్తుల ఈ భవనంలో అద్దెకు ఉంటున్న వారికి వివరాలపైనా ఏసీబీ ఆరా తీస్తోంది. గుంటూరు జిల్లాలో 400 చదరపు గజాల స్థలం కూడా ఉంది. ఇక మొదటి భార్య అలివేలు పేరుతో విశాఖపట్నంలో 366 చదరపు గజాలు, 200 చదరపు గజాల్లో రెండు చోట్ల ఇళ్ల స్థలాలు ఉన్నాయి.

హైదరాబాద్‌లో 200 చదరపు గజాల చొప్పున నాలుగు చోట్ల ప్లాట్లు ఉన్నాయి. గుంటూరు జిల్లాలో 889 చదరపు గజాల ప్లాటు ఉంది. రెండో భార్య మల్లిక పేరుతో గుంటూరు జిల్లాలో 172 చదరపు గజాలు, 400 చదరపు గజాలు, 400 చదరపు గజాలు, 240 చదరపు గజాలు చొప్పున వేర్వేరు చోట్ల స్థలాలు ఉన్నాయి. హైదరాబాద్‌లో 1485 చదరపు అడుగులు, 1594చ.అడుగులు, 2040 చ.అడుగులు చొప్పున స్థలం, రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో 2.14 ఎకరాల స్థలం, విశాఖ జిల్లా అచ్యుతపురంలో 0.17 సెంట్ల స్థలం మల్లిక పేరున ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో రెండు ఎకరాల పొలం అత్త అప్పలనర్సమ్మ పేరు మీద కొన్నారు.

నేరుగా రాహుల్‌నే కలుస్తా

(మొదటి పేజీ తరువాయి)



వచ్చారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను చేసిన సూచనలు అమలు చేయకుంటే నేరుగా రాహుల్ గాంధీకే ఫిర్యాదు చేస్తానని కోమటిరెడ్డి కుంతియాకు స్పష్టం చేసినట్లు తెలిపారు. అధికారంలో ఉన్న బలమైన ప్రత్యర్థిని ఢీకొనడానికి అంతకంటే వేగంగా కార్యాచరణ చేపడితేనే సాధ్యమని కుంతియాకు వివరించానన్నారు. ఎలాంటి అభ్యంతరం లేని, వివాదాలు లేనివి, సిట్టింగ్ స్థానాలు ఇలా.. కనీసం 50 శాతం అసెంబ్లీ సీట్లను మార్చినాటికల్లా ప్రకటించాలని సూచించినట్లు చెప్పారు. హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, తక్షణమే నియోజకవర్గాల ఇంచార్జులను ప్రకటించాలని కోరినట్లు తెలిపారు. నియోజక వర్గాలలో పోటీ ఉన్న చోట్ల ఇద్దరు ముగ్గురుతో సమన్వయ కమిటీలు వేసి పని చేయాలని చెప్పాలని, ఎవరికి సీటు వచ్చినా కలిసి పని చేసేలా ఒప్పించాలని కోరారని అన్నారు. టీఆర్ఎస్ మోసాలను మరింత బలంగా ప్రజల్లోకి తీసుకుపోవాలని, ఇందుకు పాదయాత్ర చేయాలని సూచించానని అన్నారు. ఇందుకోసం పాదయాత్ర చేయాలన్నారు. తనకు అవకాశం ఇస్తే రాష్ట్రమంతా తిరిగి పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని, లేదంటే నల్లగొండ జిల్లాలో అన్ని స్థానాలు గెలుచుకునేందుకు ప్రయత్నం చేస్తానని చెప్పారు. వారం పది రోజుల్లో గ్రేటర్‌లో నియోజక వర్గాల్లో ఇంఛార్జ్‌లను నియమిస్తామని కుంతియా హామీ ఇచ్చారని వెల్లడించారు. అయితే, కుంతియా రాష్ట్ర కాంగ్రెస్‌ను సరైన దిశలో నడిపించట్లేదని, ఆయన స్థానంలో గులాంనబీ ఆజాద్ వస్తారని వెల్లడించారు.

శ్రీనివాస్‌ది రాజకీయ హత్యే..

నల్లగొండ మునిసిపల్ చైర్మన్ భర్త బొడ్డేపల్లి శ్రీనివాస్‌ది ముమ్మాటికి రాజకీయ హత్యేనని కోమటి రెడ్డి స్పష్టం చేశారు. నిందితుల కాల్ లిస్ట్ బయట పెట్టబోమని టీఆర్ఎస్‌నాయకులు చేస్తున్న ప్రకటన లతోనే ఇది స్పష్టమైందన్నారు. కాల్ లిస్ట్ ఇవ్వమని హోం మంత్రి కాని, ఎస్పీ కాని ప్రకటించాలన్నారు. శ్రీనివాస్ హత్య పై సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ కోర్టులో పిటిషన్ వేశామని తెలిపారు. శ్రీనివాస్ మృతదేహంతో తాము ధర్నా చేసిన సమయంలో కాల్ లిస్ట్ ఇస్తామని ఎస్పీ హామీ ఇచ్చిన తరువాతే ధర్నా విరమించినట్లు కోమటిరెడ్డి చెప్పారు. వచ్చే ఆదివారం నిర్వహించనున్న శ్రీనివాస్ సంతాపసభకు కుంతియా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానా రెడ్డి తదితరులు హాజరవుతారని చెప్పారు.

నాయకులతో కుంతియా సమావేశం..

రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం తీసుకోవాల్సిన చర్యలు, అనుసరించాల్సిన వ్యూహంపై నాయకులతో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి కుంతియా చర్చించారు. ఒక్కొక్క నాయకుడితో ఆయన ఏకాంతంగా సమావేశమై అభిప్రాయాలు సేకరించారు. నాయకుల మధ్య ఉన్న విబేధాలు పరిష్కరించడం, అందరినీ ఏకతాటిపై ఎన్నికల్లో నడిచే విధంగా చర్యలు తీసుకోవడం కోసమేనాయకులతో ముఖాముఖి చర్చించినట్లు పీసీసీ వర్గాలు తెలిపాయి. మర్రిశశిధర్ రెడ్డి ఉత్తమ్‌కు వ్యతిరేకంగా ఏఐసీసీకి రాసిన లేఖపై కూడా కుంతియా అడిగి తెలుసుకున్నట్లు తెల్సింది. విభేదాలు ఉంటు చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, అంతా కలిసి, ఐక్యంగా పని చేయాల్సిందేనని నాయకులకు కుంతియా స్పష్టం చేసినట్లు సమాచారం. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటి నాయకులపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెల్సింది. నాయకులు ఐక్యంగా ఉంటేనే తెలంగాణలో విజయం సాధ్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఎదురు దాడిని పెంచాలని, అన్ని స్థాయిల్లో కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని ఆయన సూచించారు.

గద్దెపై కొలువుదీరిన సారలమ్మ



(మొదటి పేజీ తరువాయి)

రాకతో భక్తజనకోటి పూనకాలతో పులకించిపోయారు. వారి పిలుపులు, మొక్కులతో మేడారమంతా మార్మోగిపోయింది.నీటి అలలతో ఓలలాడే జంపన్న వాగు జనసంద్రమైంది. చల్లని తల్లి కాలు మోపగానే మేడారం నేల పునీతమైంది. కన్నెపల్లి వాసులు తల్లికి హారతులిస్తూ, నీళ్లతో ఆరగిస్తు మేడారానికి సాగనంపగా, నాలుగు కిలోమీటర్ల దారిపొడుగునా భక్తుల పబ్బతులు అందుకుంటూ దారిలో జంపన్న తీరంలో కొలువైన సోదరుడు జంపన్నను మందలించుకుంటూ వరాల తల్లి గద్దె నెక్కింది. తల్లి రాకకు ముందే పూనగుండ్ల నుండి పగిడిద్దరాజు, కొండాయి నుండి గోవిందరాజులు వారివారి గద్దెలపైకి చేరుకున్నారు. మరోపక్క తన బిడ్డలు.. భక్తజనకోటి కోసం మేడారం రావటానికి మహాతల్లి సమ్మక్క చిలకలగుట్టపై నుండి బయలుదేరింది. ఆ మహాద్భుత ఘట్టం కోసం భక్తజనకోటి ఉద్విగ్న భరితంగా ఎదురుచూస్తోంది.

బుదవారం నాడు గద్దెలపైకి సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు కొలువు తీరగా, జంపన్న తీరంలో జంపన్న కొలువు తీరి భక్తజనకోటికి దీవెనలు, వరాలిస్తున్నారు.ఆదివాసీ గిరిజన కోయలు బుధవారం ఉదయం నుండి తమ ఆచార సాంప్రదాయాల ప్రకారం రోజంతా పూజలు నిర్వహించారు. కన్నెపల్లి ఆడబిడ్డలు సారలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి శుద్ధి చేసే సామాగ్రి, మంచి నీటితో మేడారానికి బయలు దేరి వచ్చి మేడారం సారలమ్మ గద్దెను శుద్ధి చేసి పట్టు పరిచారు. సాయంత్రం సారలమ్మ గుడివద్ద ప్రధాన పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ప్రతిరూపమైన బండారి (పసుపు) కుంకుమలను వెదురుబుట్టలో తీసుకుని సారలమ్మ ప్రదాన పూజారి కాక సారయ్య సాయంత్రం 8 గంటల 10 నిమిషాలకు బయలు దేరి జంపన్న వాగు మీదుగా పవనసుత హనుమాన్ జెండానీడలో పటిష్ట బందోబస్తు నడుమ పోలీసులు , ఆదివాసీ వాలంటీర్లు తదితరులు వెంటరాగా, పూజారులు కాక కిరణ్, కాక శ్యాం, గ్రామపెద్దలు సారలమ్మను మేడారానికి చేర్చారు.

కన్నెపల్లి నుండి సారలమ్మ తల్లి జంపన్న వాగు వద్దకు రాగానే పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తజనకోటి ఉప్పొంగిన భక్తిపారవశ్యంలో 'సారలమ్మ తల్లీ దండాలు' అంటూ హోరెత్తించారు. తల్లి నడిచివచ్చేనీటిలో స్నానాల కోసం పోటీలు పడ్డారు. సాయంత్రం సుమారు 10 గంటల ప్రాంతంలో పూజారులు సారలమ్మతో పాటు పడిగిద్దరాజు, గోవిందరాజులను గద్దెలపై కొలువుంచారు. ప్రభుత్వం తరపున ముఖ్య అధికారులు హాజరయ్యారు. గద్దెలపైకి సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను కొలువుంచే సమయాల్లో దర్శనాలను నిలిపివేశారు. సారలమ్మ గద్దెపైకి చేరిన ఘట్టానికి గుర్తుగా ఆదివాసి పూజారులు కొమ్ము బూరలు ఊదారు. అమ్మవారి రాక అద్భుత

సన్నివేశాన్ని కనులారా తిలకించేందుకు కన్నెపల్లి నుండి మేడారం దారి పొడవునా భక్తజనకోటి అమ్మోరికి ఎదురేగి దండాలు పెట్టారు. ఎదురుకోళ్లు అందించారు. కోళ్లు, మేకలతో మొక్కులు చెల్లించారు.సారలమ్మను తీసుకుని



వచ్చే ప్రధాన పూజారి తమపైనుండి నడుచుకుంటూ పోతే కోరికలు తీరుతాయనీ, తమ జన్మసుకృతం అవుతుందన్న నమ్మకంతో దారిపొడువుగా భక్తులు వరాలు పట్టారు. పూజారులు వీరిపైనుండి నడుచుకుంటూ గద్దెలవైపు సాగారు. ప్రత్యేక డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాల, .భక్తజనకోటి హోరు, హిజ్రాలు, జోగమ్మల శివాలుతో సారలమ్మ ఆలయం భక్తిపారవశ్యమైంది.

మహాజాతర పరిసర ప్రాంతాలు లక్షలాది మంది భక్తులతో కిటకిటలాడాయి. వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న భక్తుల ప్రవాహంతో వనాల్లోని బాటలన్నీ నిండిపోయాయి. దాదాపు 20 కిలో మీటర్ల వరకు అడవి దారులన్నీ కిక్కిరిసిపోయాయి.

నేడు వేంచేయనున్న సమ్మక్క...

జాతరలో రెండో ప్రధాన ఘట్టం సమ్మక్క తల్లి ఆగమనం. మేడారానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో చిలకలగుట్టపై వెలసి ఉన్న సమ్మక్క తల్లిని గురువారం నాడు మేడారానికి తీసుకురానున్నారు. వనదేవతల జాతరలో ఈ ప్రధాన ఘట్టం కోసం భక్తజనకోటి కళ్లల్లో వత్తులు వేసుకుని ఎదురుచూస్తోంది.





ప్రధాన పూజారి అలక

సారలమ్మను గద్దెకు తీసుకవచ్చే క్రమంలో మేడారం జాతర ప్రధాన పూజారైన సారయ్య తనకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని దేవతను తీసుకురావడానికి నిరాకరించారు. ఈ క్రమంలో కన్నెపల్లిలోని సారలమ్మ గుడి నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయతించడంతో జాతర బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏఎస్పీ దక్షిణామూర్తి సారయ్యను బుజ్జగించి లోపలికి తీసుకెళ్లాడు. సరైన ప్రాధాన్యత కల్పిస్తామని నచ్చజెప్పడంతో సారయ్య శాంతించి పూజలో పాల్గొన్నారు.



అఫ్ఘాన్‌లో భూకంపం

- హిందుకుష్‌లో 6.2 తీవ్రతతో ప్రకంపనలు
- పాక్, భారత్‌లోనూ కంపించిన భూమి
- బాలిక మృతి.. పదుల సంఖ్యలో క్షతగాత్రులు
- ఢిల్లీలో మెట్రో సేవల నిలిపివేత.. పునరుద్ధరణ
- శ్రీనగర్‌లో కూలిన ఫ్లైఓవర్ పిల్లర్.. తప్పిన ప్రాణనష్టం
- మంచు చరియలు కూలే ప్రమాదం
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

ఇస్లామాబాద్/కాబూల్/న్యూఢిల్లీ, జనవరి 31: అఫ్ఘానిస్థాన్‌లో బుధవారం మధ్యాహ్నం సంభవించిన భూకంపం మూడు దేశాలను వణికించింది. అఫ్ఘాన్ ఉత్తర సరిహద్దుల్లోని హిందుకుష్ పర్వత ప్రాంతంలో 6.2 తీవ్రతతో భూమి కంపించింది. భూ ఉపరితలం నుంచి 191 కిలోమీటర్ల లోతు నుంచి మొదలైన ప్రకంపనలు అఫ్ఘాన్, పాకిస్థాన్, భారత్‌లలోని ప్రజలను పరుగులు పెట్టించాయి. బుధవారం మధ్యాహ్నం 12.37 గంటల సమయంలో ఈ భూకంపం సంభవించింది. అఫ్ఘాన్‌లో ప్రకంపనలతో భయాందోళనలకు గురైన ప్రజలు ఇళ్ల నుంచి రోడ్లపైకి వచ్చి నిలబడ్డారు. ఇక్కడ స్వల్పంగా ఇళ్లు ధ్వంసం కాగా, ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. పాక్‌లోని బలూచిస్థాన్‌లో గల క్వెట్టా పట్టణంలో ఇల్లు కుప్పకూలి ఓ బాలిక మృతి చెందింది. ఆ కుంటుంబంలోని మరో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. ఇస్లామాబాద్, పెషావర్, లాహోర్‌లలోనూ ప్రకంపనలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. పలు ప్రాంతాల్లో భవనాలు ధ్వంసమయ్యాయి. ముందు జాగ్రత్తగా కార్యాలయాలు, స్కూళ్లను కూడా ఖాళీ చేశారు. పాక్‌లోని పలు ప్రాంతాల్లో పదుల సంఖ్యలో గాయపడినట్లు ఆ దేశ అధికారులు వెల్లడించారు. అత్యవసర విపత్తు సహాయ బృందాలను ఆయా ప్రాంతాలకు పంపినట్లు పేర్కొన్నారు.

భూ ప్రకంపనలతో కశ్మీర్ లోయలో మంచు చరియలు జారిపడే ప్రమాదం ఉందని ప్రభుత్వం హెచ్చరించింది. పలు జిల్లాలో ప్రమా ద హెచ్చరికలు జారీ చేసింది. 24 గం టల పాటు ఆయా ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు సూచిం చారు. బారాముల్లా జిల్లాలో మధ్యస్థంగా లెవల్-3 ప్రమాద హెచ్చరికలను, కుప్వారా, బందిపుర, షోపియన్, కార్గిల్ జిల్లాల్లో లెవల్-2 హెచ్చరికలను జారీ చేశారు. పూంచ్, రాజౌరీ, రాంబన్, దోడా, కిష్టావర్, ఉధంపూర్, అనంతనాగ్, బుద్గాం, కుల్గాం, లేహ్ జిల్లాల్లో మొదటి ప్రమాద హెచ్చరి కను జారీ చేశారు. కొండ వాలు ప్రాంతం లో ఉండేవారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాల్సిందిగా అధికారులు సూచించారు.

కశ్మీర్ లోయలో 24 గంటలు అప్రమత్తం

వణికిపోయిన ఉత్తరాది

హిందుకుష్ భూకంపంతో ఉత్తర భారతంలోని పలు ప్రాంతాల్లోనూ భూమి కంపించింది. ఢిల్లీ, రాజస్థాన్, జమ్ముకశ్మీర్‌లలో ప్రకం పనల ధాటికి భయంతో ఇళ్లనుంచి జనం పరుగులు తీశారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఢిల్లీ మెట్రో సేవలను కొద్దిసేపు నిలిపేశారు. అలాగే జమ్ముకశ్మీర్‌లో ప్రకంపనల తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. దీంతో ఇక్కడి ప్రజలంతా ఇళ్ల నుంచి బయటకు వచ్చి బిక్కుబిక్కుమంటూ గడిపారు. శ్రీనగర్ సహా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను కొంత సమయం నిలిపేశారు. శ్రీనగర్‌లో నిర్మాణంలో ఉన్న జహంగీర్ చౌక్-రామ్‌బాగ్ ఫ్లైఓవర్ పిల్లర్ క్రెయిన్‌పై పడిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. జమ్ములో పలు ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చిన సయమంలో వాహనాలు నడుపుతున్నవారు భయంతో వాటిని అక్కడిక్కడే ఆగిపోయారు. 2005 అక్టోబరులో సంభవించిన భూకంపం ధాటికి నియంత్రణ రేఖ వెంబడి ఇరువైపులా భవనాలు నేలమట్టమైన ఘటనను తలుచుకుని జమ్ముకశ్మీర్ వాసులు బిక్కుబిక్కుమంటూ గడిపారు.

ఆర్మీ X పోలీస్

- షోపియాన్ కాల్పులపై పరస్పరం ఎఫ్ఐఆర్

న్యూఢిల్లీ, జనవరి 31: జమ్ముకశ్మీర్ షోపియాన్‌లో వారం క్రితం సైన్యం జరిపిన కాల్పుల్లో ఇద్దరు పౌరులు చనిపోయిన ఘటన తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీస్తోంది. ఈ ఘటనపై ఇప్పటికే స్థానిక పోలీసులు జవాన్లపై కేసు నమోదు చేయగా.. అందుకు ప్రతిగా భారత సైన్యం కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ ఘటనపై సొంతంగా విచారణ జరిపించి సైనికుల తప్పేమి లేదని, ఆందోళనకారులు రెచ్చగొట్టడం వల్లే కాల్పులు జరపాల్సి వచ్చిందని నిర్ధారించింది. ఇదే విషయాన్ని నార్తరన్ ఆర్మీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ దేవ్‌రాజ్ అంబు ప్రస్తావించారు. రాళ్లు రువ్వే గుంపు తీవ్ర స్థాయిలో రెచ్చగొట్టి దాడులకు పాల్పడటంతోనే కాల్పులు జరపాల్సి వచ్చిందని ఆయన సుస్పష్టం చేశారు. తమ హెచ్చరికలను అల్లరిమూకలు ఏమాత్రం లెక్కచేయలేదన్నారు. దాంతో కాల్పులు జరపడం తప్పనిసరైందన్నారు. ఆర్మీకి వ్యతిరేకంగా రాష్ట్రప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేయడం దురదష్టకరమని, ముందస్తుగానే వ్యక్తుల పేర్లు ఎఫ్ఐఆర్‌లో చేర్చడం సరైనది కాదని, విచారణ జరిపితే నిజం బయటపడుతుందని అన్నారు.

ఆకర్షణా... వివేచనా!



- నేడే లోక్‌సభలో కేంద్ర బడ్జెట్ సమర్పణ
- అరుణ జైట్లీ పద్దు మొగ్గేది ఎటువైపు?
- ఎన్నికల ఏడాదిలో 'కత్తిమీది సాము'

న్యూఢిల్లీ, జనవరి 31: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి ఐదో... అత్యంత కఠిన బడ్జెట్ సమర్పణకు రంగం సిద్ధమైంది. గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టబోయే తన 'పద్దు'కు అవసరమైన సరంజామాను ఆర్థిక శాఖ మంత్రి అరుణజైట్లీ బుధవారం పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకున్నారు. వ్యవసాయమే తమ ప్రథమ పాథమ్యమని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో రైతుల వెతలు తీర్చేందుకు జైట్లీ ప్రాధాన్యమిస్తారని అంచనా. మరోవైపు ఈ ఏడాది మూడు బీజేపీ పాలితంసహా 8 రాష్ట్రాలకు, వచ్చే సంవత్సరం లోక్‌సభకు ఎన్నికలు రానున్నాయి. దీంతో ఓటర్లను... ప్రధానంగా యువతను ఉపాధి కల్పనవంటి చర్యలతో ఆకట్టుకోవడమూ ముఖ్యమే కాబట్టి ఇది 'ఎన్నికలమీద సాము'వంటిది. అదే సమయంలో వృద్ధికి ఊతమిచ్చేలా ద్రవ్య వివేచనకూ కట్టుబడక తప్పని పరిస్థితి. అందుకే ప్రజాకర్షణ, ద్రవ్య వివేచనలలో దేనికి ఆయన ప్రాధాన్యమిచ్చారన్నది మరి కొద్ది గంటల్లోనే తేలిపోనుంది. వచ్చే ఏడాది ఎన్నికలు రానుండటంతో ప్రభుత్వానికి పూర్తి బడ్జెట్ సమర్పించే అవకాశం ఉండదు. ప్రస్తుత సంప్రదాయం ప్రకారం 'వోట్ ఆన్ అకౌంట్' లేదా ప్రభుత్వ వ్యయాల కోసం నిధుల విడుదలపై అత్యవసర ఆమోదానికి మాత్రమే వీలుంటుంది. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక పూర్తిస్థాయి బడ్జెట్‌ను సమర్పిస్తుంది.

కొత్త గ్రామీణ పథకాలకు శ్రీకారం!

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రధాని నరేంద్ర మోదీ సొంత రాష్ట్రం గుజరాత్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో గ్రామీణ ఓటరు పునాదికి గండిపడింది. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రభుత్వం కొత్త గ్రామీణ పథకాలకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. దీంతోపాటు ప్రస్తుతం అమలవుతున్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధుల పెంపు అవకాశాలున్నాయి. అలాగే గ్రామీణ గృహ నిర్మాణం, నీటిపారుదల ప్రాజెక్టులు, పంటల బీమా పథకాలకు కేటాయింపు పెరగవచ్చునని నిపుణుల అంచనా. అంతేకాకుండా వ్యవసాయ రంగంలో ప్రోత్సాహకాలకు జైట్లీ తెరతీస్తారని భావిస్తున్నారు. ఇక బీజేపీ సంప్రదాయక ఓటు బ్యాంకులో గణనీయ వాటాగల చిన్న వ్యాపారులకు ఊరటనిచ్చే నిర్ణయాలుంటాయని అంచనా. హడావుడిగా ప్రవేశపెట్టిన వస్తుసేవల పన్ను, పెద్దనోట్ల రద్దు దెబ్బకు చిన్న వ్యాపారాలు కుదేలైన నేపథ్యంలో ఈ రంగం గాయాలకు రాయితీల పూత తప్పనిసరవుతోంది. ఇక సామాన్యులు, వేతన జీవులు ఎదురుచూసే ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి పెరుగుతుందన్న ఆశలు నెరవేరే సూచనలూ కనిపిస్తున్నాయి.

జనాన్ని ముందే సిద్ధం చేసిన ప్రధాని

దేశంలో సామాన్యులెవరూ రాయితీలు కోరుకోవడం లేదంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవలే ప్రకటించారు. ఆ మేరకు ఈ ఏడాది బడ్జెట్‌లో ఓటర్లను ప్రభావితం చేసే భారీ ప్రకటనలేవీ బడ్జెట్‌లో ఉండబోవని ఆయన చెప్పకనే చెప్పారు. తద్వారా బడ్జెట్‌పై ప్రజల్లో అంచనాలకు మించి ఆశలు రేగకుండా వారిని ముందుగానే సిద్ధం చేశారు. జీఎస్టీ ప్రవేశపెట్టిన తర్వాత ఇది జైట్లీ సమర్పిస్తున్న తొలి బడ్జెట్ కావడంతో ఆసియాలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో వృద్ధికి ఎలా ఊతమిస్తారన్న ఆసక్తి సర్వత్రా కనిపిస్తోంది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులపై మూలధన లాభాలమీద పన్ను రద్దవుతుందన్న మాట వినిపిస్తోంది. ఇక కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గిస్తామన్న 2015నాటి తన హామీని జైట్లీ ఈసారి నిలబెట్టుకుంటారో లేదో చూడాల్సి ఉంది. ఇక అంతర్జాతీయంగా ముడిచమురు ధరల పెరుగుదల ద్రవ్యోల్బణాన్ని ఎగదోయడంతోపాటు కరెంటు ఖాతా లోటును మరింత విస్తృతం చేసే పరిస్థితి కూడా జైట్లీకి ఓ ప్రతిబంధకమే. కాగా, ఆర్థిక స్థిరీకరణ ప్రణాళికలో విరామాన్ని తోసిపుచ్చలేమని ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ ఈ వారం మొదట్లో చెప్పారు. అయితే, ప్రభుత్వం మాత్రం లక్ష్యానికే కట్టుబడుతుందని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్ ప్రకటించారు.

'మౌలికం'లో వ్యయం పెంపు

ఆర్థిక వ్యవస్థ నాలుగేళ్ల కిందటి మందగమనంలో పడినందున జీడీపీ వృద్ధి దిశగా చేపట్టాల్సిన చర్యలు కూడా జైట్లీ ప్రాధాన్యాల్లో భాగమే. ఇందులో భాగంగా జాతీయ రహదారులు, రైల్వేల ఆధునికీకరణ వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు వ్యయం పెంచే అవకాశం ఉంది. అయితే, ఆసియా ఖండంలో అతిపెద్ద బడ్జెట్ లోటుపాట్లను తగ్గించే ప్రణాళికకు ఆర్థిక మంత్రి కట్టుబడాల్సి ఉంటుంది. లేకపోతే నిరుడు అరుదైన ఉన్నతీకరణ రేటింగ్ అందుకున్న భారత ఆర్థిక వ్యవస్థకు అంతర్జాతీయ పెట్టుబడిదారుల దృష్టిలో, క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీల అంచనాల్లో ప్రతికూలత ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఇంతకుముందు ఏడాదిలో ద్రవ్యలోటును జీడీపీలో 3.2 శాతానికి తగ్గించడం జైట్లీ ముందున్న లక్ష్యం కాగా, గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో ఇది 3 శాతంగా ఉంది.

మెట్టుదిగిన ట్రంప్

వలసలపై కాస్త పట్టింపు.. కొంత సడలింపు..

- షరతులతో 'డ్రీమర్ల'కు పౌరసత్వ మంజూరు
- భారత సాంకేతిక నిపుణులకు అత్యధిక లబ్ధి!
- సరికొత్త వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటాం
- సుభద్ర-సురక్షిత.. సగర్వ-సమర్థ దేశమే లక్ష్యం
- తొలిసారి 'స్టేట్ ఆఫ్ ది యూనియన్' ప్రసంగం
- నాలుగు అంశాల కొత్త విధానం ప్రతిపాదన

వాషింగ్టన్, జనవరి 31: అమెరికాలో అక్రమ వలసదారుల (డ్రీమర్ల) సమస్యపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ మెట్టు దిగారు. ఈ మేరకు నాలుగు అంశాలకు ప్రాధాన్యమిస్తూ ప్రతిభ ఆధారిత వలస విధానాన్ని ప్రతిపాదించారు. దీనివల్ల ప్రతిభావంతులైన విదేశీయులకు... ముఖ్యంగా భారత సాంకేతిక నిపుణుల వంటివారికి అమెరికా ప్రవేశం సులభతరమవుతుంది. మంగళవారం రాత్రి అమెరికన్ కాంగ్రెస్‌ను (ఉభయసభల సంయుక్త సమావేశం) ఉద్దేశించి దాదాపు 80 నిమిషాలపాటు తొలి 'స్టేట్ ఆఫ్ ది యూనియన్' ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా తన సహజ దుందుడుకు వైఖరి వీడి విపక్ష సహకారం అర్థిస్తూ సున్నిత స్వరంతో మాట్లాడటం విశేషం. ఇందులో భాగంగా వలస విధానంసహా విదేశీ వాణిజ్యం, ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులపై పోరు, ఉత్తరకొరియాను నిలువరించడం తదితరాలపైనా మాట్లాడారు. చట్ట విరుద్ధంగా దేశంలో స్థిరపడిన డ్రీమర్లకు పౌరసత్వంపై పట్టుబట్టిన ప్రతిపక్ష డెమోక్రాట్ పార్టీ ఇటీవల ద్రవ్య వినిమయ బిల్లును అడ్డుకోగా ప్రభుత్వం స్తంభించిన సంగతి తెలిసిందే. దీంతో ఆ సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చిన ట్రంప్ ఫిబ్రవరి 8దాకా స్వల్పకాలిక నిధుల విడుదలకు ఆమోదం పొందగలిగారు. ఈ నేపథ్యంలో దేశ స్థితిగతులు, పరిపాలన, తన ప్రభుత్వం చేపట్టబోయే చర్యలను వివరించారు. 'సుభద్ర, సురక్షిత, సమర్థ, సగర్వ అమెరికా'ను నిర్మించడంలో అధికార, విపక్షాలు ఏకాభిప్రాయంతో సహకరించాలని కోరారు. కాగా, అమెరికాలో నిరుడు దుండగుల కాల్పులకు బలైపోయిన తెలుగు ఇంజనీర్ కూచిభొట్ల శ్రీనివాస్ భార్య సునయన అధ్యక్షుడి ప్రసంగ కార్యక్రమానికి హాజరయ్యారు. కాంగ్రెస్ సభ్యుడు కెవిన్ యోడర్ ఆమెను తన అతిథిగా ఆహ్వానించి ఈ గౌరవం కల్పించడం విశేషం.



సరికొత్త వలస వ్యవస్థను రూపొందిస్తాం

అమెరికాలోగల 18 లక్షల మంది డ్రీమర్లుసహా కొత్తగా వలస వచ్చేవారికి పౌరసత్వంపై నాలుగు స్తంభాల వ్యవస్థను ట్రంప్ ప్రతిపాదించారు. బాల్యదశలో తల్లిదండ్రుల వెంట వచ్చినవారికి పౌరసత్వంతోపాటు వీసా లాటరీ పద్ధతికి స్వస్తి, కుటుంబ ప్రాతిపదికన వలసలకు పరిమితి, సరిహద్దులలో భద్రతల ఆధారంగా వలసలపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ''ప్రతిభ ఆధారిత వలస విధానంవైపు మళ్లాల్సిన సమయం ఆసన్నమైంది. ఆ మేరకు నైపుణ్యం, పనిపై శ్రద్ధాసక్తులు, అమెరికాను గౌరవించి-ప్రేమించగలవారిని మాత్రమే అనుమతిద్దాం'' అన్నారు. తన ప్రతిపాదనను సముచిత రాజీమార్గంగా పరిగణించి అధికార, విపక్ష పార్టీలు రెండూ సమర్థించాలని కోరారు. అంతేకాకుండా ''అటు డెమోక్రాట్లు, ఇటు రిపబ్లికన్లతో చేయిచేయి కలిపి నడవడానికి నేను సుముఖం. జాతి, రంగు, నేపథ్యాలతో నిమిత్తం లేకుండా మన పౌరులందరి ప్రయోజనాల పరిరక్షణ ధ్యేయంగా కలసి ముందుకు సాగుదాం'' అని పిలుపునిచ్చారు. ''మా ప్రణాళిక ప్రకారం విద్య, ఉద్యోగ అవసరాలకు అనుగుణమైన అర్హతలున్నవారు, నైతికవర్తనులు పూర్తిస్థాయి అమెరికా పౌరులు కాగలరు'' అని డ్రీమర్లకు పౌరసత్వ మార్గం గురించి ప్రకటించారు.



మెక్సికో సరిహద్దులో మహాకుడ్యం

వలసలపై రెండో స్తంభంగా అమెరికా దక్షిణ భాగంలో మెక్సికో సరిహద్దున గోడ నిర్మాణం చేపట్టాల్సి ఉందని ట్రంప్ చెప్పారు. చట్టంలోని లొసుగుల ఆసరాతో నేరగాళ్లు, ఉగ్రవాదులు దేశంలో ప్రవేశించడాన్ని ఈ ప్రణాళికతో నివారించవచ్చునని పేర్కొన్నారు. తద్వారా ఇప్పటిదాకా సాగుతున్న 'నిర్బంధం-విడుదల' ఆటకు అడ్డుకట్ట పడుతుందని అభిప్రాయపడ్డారు. మూడో స్తంభంగా వీసాలకు లాటరీ పద్ధతికి స్వస్తి చెప్పాల్సి ఉందన్నారు. నైపుణ్యం, ప్రతిభ, అమెరికన్లకు భద్రత వంటివాటితో నిమిత్తం లేకుండా గ్రీన్ కార్డు (శాశ్వత పౌరసత్వం) ఇచ్చే ఈ విధానం ఇక వద్దన్నారు. ట్రంప్ కొత్త విధానాన్ని కచ్చితంగా అమలు చేస్తే గ్రీన్ కార్డు కోసం ఎదురుచూస్తున్న వేలాది భారత ఐటీ నిపుణులు అత్యధికంగా లబ్ధి పొందే అవకాశం ఉంటుంది. ఇక నాలుగో స్తంభంగా కుటుంబ ఆధారిత వరుస వలసల నిరోధం అవసరమన్నారు. ఆ మేరకు భార్య/భర్త, వారి పిల్లలకు పరిమితం చేస్తూ చిన్న కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ట్రంప్ ప్రతిపాదించారు. ప్రస్తుతం ఒక వ్యక్తి సుదూర బంధువులను కూడా తీసుకొస్తున్నందున దానికి స్వస్తి చెప్పాల్సి ఉందన్నారు. మొత్తంమీద కాలంచెల్లిన వలస నిబంధనలకు పాతరేసి, 21వ శతాబ్దపు వ్యవస్థను అమలులోకి తేవాల్సి ఉందన్నారు.

దేశంలో అంతా సంతృప్తికరం

దేశంలో అన్నివిధాలా సంతృప్తికర వాతావరణం కనిపిస్తున్నదని ట్రంప్ చెప్పారు. నిరుద్యోగం 45 ఏళ్లనాటి కనిష్ఠ స్థాయికి తగ్గిందని పేర్కొన్నారు. అలాగే చిన్న వ్యాపారాల స్థాయి మునుపెన్నడూ లేనంత ఉచ్ఛస్థాయిలో ఉందన్నారు. స్టాక్ మార్కెట్ తన రికార్డులను తానే వరుసగా బద్దలు కొడుతున్నదని చెప్పారు. దేశంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం 1.5 ట్రిలియన్ డాలర్ల ప్యాకేజీకి ఆమోదముద్ర వేయాల్సిందిగా ప్రజా ప్రతినిధులను కోరారు. ప్రజారోగ్యం సంరక్షణ విషయంలో అత్యంత శ్రద్ధ చూపుతున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేట్ పన్నును 35 శాతం నుంచి 21 శాతానికి తగ్గించినట్లు గుర్తుచేశారు. ఇక ఉత్తర కొరియా నిర్లక్ష్యపూరిత వైఖరికి అడ్డుకట్ట వేస్తామని హెచ్చరించారు. అమెరికా నగరాలను ధ్వంసం చేస్తామంటూ ఆ దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ విర్రవీగుతున్నాడని గుర్తుచేశారు. అయితే, అమెరికా మునుపటి పాలకులు చేసిన తప్పులు పునరావృతం కానివ్వబోమని ప్రతినబూనారు. అమెరికా 'ఆర్థిక లొంగుబాటు' ఇక ముగిసిందని ట్రంప్ ప్రకటించారు. ఆ మేరకు పారదర్శక, పరస్పర వాణిజ్య సమతూకం పాటించే దేశాలతో కొత్త వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటామని చెప్పారు. చైనా, రష్యా వంటి 'ప్రత్యర్థి' దేశాలతోపాటు కొన్నిదేశాల ధూర్త పాలకులు ఉగ్రవాదులు అమెరికా ప్రయోజనాలను, ఆర్థిక వ్యవస్థను, విలువలను సవాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, వీటన్నిటినీ అధిగమించి అమెరికాను దుర్నిరీక్ష్యంగా రూపొందిస్తామని ప్రకటించారు. స్వీయ రక్షణ దిశగా అణ్వాయుధాలను నవీకరించి, పునర్నిర్మించుకోవాల్సి ఉందని పేర్కొన్నారు.

ఐఎన్ఎస్ కరంజ్ జలప్రవేశం

- దేశీయంగా తయారైన మరో సబ్‌మెరైన్
- ఫ్రెంచ్ సాయంతో మజగావ్ డాక్‌లో తయారీ
- ప్రాజెక్ట్-75లో మూడో జలంతర్గామి
- మరో రెండేళ్ల పాటు కఠిన పరీక్షలు
- ఆ తర్వాతే నౌకా దళానికి అప్పగింత
- ఇకపై షెడ్యూల్ ప్రకారమే నిర్మాణం
- నిర్మాణ ఆలస్యంపై నేవీ చీఫ్ లంబా వెల్లడి

ముంబై, జనవరి 31: భారత నౌకాదళానికి చెందిన కొత్త జలాంతర్గామి కరంజ్ బుధవారం జలప్రవేశం చేసింది. వేదమంత్రాల మధ్య నేవీ చీఫ్ అడ్మిరల్ సునీల్ లంబా సతీమణి రీనా లంబా ఈ సబ్‌మెరైన్‌ను ఆవిష్కరించారు. ఫ్రెంచ్ నౌకా నిర్మాణ సంస్థ సహకారంతో కరంజ్ అత్యాధునిక ఆయుధ సంపత్తి, సాంకేతికతతో రూపుదిద్దుకుంది. మజగావ్ డాక్ లిమిటెడ్ సంస్థ తయారు చేసిన ఈ జలాంతర్గామి మిగతా వాటితో పోలిస్తే నిశ్శబ్దంగా పనిచేసుకుపోతుంది. శత్రువులు పసిగట్టేలోపే దాడి చేయగలిగే సామర్థ్యం దీని సొంతం. ప్రాజెక్టు-75 పేరుతో చేపట్టిన స్కార్పీన్ క్లాస్ జలాంతర్గాముల నిర్మాణంలో కరంజ్ మూడోది. ఐఎన్ఎస్ కరంజ్ బుధవారం జలప్రవేశం చేసినా.. మరో రెండేళ్ల పాటు కఠిన పరీక్షలు ఎదుర్కొన్న తర్వాతే భారత నావికదళంలో చేరనుందని అధికారవర్గాలు వెల్లడించాయి. మజగావ్ డాక్ సంస్థలో మొత్తం ఆరు జలాంతర్గాములను నిర్మిస్తున్నట్లు నేవీ చీఫ్ అడ్మిరల్ లంబా తెలిపారు. ఫ్రెంచ్ నౌకా నిర్మాణ సంస్థ సహకారంతో ఈ సబ్‌మెరైన్లను అభివృద్ధి చేస్తున్నారు. స్కార్పీన్ క్లాస్‌కు చెందిన కల్వరీ సబ్‌మెరైన్‌ను ఇటీవల ప్రధాని మోదీ జలప్రవేశం చేసిన విషయం తెలిసిందే! కాగా, గతంలో సబ్‌మెరైన్ కరంజ్‌ను మొదటిసారి 1969 సెప్టెంబరు 4న కమిషన్ చేశారు. 1971లో జరిగిన యుద్ధంలోనూ ఈ సబ్‌మెరైన్ పాలుపంచుకుంది. సుమారు 34 ఏళ్ల పాటు నౌకాదళానికి సేవలందించిన కరంజ్ 2003, ఆగస్టు 1న రిటైర్ అయ్యింది. ఇప్పుడు మరోసారి కొత్త అవతారంతో సబ్‌మెరైన్ కరంజ్ మళ్లీ పుట్టింది. కాగా, మజగావ్ డాక్ సంస్థకు చెందిన రాకేష్ ఆనంద్ మాట్లాడుతూ.. దేశీయంగా చేపట్టిన రక్షణ ఉత్పత్తుల తయారీలో ఐఎన్ఎస్ కరంజ్ ఓ మైలురాయి అని పేర్కొన్నారు. ఉపరితలం నుంచి ఉపరితలంలోకి క్షిపణులను ప్రయోగించగల సదుపాయాన్ని కరంజ్‌లో ఏర్పాటు చేశామని చెప్పారు. దీంతో క్షిపణి ప్రయోగం ఎక్కడినుంచి జరిగిందనే విషయాన్ని శత్రువులు గుర్తించలేరని తెలిపారు. శత్రు నౌకలు, సబ్‌మెరైన్ల సమీపంలోకి వెళ్లేంత వరకూ దీనిని గమనించడం సాధ్యం కాదని పేర్కొన్నారు.



కరంజ్ ప్రత్యేకతలివీ..

- 2005లో ఆర్డర్ చేశారు
- నిర్మాణం: మజగావ్ డాక్ లిమిటెడ్
- ప్రారంభం: 2018 జనవరి 31
- గుర్తింపు (అసలు పేరు): ఎస్52
- స్టేటస్: ప్రస్తుతం పరీక్షల దశ
- వర్గం: స్కార్పిన్ వర్గంలోని కల్వరి తరహా జలాంతర్గామి
- పరిమాణం (డిస్ప్లేస్మెంట్): 1,565 టన్నులు
- పొడవు: 61.7 మీటర్లు (202 అడుగులు)
- ఇంజన్: డీజిల్ ఎలక్ట్రిక్ ఇంజన్, బ్యాటరీలు
- వేగం: నీటి లోపల 20 నాట్స్ (గంటకు 37 కిలోమీటర్లు), జల ఉపరితలంపై 12 నాట్లు (గంటకు 22 కిలోమీటర్లు)
- రేంజ్: నీటి లోపల గంటకు 15 కిలోమీటర్ల వేగంతో వెళితే 12 వేల కిలోమీటర్లు (ఏకబిగిన ప్రయాణించగలిగిన సత్తా), నీటి ఉపరితలంపై గంటకు 9.3 కిలోమీటర్ల వేగంతో వెళితే 1,020 కిలోమీటర్లు.
- పనితనం (ఎండ్యూరెన్స్): కాంపాక్ట్ కండిషన్లో 40 రోజులు, మామూలు స్థితిలో 50 రోజులు.
- పరీక్షించే లోతు: 350 మీటర్లు (1,150 అడుగులకు పైమాటే)
- ఆయుధ సంపత్తి: 18 బ్లాక్ షార్క్ భారీ టార్పిడోలు లేదా ఎస్.ఎం.39 ఎగ్జోసెట్ నౌకావిధ్వంసక క్షిపణుల కోసం 6533 మిల్లీమీటర్ల టార్పెడో ట్యూబులు, టార్పెడోలతో పాటు 30 మైన్లు.



చిరంజీవి అల్లుడు కళ్యాణ్ దేవ్ చిత్రం ప్రారంభం

హీరో చిరంజీవి అల్లుడు కళ్యాణ్‌దేవ్ హీరోగా తెరంగేట్రం చేస్తున్నారు. వారాహి చలన చిత్రం పతాకంపై ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం బుధవారం సంస్థ కార్యాలయంలో లాంఛనంగా జరిగింది. రాకేష్ శశి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో కళ్యాణ్‌దేవ్‌కు జోడీగా మాళవిక నాయర్ నటిస్తుంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హీరో చిరంజీవి, ఎస్.ఎస్.రాజమౌళి, ఎం.ఎం.కీరవాణి, ఎన్.వి.ప్రసాద్, గుణ్ణం గంగరాజు, కళ్యాణ్ కోడూరి, అవసరాల శ్రీనివాస్ పాల్గొన్నారు. దేవుని పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కి చిరంజీవి క్లాప్ నివ్వగా, ఎస్.ఎస్.రాజమౌళి గౌరవ దర్శకత్వం వహించారు. ఎం.ఎం.కీరవాణి కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత సాయి కొర్రపాటి మాట్లాడుతూ ''చిరంజీవిగారి అల్లుడైన కళ్యాణ్‌దేవ్ పరిచయ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేయడం చాలా ఆనందంగా ఉంది. రాకేష్ శశి ప్రిపేర్ చేసిన అద్భుతమైన కాన్సెప్ట్‌ను ఎక్కడా రాజీపడకుండా భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కించనున్నాం. 'బాహుబలి' చిత్రానికి తన కెమెరా వర్క్‌తో జీవం పోసిన సెంథిల్ కుమార్ ఈ చిత్రానికి కెమెరా బాధ్యతలు నిర్వర్తించనుండగా, 'రంగస్థలం' చిత్రంతో కళా దర్శకుడిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రామకృష్ణ ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్‌గా వర్క్ చేయనున్నారు. అతి త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నాం'' అన్నారు. కళ్యాణ్‌దేవ్, మాళవికా నాయర్, తనికెళ్ళభరణి, మురళీశర్మ, నాజర్, సత్యం రాజేష్, ప్రగతి, కళ్యాణి నటరాజన్, పోసాని, రాజీవ్ కనకాల, జయప్రకాష్ తదితరులు నటించే ఈ చిత్రానికి ఫైట్స్: జాషువా, పాటలు: రెహమాన్, సంగీతం: యోగేష్, ఛాయాగ్రహణం: కె.కె.సెంథిల్‌కుమార్, సమర్పణ: సాయి శివాని, నిర్మాణం: సాయి కొర్రపాటి, నిర్మాత: రజని కొర్రపాటి, రచన, దర్శకత్వం: రాకేశ్ శశి.

ఎంటర్‌టైన్‌మెంట్ ఎప్పుడైనా వర్కవుట్ అవుతుంది - రవితేజ



రవితేజ హీరోగా నటించిన చిత్రం 'టచ్ చేసి చూడు'. బేబీ భవ్య సమర్పణలో లక్ష్మీ నరసింహ ప్రొడక్షన్స్ పతాకంపై నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి), వల్లభనేని వంశీ సంయుక్తంగా నిర్మించిన చిత్రమిది. విక్రమ్ సిరికొండ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రాశీఖన్నా, సీరత్ కపూర్ నాయికలు. ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుని యు/ఎ సర్టిఫికేట్‌ను పొందింది. ఫిబ్రవరి 2న చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హీరో రవితేజ మాట్లాడుతూ ''ఇంతకుముందు సినిమాల్లో పోలీస్ పాత్రలు చాలా సీరియస్‌గా ఉంటాయి. కానీ ఇందులో చిన్న విట్, చిన్న ఫన్, సర్కాస్టిక్‌గా ఉంటాయి. సీరియస్ పాత్రే అయినా వ్యంగం ఉంటుంది. కొత్తదనం కోసం ఆలోచిస్తే సినిమాలు ఆడటం లేదు. నేను కొత్తగా చాలా సినిమాలు ట్రై చేశాను. కానీ అవేమీ కమర్షియల్‌గా వర్కవుట్ కాలేదు. ఆటోగ్రాఫ్ ఎంత మంచి సినిమా, ఈ అబ్బాయి చాలా మంచోడు ఎంత మంచి సినిమా, నేనింతే.. ఒకటేంటి..ఇలాంటివన్నీ పెద్దగా ఆడలేదే. ఎంటర్‌టైన్‌మెంట్ అనేది ఎప్పుడైనా వర్కవుట్ అవుతుంది. చాలా టఫ్ అండ్ డ్యూటీ మైండెడ్ పోలీస్ ఆఫీసర్‌గా ఇందులో కనిపిస్తాను. విక్రమ్ మిరపకాయ్ నుంచి నాకు పరిచయం ఉంది. తను ముందు వేరే కథ చెప్పాడు. కానీ నా కమిట్‌మెంట్స్ ఉన్నాయి. అంతలో ఈ కథను అనుకున్నాం. వక్కంతం వంశీ బుజ్జీకి కథ చెప్పడం, ఆ కథ నాక్కూడా నచ్చడం అన్నీ జరిగాయి. వంశీ కథని విక్రమ్ చాలా బాగా డీల్ చేశాడు. సీరత్ మంచి పాత్ర చేసింది. అల్ట్రా మోడ్రన్‌గా ఉంటుంది. రాశీఖన్నా పాత్ర కూడా బావుంటుంది. మెచ్యూర్డ్‌గా, సర్కాస్టిజమ్‌తో ఉంటుంది. ప్రస్తుతం నేను చేస్తున్న సినిమాల విషయానికి వస్తే.. కల్యాణ్ కృష్ణ కాంబినేషన్‌లో చేస్తున్న సినిమా 25 శాతం పూర్తయింది. ఆ తర్వాత శ్రీనువైట్ల సినిమా'' అన్నారు.



అనుష్క, నిర్మాతలదే ఈ సక్సెస్ క్రెడిట్

అనుష్క టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'భాగమతి'. యు.వి.క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అశోక్ దర్శకుడు. ఈ సినిమా జనవరి 26న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ జరిగింది. ఈ కార్యక్రమంలో అనుష్క, దిల్‌రాజు, అశోక్, రవీందర్, తమన్, వంశీ, ప్రమోద్, విక్కీ, జాషువా, ప్రభాస్ శ్రీను, ధన్‌రాజ్, రవిరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనుష్క మాట్లాడుతూ '''భాగమతి' విడుదలైన రోజు నుండి నేటి వరకు పాజిటివ్ టాక్‌తో రన్ అవుతుంది. చాలా మంది లేడీ ఓరియెంటెడ్ సినిమాలు బాగా చేస్తున్నావని అంటుంటారు. ఒక మంచి బ్యానర్, టీం కుదిరినప్పుడే అది కుదురుతుంది. మరోసారి భాగమతితో అది సాధ్యమైంది''అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ ''అరుంధతి, రుద్రమదేవి చిత్రాలకు అనుష్క ఎంత ఎఫర్ట్ పెట్టి పనిచేసిందో ఈ సినిమాకు అంతే ఎఫర్ట్ పెట్టి పని చేసింది. అందుకు తనకు హ్యాట్సాఫ్. ఈ సినిమా పాయింట్‌ను నమ్మి అశోక్ ఇన్నేళ్లు ట్రావెల్ చేశాడు. అది ఈరోజు నిజమైంది. తెలుగులో కాకుండా తమిళం, మలయాళంలో సినిమా మ్యాజిక్ చేసింది. కొత్త కాన్సెప్ట్ సినిమాలను ఆదరిస్తామని తెలుగు ప్రేక్షకులు మరోసారి నిరూపించారు'' అన్నారు. దర్శకుడు అశోక్ మాట్లాడుతూ ''సక్సెస్‌మీట్ కాదు... సక్సెస్‌ఫుల్ ప్రయాణం. 2012లో స్టార్ట్ చేసిన జర్నీ ఇది. నాతో పాటు ఆర్టిస్టులు, టెక్నీషియన్స్ అందరూ కూడా నమ్మకంగా ట్రావెల్ చేశారు. ముఖ్యంగా అనుష్క నా కథను నమ్మి, ఈ సక్సెస్ వరకు ట్రావెల్ చేసింది. అందుకు స్వీటీ గారికి థాంక్స్. ఈ సక్సెస్ క్రెడిట్ అంతా అనుష్క, నిర్మాతలకు చెందుతుంది'' అన్నారు.

నిజ జీవితానికి దగ్గరగా...

• నాగశౌర్య



'నాకు ఏనుగులంటే చాలా ఇష్టం. అలాగే నా ఇష్టదైవం వినాయకుడు. కాబట్టి ఇంద్రుడు వాహనం పేరుతో ఐరా క్రియేషన్స్ అనే బ్యానర్‌ను పెట్టి 'ఛలో' సినిమా చేశాను. బుజ్జి అంకుల్, శ్రీనివాసరెడ్డిగారు మాకు బ్యాక్‌బోన్‌లా నిలబడ్డారు. వారు లేకుంటే 'ఛలో' మూవీ ఉండేది కాదు. నాపై వారికున్న అంచనాలను ఎప్పటికీ తగ్గనీయను' అని అన్నారు హీరో నాగశౌర్య. ఈయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఛలో'. రష్మిక మండన్నా హీరోయిన్. వెంకీ కుడుమల దర్శకుడు. ఉషా ముల్పూరి నిర్మాత. ఈ సినిమా ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో నాగశౌర్యతో ఇంటర్వ్యూ...

'ఛలో' అనే టైటిల్‌నే ఎందుకు పెట్టారు?

ముందు ఎలాంటి టైటిల్ పెట్టాలో అస్సలు తోచలేదు. నేను, వెంకీ చాలా ఆలోచించేవాళ్లం. మా నాన్నేగారేమో రోజు టైటిల్ విషయంలో ఏదో ఒకటి నిర్ణయించుకోమని తొందరపెట్టేవారు. ఓసారి రామ్‌చరణ్ బ్రూస్‌లీ సినిమాలో 'లే చలో...'సాంగ్ విన్న తర్వాత లేచలో అనే టైటిల్ అయితే ఎలా ఉంటుందో ఆలోచించాం. లే చలో అంటే బాగోదనిపించి చివరికి 'ఛలో' అనే టైటిల్ పెట్టాం. సాయిశ్రీరాంగారు ఉండటం వల్ల సినిమాను అనుకున్న దానికంటే బాగా తీయగలిగాం. రేపు సినిమా చూస్తే ఆయనెంత ముఖ్య భూమిక పోషించారో అర్థమవుతుంది.

మీ క్యారెక్టర్ ఎలా ఉంటుంది ?

నిజ జీవితంలో నేను ఎలా అయితే రఫ్‌గా, జోవియల్‌గా ఉంటానో సినిమాలో కూడా అలానే ఉంటాను. డైరెక్టర్ వెంకీ కావాలనే నా పాత్రను అలా డిజైన్ చేశాడు. హీరోయిన్‌తో ఉన్న సన్నివేశాలే తప్ప మిగతా అన్ని సన్నివేశాల్లో నిజ జీవితంలో ఎలా ఉంటానో అలాగే కనపడ్డాను.

దర్శకుడు వెంకీ కుడుముల వర్కింగ్ ఎక్స్‌పీరియెన్స్?

ఈ సినిమాతో దర్శకుడు వెంకీ కుడుమల మంచి డైరెక్టర్‌గా పేరు తెచ్చుకుంటాడు. వెంకీ నాకు మంచి మిత్రుడు. 'జాదూగాడు' సమయంలో నాకు, తనతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త స్నేహంగా మారింది. స్నేహం కారణంగా తను.. నాతో సినిమా చేయాలనుందని అడగలేకపోయేవాడు. ఆ విషయం తెలిసిన నేను ఓరోజు తనకు ఫోన్ చేసి 'కథ తయారు చేసుకో..సినిమా చేద్దాం' అన్నాను. (తను సాధారణంగా నన్ను చిట్టి అని పిలుస్తుంటాడు) 'చిట్టి.నాకు సినిమా కంటే స్నేహం ముఖ్యం' అని అన్నాడు. 'పర్లేదు..కథ తీసుకురా! సినిమా చేద్దాం' అని అన్నాను. సరేనని తను ఒక లైన్ చెప్పాడు. నాకు నచ్చలేదు. ఇంకేదైనా చేద్దామని అన్నాను. అప్పుడు క్రైమ్ కామెడీ కథ చెప్పాడు. కానీ నువ్వు పెద్ద డైరెక్టర్‌వి అవుతావు.. కాబట్టి ఏదైనా ఓ కమర్షియల్ సినిమా చెయ్ అన్నాను. అప్పుడు వచ్చిన ఆలోచనే 'ఛలో' కథ. ఇద్దరం కలిసి ఈ కథను సిద్ధం చేశాం.

సినిమాలో ఎంత వరకు ఇన్‌వాల్వ్ అయ్యారు?

గతంలో నా సినిమాల విషయంలో నేను ఇన్‌వాల్వ్ అయ్యేవాణ్ణి కాను. అయితే సినిమా పోతే మాత్రం ముందు నన్నే క్వశ్చన్ చేస్తున్నారు. అందుకే కొంచెం ఎక్కువ భాధ్యత తీసుకుని ఈ కథ కోసం వెంకీతో కలిసి 7 – 9 నెలల పాటు కష్టపడ్డాం. నాకు ఏదైనా నచ్చకపోతే వెంకీకి చెప్పి మార్పించుకునేవాడిని. బాధ్యత నాదే అయినప్పుడు సినిమాలో నేను ఇన్‌వాల్వ్ కావాలని నిర్ణయించుకున్నాను. అది కూడా షూటింగ్‌కు వెళ్లడానికి ముందుగానే ఇన్‌వాల్వ్ అవుతానే తప్ప.. షూటింగ్ స్టార్ట్ అయిన తర్వాత ఇన్‌వాల్వ్ కాను.

సినిమా కథేంటి ?

ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులోని ఒక ఊరు కొన్ని కారణాల వలన తెలుగు, తమిళం అని రెండుగా విడిపోతుంది. రెండు ఊళ్లకు మధ్యన కంచె ఉంటుంది. ఎవరైన కంచె దాటితే సాంప్రదాయం ప్రకారం చంపేసుకుంటుంటారు. అలాంటి ఊళ్లోకి నేను ఎందుకు వెళతాననేదే కథ. క్లైమాక్స్‌లో క్లాసులు పీకను, అలాగే క్లైమాక్స్‌లో విలన్స్‌ను కొట్టను. మరి ఏం చేశాననేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

నిర్మాణ బాధ్యతలు ఎలా అనిపించాయి?

ప్రొడక్షన్ వ్యవహారాలను అమ్మ, నాన్నలే దగ్గరుండి చూసుకున్నారు. కొత్త సినిమా కాబట్టి మొదట్లో ఏవీ తెలీక కొంత ఇబ్బందిపడినా తర్వాత తర్వాత తెలుసుకుని చేసుకున్నాం. 11 రోజుల్లో మూడు సీన్లని గుంటూరులో చేశాం. అవి చూశాక అమ్మకి ఫోన్ చేసి ప్రొడక్షన్ వాల్యూస్ చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయని అన్నాను. అప్పటి నుండి అమ్మ అన్నింటినీ స్వయంగా దగ్గరుండి చూసుకుని సినిమా బ్రహ్మాండంగా వచ్చేలా చేశారు.

మీకు నిహారికతో పెళ్లి అని వార్తలు వస్తున్నాయి కదా?

నిన్న రాత్రి నా స్నేహితులు చెబితే నాకా విషయం తెలిసింది. నాకు, వస్తున్న వార్తలకు ఏ సంబంధం లేదు. నాకు ఎవరితో సంబంధం లేదు. మూడు నాలుగేళ్ల తర్వాత మా అమ్మగారు బలవంతం పెడితే, పెళ్లి చేసుకుంటాను.

తదుపరిచిత్రాలేంటి?

సినిమాటోగ్రాఫర్ సాయి శ్రీరామ్‌తో సినిమా చేయబోతున్నాను. ఇది ఫిబ్రవరి నెలాఖరులో ప్రారంభం అవుతుంది. ఇది లవ్‌స్టోరీ. రెండున్నర ఏళ్ల క్రితమే ఆ సినిమా చేయాల్సింది. కానీ ఇప్పటికి కుదిరింది. దాని తర్వాత శ్రీనివాస్ అనే కొత్త దర్శకుడితో 'నర్తనశాల' సినిమాను చేస్తాను.



• రష్మిక మండన్నా

ఖాళీగా ఉండలేను

సాధారణంగా అమ్మాయిలకు ఖాళీ సమయం దొరికితే చాలు. కాలక్షేపం కోసం ఏదో ఒక పని చేస్తుంటారు. కొందరు తమ అందానికి మెరుగులు దిద్దుకుంటారు. సినిమాలు చూస్తూనో, పుస్తకాలు చదువుతూనో ఇలా ఏదో ఒక పనిచేస్తుంటారు. ఇవన్నీ కాదనుకుంటే తీరిగ్గా షాపింగ్ చేసుకుంటారు. కానీ వీటన్నింటికీ తాను పూర్తి భిన్నం అని అంటుందీ హీరోయిన్ రష్మిక మండన్నా. 'నాకు ఖాళీగా ఉండటం నచ్చదు. ఏదో ఒక పని చేయడానికే ఇష్టపడతాను. నాకు కాబోయే భర్త రక్షిత్ కూడా అలాంటి వాడే. డిగ్రీ చదువుతున్నప్పుడే కన్నడలో 'కిరిక్ పార్టీ' సినిమా చేసే అవకాశం వచ్చింది. ఆ సినిమా సక్సెస్ కావడంతో మంచి పేరొచ్చింది. దాని కారణంగానే తెలుగులో నాకు 'ఛలో' సినిమా అవకాశం వచ్చింది. ఈ సినిమా ఫిబ్రవరి 2న విడుదలవుతుంది. గీతాఆర్ట్స్ బ్యానర్‌లో విజయ్ దేవరకొండతో ఓ సినిమాలో నటిస్తున్నాను. గ్లామర్‌గా కనిపించడం ఇష్టమే కానీ.. సదరు పాత్రలు అసభ్యకరంగా ఉండకూడదు' అని చెప్పుకొచ్చింది రష్మిక.

తేజు కెరీర్‌లో గొప్పగా చెప్పుకునే సినిమా 'ఇంటిలిజెంట్' - నిర్మాత సి.కళ్యాణ్



సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లి. పతాకంపై వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కళ్యాణ్ నిర్మించిన చిత్రం 'ఇంటిలిజెంట్'. రీసెంట్‌గా విడుదలైన ఈ చిత్రం టీజర్‌కి, పాటలకి ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఫిబ్రవరి 9న రిలీజ్ కాబోతున్న సందర్భంగా నిర్మాత సి.కళ్యాణ్ 'ఇంటిలిజెంట్' చిత్ర విశేషాలను తెలియజేస్తూ ''రీసెంట్‌గా మా బాలయ్యబాబు 'ఇంటిలిజెంట్' టీజర్‌ని రిలీజ్ చేశారు. టీజర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అలాగే మా ప్రభాస్ పాటల్ని లాంచ్ చేశారు. అన్ని పాటలకి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. 'ఇంటిలిజెంట్' చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ని ఫిబ్రవరి 4న రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్స్ వై జంక్షన్‌లో భారీ ఎత్తున జరుపుతున్నాం. ఈ ఫంక్షన్‌కి అందరి అభిమానులు విచ్చేసి సక్సెస్ చెయ్యాలని కోరుకుంటున్నాను. 'ఛలో' ప్రీ రిలీజ్ వేడుకలో చిరంజీవిగారు 'ఇంటిలిజెంట్' టైటిల్ చాలా బాగుందని వున్నంత సేపు మా సినిమా గురించే మాట్లాడారు. చిరంజీవిగారంటే మా వినాయక్‌కి చాలా ఇష్టం. 'ఖైదీ నంబర్ 150' చిత్రం తర్వాత పెద్ద హీరోలతో కాకుండా సాయిధరమ్ తేజ్‌తో సినిమా చేద్దాం అని నాతో చెప్పగానే ఓకే అని చెప్పాను. డబ్బుల కోసం ఏది పడితే అది చేసి క్యాష్ చేసుకునే అలవాటు వినాయక్‌కి లేదు. ఏ సినిమా చేసినా ఇష్టంతో, ప్రేమతో చేస్తాడు. కథ విషయంలో తను ఫుల్ శాటిస్‌ఫై అయ్యాకే సినిమా స్టార్ట్ చేస్తాడు. చాలా ఇంటిలిజెంట్‌గా ఈ చిత్రాన్ని తీశాడు. అభిమానుల అంచనాలకు మించి వుంటుంది. అలాగే సాయిధరమ్ తేజ్ కెరీర్ గ్రాఫ్‌లో గొప్పగా చెప్పుకునే విధంగా ఈ చిత్రం నిలుస్తుంది. పాటలు, ఫైట్స్ విజువల్‌గా అద్భుతంగా వుంటాయి. ఫ్యాన్స్ అందరూ బాగా ఎంజాయ్ చేస్తారు. థమన్ చాలా మంచి పాటలు ఇచ్చాడు. ఇళయరాజాగారు, సీతారామశాస్త్రిగారి చేతుల మీదుగా 'చమక్ చమక్' వీడియో సాంగ్‌ని భారీగా లాంచ్ చేస్తున్నాం. అది ఎప్పుడు అనేది చెప్తాను. అసిస్టెంట్ డైరెక్టర్‌గా నా కెరీర్ స్టార్ట్ అయ్యింది. మా గురువుగారు దాసరిగారి దయవల్ల నేను ఇంతవాణ్ణి అయ్యాను. ఇప్పటిదాకా 69 సినిమాలు చేశాను. 'ఇంటిలిజెంట్' 70వ సినిమా. ఫిబ్రవరి 9న ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నాం'' అన్నారు.



ఫిబ్రవరి 2న 'హ్యాక్‌డ్ బై డెవిల్'

లాగిన్ మీడియా పతాకంపై మేఘన, సంతోషి, సల్మాన్ ప్రధాన పాత్రల్లో కృష్ణకార్తీక్ దర్శకత్వంలో ఉదయ్‌భాస్కర్ వై. నిర్మించిన హారర్ అండ్ థ్రిల్లర్ మూవీ 'హ్యాక్‌డ్ బై డెవిల్' (హెచ్‌బిడి). ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా చిత్ర యూనిట్ మంగళవారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఆర్.పి.పట్నాయక్, రాజ్ కందుకూరి, మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, ఉప్పల్ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్, ఎంఐఎం జూబ్లీహిల్స్ కంటెస్ట్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, సాయి వెంకట్, రామ సత్యనారాయణ తదితరులతో పాటు చిత్ర యూనిట్ పాల్గొంది. ఈ సందర్భంగా చిత్ర టీజర్‌ని నవీన్ యాదవ్, ట్రైలర్‌ని సర్వే సత్యనారాయణ విడుదల చేశారు. పాటలను ఆర్.పి.పట్నాయక్, రాజ్ కందుకూరి, రామసత్యనారాయణ, సాయి వెంకట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు కృష్ణ కార్తీక్ మాట్లాడుతూ ''చాలా ఉద్వేగంతో వున్నాను. నా మొదటి సినిమా ఇది. పరీక్ష రాసి రిజల్ట్ కోసం ఎదురు చూస్తున్న విద్యార్థిలా వేచి చూస్తున్నాను. నా ఈ తొలి అడుగుకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా క తజ్ఞతలు'' అన్నారు. నిర్మాత ఉదయ్‌భాస్కర్ వై. మాట్లాడుతూ ''ముందుగా మా టీమ్ ని ఆశీర్వదించడానికి వచ్చిన పెద్దలందరికి ధన్యవాదాలు. ఈ బేనర్‌లో రెగ్యులర్‌గా సినిమాలు నిర్మిస్తాం. 'హ్యాక్‌డ్ బై డెవిల్' ఫిబ్రవరి 2న విడుదల చేస్తున్నాం. దర్శకుడు కృష్ణకార్తీక్ ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాడు. ఈ సినిమాకి పనిచేసిన నటీనటులు, టెక్నీషియన్స్ అందరికీ ధన్యవాదాలు. ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరించి మంచి విజయాన్ని అందిస్తారని ఆశిస్తున్నాను'' అని అన్నారు. మేఘన, సంతోషి, సల్మాన్, హిమజ, మానస, సురేష్, అజయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మహి మదన్ యం.యం, సినిమాటోగ్రఫీ: కన్నా కోటి, ఎడిటర్: కె.ఆర్.స్వామి, మాటలు: అభయ్ శ్రీజయ్, కో-డైరెక్టర్: రమేష్ పోలే, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్: మల్లిక్ కె., ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వినయ్‌గౌడ్ వై, నిర్మాత: ఉదయ్‌భాస్కర్ వై., కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: కృష్ణకార్తీక్.

బోసిపోయిన తిరుమల

చంద్రగ్రహణం.. ఆలయం మూసివేత
10.30 గంటలు శ్రీవారి దర్శనం రద్దు



తిరుమల, జనవరి 31 (మనం న్యూస్): నిత్యం లక్షలాది మంది భక్తులతో కిటకిటలాడే తిరుమల చంద్రగ్రహణం సందర్భంగా బోసిపోయింది. బుధవారం శ్రీవారి ఆలయాన్ని దాదాపు 10.30 గంటల పాటు మూసివేశారు. దీంతో భక్తుల సందడి లేక తిరుమల క్షేత్రం నిర్మాణుష్యంగా కనిపించింది. చంద్రగ్రహణానికి 6 గంటల ముందుగా ఉదయం 11 గంటలకు టీటీడీ పండితులు శాస్త్రోక్తంగా పూజాది కార్యక్రమాలు నిర్వహించి ఆలయ ద్వారాలను మూసివేశారు. శ్రీవారి ఆలయ పరిసర ప్రాంతాలు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ తదితర ప్రాంతాలలో టీటీడీ అధికారులు ముందస్తుగా భక్తులను ఆపివేశారు. చంద్రగ్రహణం రోజున శ్రీవారి ఆలయాన్ని మూసివేయనున్నట్టు అధికారులు ముందు నుంచే ప్రచారం చేయడంతో భక్తుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. గ్రహణం ఘడియలు వీడిన అనంతరం రాత్రి 9.30 గంటలకు శ్రీవారి ఆలయ ద్వారాలను తెరిచారు. ఆలయ శుద్ధి, పుణ్యావచనం కార్యక్రమాల అనంతరం స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతించారు. చంద్రగ్రహణం సందర్భంగా శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయాలు, విజయవాడలోని దుర్గగుడి ఆలయం సహా రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాలను మూసివేశారు.

44 మంది హిందూయేతర ఉద్యోగులకు నోటీసులు

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో అక్రమంగా పని చేస్తున్న 44 మంది హిందూయేతర ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగాలు పొందిన మిమ్మల్ని ఎందుకు తొలగించరాదో చెప్పాలని 3 వారాలు గడువు ఇస్తూ టీటీడీ నోటీసులు పంపింది. టీటీడీలో కొందరు హిందూయేతర ఉద్యోగులు ఉన్నారంటూ ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో చర్యలకు ఉపక్రమించింది. ఈ మధ్యే ఓ మహిళా ఉద్యోగి తన అధికారిక వాహనంలో చర్చికి వెళ్లిన వీడియోలు వైరల్‌గా మారాయి. తిరుమలలో అన్యమత ప్రచారం చేసే వారితో పాటు అన్యమతస్థులుగా ఉండి ఉద్యోగాలు పొందిన వారిపై కఠిన చర్యలు తీసుకోబోతున్నట్టు టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. విజిలెన్స్ అధికారుల నివేదిక ఆధారంగా ఉద్యోగులను శాశ్వతంగా తొలగించే ప్రక్రియ మొదలు పెట్టినట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి సైతం నివేదిక ఇచ్చినట్టు తెలిపారు. టీటీడీ ఉద్యోగుల్లో అన్యమతస్థులు ఉన్నట్లు తాజాగా టీటీడీ విజిలెన్స్ నివేదిక బహిర్గతం కావడం సంచలనం రేపింది. వీరిలో ఉన్నతాధికారులు కూడా ఉన్నట్టు సమాచారం.



చెప్పుతో కొట్టి పెళ్లాడింది

- మూడేళ్లుగా ప్రేమ, సహజీవనం
- చివరకు ముఖం చాటేసిన ప్రియుడు
- మరో అమ్మాయితో వివాహానికి సిద్ధం
- దేహశుద్ధి చేసి పెళ్లి చేసుకున్న ప్రియురాలు

కర్నూలు, జనవరి 31 (మనం న్యూస్ బ్యూరో): ప్రియుడు మోసం చేశాడని ప్రియురాలు ఆత్మహత్య చేసుకోవడం.. ప్రియుడి ఇంటి ముందు ధర్నా చేయడం వంటి సంఘటనలు విన్నాం. కర్నూలు జిల్లాకు చెందిన ఓ యువతి ఇందుకు భిన్నంగా శివాలెత్తింది. ప్రేమ పేరుతో ముగ్గులోకి దించి.. మూడేళ్లు సహజీవనం చేసి.. చివరకు మరో యువతితో పెళ్లికి సిద్ధపడ్డ ప్రియుడ్ని రోడ్డుకు లాగి, అందరూ చూస్తుండగా చెప్పుతో కొట్టింది. పంచాయితీ చేసి రాజీ చేయాలని ప్రయత్నించిన పెద్ద మనషులను సైతం కొట్టింది. వాడిపై నమ్మకంతో ఇంట్లో అందరిని కాదనుకొని వచ్చానని.. వాడితోనే పెళ్లి జరిపించాలని పట్టుబట్టి తన పంతం నెగ్గించుకుంది. ఈ సంఘటన కర్నూలు జిల్లా పాణ్యం మండలంలో చోటు చేసుకుంది. పాణ్యం మండలం రాంభూపాల్‌రెడ్డి తాండాకు చెందిన దివ్యాబాయి, నంద్యాల మండలం కానాలకు చెందిన చంద్రశేఖర్‌లు ఒకరినొకరు ప్రేమించుకున్నారు. మూడు సంవత్సరాలు చట్టాపట్టాలు వేసుకొని తిరిగారు. కాగా చంద్రశేఖర్ కట్నం కోసం ఆశపడి అత్త కూతురితో పెళ్లికి సిద్ధమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న దివ్యాబాయి పోలీస్ స్టేషన్‌లో ప్రియుడిపై ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు పట్టించుకోలేదు. ప్రియుడి కులస్తులు, కానాల సర్పంచ్ అందరు కలిసి పంచాయితి పెట్టారు. తనకు న్యాయం జరగదని భావించిన దివ్యాబాయి ఒక్కసారిగా శివాలెత్తిపోయింది. చెప్పు తీసుకొని ప్రియుడిని, అడ్డు వచ్చిన ప్రియుడి తల్లిని, పెద్ద మనుషులను కొట్టి తనకు న్యాయం చేయాలని భోరున విలపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రియుడు చంద్రశేఖర్‌కు, అతని బంధువులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రేమించిన అమ్మాయితో వివాహం జరిపించారు. దీంతో ప్రేమకథ సుఖాంతమైంది.

శరవేగం!

- అమరావతిలో పాలన నగరం పనులకు ఊపు
- రాజధానిలో తొలి భవనం... సచివాలయమే
- వచ్చే ఏడాదికి శాఖాధిపతుల కార్యాలయాలు
- ఏప్రిల్ 10 నుంచి 'సంతోష నగరాల సదస్సు'
- నాలుగు ఎకరాల్లో హైకోర్టు మధ్యంతర భవనం
- సీఆర్‌డీఏ అధికారులతో చంద్రబాబు సమీక్ష



అమరావతి, జనవరి 31 (మనం ప్రతినిధి): రాష్ట్ర రాజధాని అమరావతిలో పాలనా నగరం పనులు వేగం పుంజుకోనున్నాయి. ఈ మేరకు వచ్చే ఏడాది నాటికి సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయ భవనాలు, ప్రభుత్వ ఆవాసాలను త్వరితగతిన పూర్తిచేస్తారు. తొలి ప్రాధాన్యం కింద ఈ మూడు ప్రాజెక్టులను పూర్తిచేస్తామని సీఆర్‌డీఏ అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం రాజధాని అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) సమావేశంలో వివిధ అంశాలపై చర్చ సాగింది. ఈ మేరకు రాజధానిలో రహదారులు, పాలన నగర శాశ్వత భవంతుల నిర్మాణం తదితరాలతోపాటు మెరీనా, ఐటీ టవర్లు, హెల్త్ స్ట్రీట్, కంటైనర్ హోటళ్లు వంటి ఆర్థికాభివృద్ధి ప్రాజెక్టులపై సుదీర్ఘంగా చర్చించారు. అమరావతిలో ఏప్రిల్‌లో నిర్వహించే సంతోష నగరాల సదస్సు, తొమ్మిది నెలల్లో పూర్తి చేయాల్సిన హైకోర్టు మధ్యంతర భవన నిర్మాణ ప్రణాళికపైనా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సచివాలయం, శాఖాధిపతుల భవంతుల నిర్మాణ ప్రణాళికలను నార్మన్ ఫోస్టర్ సంస్థ ఈ రాత్రిలోగా పంపుతున్నట్లు తెలిపిందని ముఖ్యమంత్రికి సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీధర్ వెల్లడించారు. వీటిని అందుకున్న అనంతరం మార్చి నెలలోగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే హైకోర్టు భవనం డిజైన్లతోపాటు నిర్మాణ ప్రణాళిక ఫిబ్రవరి 4 లేదా 5వ తేదీలోగా అందుతాయని వెల్లడించారు. శాసనసభ సౌధం డిజైన్లు కూడా రెండు వారాల్లో వస్తాయని తెలిపారు. ఇక అక్టోబరు నాటికి ప్రభుత్వ ఆవాసాలు మొత్తం సిద్ధమవుతాయని కమిషనర్ వెల్లడించారు.

పది ప్రదేశాలు... 69 ఆకాశహర్మ్యాలు

రాజధానిలోని పది ప్రదేశాలలో 69 టవర్ల నిర్మాణం శరవేగంగా సాగుతున్నదని కమిషనర్ చెప్పారు. శాసనసభ్యులు, ఏఐఎస్ అధికారులకు 18 టవర్లలో 144 ఫ్లాట్లు, ఎన్జీవోలకు 22 టవర్లలో 1968 ఫ్లాట్లు, టైప్-1, 2 అధికారులు; గ్రూప్-డి ఉద్యోగులకు 21 టవర్లలో 1440 ఫ్లాట్లు నిర్మిస్తున్నామని వివరించారు. వీటన్నింటికీ రాఫ్ట్ శ్లాబ్ పనుల పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఇక ప్రభుత్వం నిర్మించే ఆవాస హర్మ్యాలన్నిటిలోనూ క్లబ్ హౌస్‌తోపాటు ఈతకొలను కూడా తప్పనిసరిగా ఉండాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆదేశించారు. అమరావతిలో పనిచేసే ఉద్యోగులు, అధికారులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆకాంక్షించారు. ఆ మేరకు ఈత, సైక్లింగ్ వంటి మంచి అలవాట్లతో వారి జీవనశైలిలో మార్పులు వస్తాయన్నారు.

రెండు ఐటీ స్పేస్ టవర్లు

అమరావతిలో ఐటీ కంపెనీల కోసం భవన నిర్మాణ ప్రతిపాదనలను అధికారులు ముఖ్యమంత్రి ముందుంచారు. మొదట సీఆర్‌డీఏ ఈ ప్రాజెక్టను చేపట్టి, తర్వాత నిర్మాణ పనులను అభివృద్ధిదారులకు అప్పగిస్తుంది. మొదట 10 లక్షల చదరపు అడుగుల మేర జంట భవంతుల నిర్మాణం చేపట్టనుండగా 42 ఐటీ సంస్థల నుంచి 5 లక్షల చదరపు అడుగుల వరకూ ఆఫీస్ స్పేస్ కోసం ప్రతిపాదనలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మరో 5 లక్షల చదరపు అడుగుల స్థలం కోసం సంప్రదింపులు సాగుతున్నాయని వెల్లడించారు. ఐటీ టవర్లలో తొలిదశ 12 నెలల్లో, రెండోదశ 24 నెలల్లో పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు. వీటిని 'హరిత భవన' నమూనాతో నిర్మించాలని ముఖ్యమంత్రి వారికి సూచించారు. ఆఫీస్ స్పేస్ విక్రయం ద్వారా చదరపు అడుగుకు రూ.3 వేలు వంతున రూ.90.6 కోట్ల ఆదాయం సమకూరవచ్చునని సీఆర్‌డీఏ లెక్కలు వేస్తోంది. పరిపాలన నగరం మధ్యలో 7 ఎకరాలలో నిర్మించే సిటీ స్క్వేర్‌కు ఒకవైపు స్టేడియం, మరోవైపు కన్వెన్షన్ సెంటర్ నిర్మించే ప్రతిపాదనలను అధికారులు అందజేశారు. అయితే, స్టేడియంను క్రీడా నగరంలోనే నిర్మించాలని సీఎం సూచించారు. ఇక హైకోర్టు మధ్యంతర భవనం నిర్మాణ ప్రణాళిలో భాగంగా 4 ఎకరాల్లో ప్రధాన భవనం నిర్మిస్తారు. దీన్ని 1.8 లక్షల చదరపు అడుగుల గ్రాస్ ఏరియాతో, జీ ప్లస్ 2 పద్ధతిలో నిర్మిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. చీఫ్ జస్టిస్ కోసం 2000 చదరపు అడుగుల్లో కోర్టు గదిని, 1200 అడుగులలో విస్తీర్ణంలో చాంబర్‌ను నిర్మిస్తున్నారు. మరో 1000 అడుగుల కార్పెట్ ఏరియాతో 18 కోర్టు హాళ్లు, 600 చదరపు అడుగుల వంతున జడ్జిల చాంబర్లు ఉంటాయి. మొత్తం భవన నిర్మాణానికి రూ.108 కోట్లు అవసరమని సీఆర్‌డీఏ అధికారులు అంచనా వేశారు. నిర్మాణ పనులను 6 నుంచి 8 మాసాల్లో పూర్తి చేస్తామని కమిషనర్ శ్రీధర్ పేర్కొన్నారు.

పనులు వేగం పుంజుకోవాలి: చంద్రబాబు

అమరావతి నగర నిర్మాణం ఇక వేగం పుంజుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. తన పరిధిలోని చిన్నచిన్న పనులకూ కాలయాపన జరుగుతోందని, దీన్ని సహించేది లేదని కరాఖండీగా చెప్పారు. రాజధానిలో 85 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న రహదారి పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఎండీ లక్ష్మీ పార్థసారథి ముఖ్యమంత్రికి వివరించారు. దీనికోసం గ్రావెల్ మరింత అవసరమని చెప్పగా అనంతవరం కొండ ప్రాంతం నుంచి తీసుకోవాలని సీఎం సూచించారు. వైకుంఠపురంలో ప్రతిపాదిత రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైతే కొండవీటివాగు నుండి వచ్చే గ్రావెల్‌ను వాడుకోవచ్చునన్నారు. భవానీ ద్వీపంలో సంతోష నగరాల సదస్సు ఏప్రిల్ 10 నుంచి మూడు రోజులు నిర్వహించే సంతోషనగరాల సదస్సు ద్వారా అమరావతి ప్రాభవాన్ని ప్రపంచానికి చాటే అవకాశం మరోసారి దక్కిందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. సంతోష సూచికలో తొలి 50 స్థానాల్లోగల నగరాలకు లేఖలు రాయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆయా నగరాల్లోని ఉత్తమ విధానాలు, వినూత్న పద్ధతులు ఈ సదస్సుద్వారా తెలుస్తాయని చెప్పారు. భూటాన్, సింగపూర్, యూఏఈలలో హ్యాపీనెస్‌కు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉన్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంతోష సూచికను ప్రామాణికంగా తీసుకున్నదని, ప్రజల సంతృప్తి, సంతోషాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని సీఎం చెప్పారు. 'సిలికాన్ వ్యాలీ' తరహాలో రాష్ట్రం ఇన్నోవేషన్ వ్యాలీగా అవతరించాలని ఆకాంక్షించారు. ఈ దిశగా త్వరలో ఇన్నోవేషన్ సమ్మిట్‌ను ఏర్పాటు చేస్తున్నామని చంద్రబాబు ప్రకటించారు. ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, స్టార్టప్ అంశాలలో మన రాష్ట్రం ప్రపంచానికి ఆదర్శం కావాలన్నది తన లక్ష్యమని ఆయన ప్రకటించారు.

దారుణంగా శాంతిభద్రతలు: వీహెచ్

హైదరాబాద్, జనవరి 31 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హన్మంతరావు ఆరోపించారు. హత్యలు పెరిగిపోయాయని, అశాంతి ప్రభలుతుందని బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ విమర్శించారు. రెండు రోజుల్లోనే ఏడు హత్యలు జరిగాయని వీహెచ్ చెప్పారు. ఇంత జరుగుతున్నా గవర్నర్ పట్టించుకోవడంలేదని, ఆయనకు రాష్ట్ర ప్రభుత్వ భజన చేయడానికి సమయయం సరిపోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో హత్య రాజకీయాలపై కేంద్ర హోం మంత్రికి లేఖ రాస్తానని వీహెచ్ చెప్పారు.

గల్ఫ్ బాధితులను ఆదుకోవాలి: దాసోజు



హైదరాబాద్, జనవరి 31 (మనం ప్రతినిధి): కువైట్‌లో వేలాది మంది తెలంగాణ కార్మికులు సాయం కోసం ఎదురు చూస్తున్నారని, వారిని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ కోరింది. వీసా గడువు ముగిసిపోయి కొందరు, పాస్‌పోర్టు రెన్యూవల్ గడువు దాటిపోయిన వారు, సరైన పత్రాలు లేకుండా ఉంటున్న వారు చాలా మంది ఉన్నారని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి దాసోజ్ శ్రవణ్ బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. ఇలాంటివారికి కువైట్ ప్రభుత్వం క్షమాభిక్ష పెట్టిందని దాంతో వారంతా స్వదేశానికి వచ్చేందుకు దరఖాస్తులు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ గడువు ఫిబ్రవరి 22తో ముగిస్తుందన్నారు. వీరిలో చాలా మందికి చేతిలో డబ్బులు లేకపోవడంతో దేశానికి ఎలా రావాలోతెలియక దిక్కు తోచని స్థితిలో ఉన్నారని చెప్పారు. బాధితులను తక్షణమే ఇక్కడికి తీసుకు వచ్చేందుకు అక్కడికి ఒక సాధికారిక బృందాన్ని పంపించాలని డిమాండ్ చేశారు. పీసీసీ ఎన్ఆర్ఐ విభాగం తరపున ఒక బృందాన్ని కువైట్ పంపించాలని పీసీసీ అధ్యక్షుడిని కోరుతామని తెలిపారు.

ఆ బ్యారేజీలతో హాని లేదు

మహారాష్ట్ర వన్యప్రాణి బోర్డు.. సీఈ ప్రజెంటేషన్‌పై సంతృప్తి.. తెలంగాణకు అనుమతి మంజూరు

హైదరాబాద్, జనవరి 31: ఉమ్మడి ఆదిలాబాద్ తూర్పు, పశ్చిమ ప్రాంతాలకు సంబంధించిన రెండు సాగునీటి ప్రాజెక్టులకు బుధవారం వన్యప్రాణి బోర్డు అనుమతి లభించింది. అనుమతుల కోసం మంత్రి హరీశ్ రావు కొన్ని మాసాలుగా జరుపుతున్న సంప్రదింపులపై మహారాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈమేరకు చనాకా-కొరటా, తుమ్మిడి హట్టి ప్రాజెక్టులపై మహా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రెండు బ్యారేజీల వల్ల వన్యప్రాణులకు ఎలాంటి హానీ లేదని తేల్చింది. పెన్‌గంగా నదిపై నిర్మిస్తున్న చనాకా-కొరటా బ్యారేజీతో 51 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. తాజాగా ఈ ప్రాజెక్టుకు తిప్పేశ్వర్ వన్యప్రాణి కేంద్రం అనుమతిచ్చింది. అదేవిధంగా ప్రాణహిత నదిపై 2 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో నిర్మిస్తున్న తుమ్మిడి హట్టి ప్రాజెక్టుకు చాప్రాల్ వన్యప్రాణి కేంద్రం అనుమతిచ్చింది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అధ్యక్షతన బుధవారం ముంబై సహ్యాద్రి గెస్ట్ హౌజ్‌లో వన్యప్రాణి బోర్డు సమా వేశం జరిగింది. ఇందులో చనాకా-కొరటా, తుమ్మిడి హట్టి ప్రాజెక్టులపై ఆదిలాబాద్ సీఈ భగవంతరావు ప్రజంటేషన్ ఇచ్చారు. దీనిపై సంతృప్తి వ్యక్తం చేసిన బోర్డు ప్రాజెక్టులకు అనుమతిచ్చింది. ఈ సమావేశంలో మహారాష్ట్ర ఆర్థిక మంత్రి సుధీర్ మునిగంటివార్, వికాస్ ఖర్కే, రాష్ట్ర అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ భగవాన్‌తో పాటు తెలంగాణకు చెందిన భగవంతరావు, డిప్యూటీ ఫారెస్ట్ కన్జర్వేటర్ శ్రీనివాస్, పెన్‌గంగ ఎస్.ఈ.అంజద్ హుస్సేన్ పాల్గొన్నారు. కాగా, మహారాష్ట్ర వన్యప్రాణి బోర్డు నిర్ణయం పట్ల మంత్రి హరీశ్ రావు హర్షం వ్యక్తంచేశారు.





ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం

- రావుల చంద్రశేఖర్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 31 (మనం ప్రతినిధి) : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయటంలో రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టీఆర్ఎస్ వైఫల్యాలపై నిర్దిష్ట కార్యాచరణతో తెలుగుదేశం ముందుకెళ్తుందని తెలిపారు. 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెప్తూనే మరోవైపు మంత్రులు రోజంతా విద్యుత్ అవసరం లేదని ప్రజాప్రతినిధులతో తీర్మానాలు చేయిస్తుండటం వారి ద్వంద్వ నీతికి అద్ధం పడ్తుందన్నారు. విద్యుత్ పంపిణీపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం కలల పథకమైన డబుల్‌బెడ్‌రూం ఇండ్ల పథకం ప్రజలకు కలగానే మిగిలిందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఎస్సీల అభ్యున్నతే లక్ష్యమని పదేపదే పేర్కొన్న సీఎం దళితులకు మూడెకరాల భూమి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మాయ మాటలతో సీఎం కాలం వెళ్లదీస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రైతులకు రుణమాఫీ జరగలేదన్నారు. బ్యాంకులు సహకరించడం లేదని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆరోపించారు.

బంజారాహిల్స్‌లో రౌడీషీటర్ల వీరంగం..

- కత్తులతో అయిదుగురిపై దాడి.. ఒకరి మృతి

హైదరాబాద్ సిటీ, జనవరి 31(మనం ప్రతినిధి) : నగరంలోని బంజారాహిల్స్ పెన్షన్ ఆఫీస్ సమీపంలో బుధవారం రౌడీషీటర్లు వీరంగం సృష్టించారు. అయిదుగురి వ్యక్తులపై రౌడీ షీటర్లు కత్తులతో దాడి చేశారు. ఈ సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బంగారు తెలంగాణలో 'న్యాయమేది'?

- ఉద్యమ దివిటీలు లాయర్ల బతుకుల్లో చీకట్లు
- అడ్వకేట్లను పట్టించుకోని సర్కారు...
- హక్కుల సాధనకు అడ్వకేట్లు ఉద్యమించాల్సిన దుస్థితి

హైదరాబాద్ సిటీ, జనవరి 31(మనం ప్రతినిధి): దశాబ్దాలుగా ఉమ్మడి రాష్ట్రంలో వివక్షను నిరసిస్తూ ఉద్యమ దివిటీలుగా వెలిగిన న్యాయవాదులు తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ అడ్వకేట్స్ యునైటెడ్ ఫెడరేషన్(టీఏయూఎఫ్) నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రత్యేక తొలి మలి తెలంగాణ ఉద్యమాలలో నల్లకోటు కీలక పాత్ర పోషించిందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఉమ్మడి రాష్ట్రంలో అర్హత ఉన్న న్యాయవాదులు కూడా తమకు లభించాల్సిన అవకాశాలను పరిపాలన, న్యాయవాద సంబంధ ఉద్యోగాలలో వాటా దక్కించుకోలేక పోతున్నామని తెగించి ఉద్యమించామని వారు పేర్కొన్నారు. తెలంగాణలో బతుకుల మారుతాయని కోరుకున్నాం. కానీ తెలంగాణ వచ్చి 4 ఏళ్లు అవుతున్నా నేటికీ న్యాయమేమో కానీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వారు వాపోయారు. న్యాయవాదుల సంక్షేమం కోసం పలు పథకాలు స్వచ్ఛంగా ప్రభుత్వం ప్రకటించాల్సి ఉన్నది. కానీ అలాంటివి కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఆర్థికంగా సామాజికంగా వెనుకబాటు తనంగా ఉన్న న్యాయవాదులు వృత్తినే వదులుకునే పరిస్థితులు వస్తున్నాయి. న్యాయవాద వృత్తి తప్ప మరో ఆధారం లేని వాళ్ల దినదినం మారుతూ కాలమాన పరిస్థితులకు వృత్తిభరోసా ఆర్థిక సామాజిక రక్షణ లభించడం లేదు. ఎంతో మందికి హక్కుల పరిరక్షణ రాజ్యాంగబద్ధంగా కల్పిస్తూ, న్యాయాన్ని గెలిపిస్తూ, న్యాయవాద వృత్తితో ఎంతో మంది కుటుంబాలను, వ్యక్తులను, ప్రభుత్వాలను, సంస్థలను ఎన్నో కేసులలో గెలుబాటలో పయనించేలా ఊతమిచ్చే న్యాయవాదులు నేడు తమ హక్కుల గురించి గళమెత్తలేని పరిస్థితులు దాపురించాయి. ఇన్ని రకాలుగా బతుకునిస్తున్న వివిధరకాలుగా తోడ్పాటునందిస్తున్న న్యాయవాదులు నిరాశ నిస్ప్రుహలలో కొట్టుమిట్టాడుతున్నారు. ఒక ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు.



న్యాయవాద వృత్తి స్వీకరించిన నాటినుంచి ఆరోగ్యం సహకరించే వరకు వృత్తి విరమణ, ఫెన్షన్, ఆరోగ్యభద్రత, పిల్లల స్కూల్ ఫీజులు, ఇళ్ల కిరాయిలు, బ్యాంకుల్లోనూ లభించడంలేదు. ఇంజినీర్లు, మెడిసిన్ సీట్లు వచ్చిన పిల్లలను చదివించుకోలేని ఆర్థిక పరిస్థితి. ఎన్ని ఇబ్బందులున్నా ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టుకోలేక మనస్సు విప్పి చెప్పుకోలేక న్యాయవాదులు మదనపడుతున్నారు.


మీరే నిర్ణయం తీసుకోండి

- కార్తీపై లుకౌట్ నోటీసుల జారీ కేసు
- మద్రాస్ హైకోర్టుకు సుప్రీం సూచన

న్యూఢిల్లీ, జనవరి 31: అవినీతి కేసులో కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరంపై జారీ చేసిన రెండు లుకౌట్ నోటీసులకు సంబంధించిన పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు.. మద్రాస్ హైకోర్టుకు సూచించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా సారథ్యంలోని సుప్రీం ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సారథ్యంలోని ధర్మాసనం రెండు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని గడువు విధించింది. కాగా హైకోర్టు నిర్ణయం తీసుకునేవరకూ.. గత జూన్ 16, జూలై 28న కార్తీ చిదంబరం, ఇతరులపై జారీ అయిన లుకౌట్ నోటీసులు అమల్లో ఉంటాయని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఎయిర్‌సెల్-మాక్సిస్ మనీలాండరింగ్ కేసులో కార్తీ చిదంబరంపై అవినీతి ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. 2007లో కేంద్ర ఆర్థిక మంత్రిగా చిదంబరం హయాంలో కార్తీ అవకతవకలకు పాల్పడినట్టు అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసులో సీబీఐ, ఈడీ కార్తీ చిదంబరం, ఇతరుల నివాసాల్లో తనిఖీలు చేసి, విచారించాయి. సీబీఐ వారిపై లుకౌట్ నోటీసులు జారీ చేసింది. కాగా విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ నిందితులు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా.. ఏకసభ్య ధర్మాసనం లుకౌట్ నోటీసులపై స్టే విధించింది. సీబీఐ విజ్ఞప్తి మేరకు మద్రాస్ హైకోర్టు.. ఈ స్టేను నిలుపుదల చేసింది. దీంతో నిందితులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కాగా ఈ కేసులో తాము ఎలాంటి అభిప్రాయం వెల్లడించబోమని, హైకోర్టే నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంది.

సెన్సెక్స్ జనవరి 31 2018


35,965.02



పెరిగినవి	%	తగ్గినవి	%
కోటక్ మహీంద్రా	1.88	డాక్టర్ రెడ్డీస్	-3.75
రిలయన్స్	1.25	టాటా స్టీల్	-3.49
హెచ్‌డీఎఫ్‌సి	1.15	కోల్ ఇండియా	-2.32
ఇండస్‌ఇండ్	1.05	హెచ్‌యూఎల్	-2.13
టాటా మోటార్స్	0.77	సన్ ఫార్మా	-2.02

నిఫ్టీ జనవరి 31 2018

11027.70



పెరిగినవి	%	తగ్గినవి	%
భారతి ఇన్‌ఫ్రా	2.06	టాటా స్టీల్	-4.61
కోటక్ మహీంద్రా	1.92	డాక్టర్ రెడ్డీస్	-3.50
టెక్ మహీంద్రా	1.61	యూపీఎల్	-2.43
బీపీసీఎల్	1.38	సిప్లా	-2.28
హెచ్‌పీసీఎల్	1.20	హెచ్‌యూఎల్	-2.21


టాప్ లూజర్స్ 31 జనవరి

35,965.02

పాయింట్లు	బి.ఎస్.ఇ సెన్సెక్స్	%
2225.25	డాక్టర్ రెడ్డీస్	-3.75%
705.05	టాటా స్టీల్	-3.49%
298.60	కోల్ ఇండియా	-2.32%
1369.65	హెచ్‌యూఎల్	-2.13%
579.35	సన్ ఫార్మా	-2.02%
1150.65	ఇన్ఫోసిస్	-1.63%
271.25	ఐటీసీ	-1.51%
3111.75	టీసీఎస్	-1.33%
304.65	విప్రో	-0.99%
1416.60	లార్సెన్ టూబ్రో	-0.87%


-68.71

బులియన్| గత 7 రోజులు




రూపాయి వర్సెస్ డాలర్

63.60 (-2p)



అందరి చూపూ బడ్జెట్ పైనే

కీలకమైన 36 వేల పాయింట్ల దిగువున సెన్సెక్స్, 11 వేల పాయింట్ల ఎగువున నిఫ్టీ ముగిశాయి




ముంబయి: గీటురాయిగా భావించే 'సెన్సెక్స్' నువ్వా నేనా అన్నట్లుగా సాగిన ట్రేడింగ్‌లో, బుధవారంనాడు కీలకమైన 36,000 పాయింట్ల స్థాయికన్నా దిగువున ముగిసింది. రేపే కేంద్ర బడ్జెట్ వెలవడనుండడంతో ఇన్వెస్టర్లు వీక్షక పాత్ర వహించారు. యాభై షేర్ల ధరల్లో హెచ్చు తగ్గులను ప్రతిబింబించే నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' కూడా నష్టాలను చవిచూసిందికానీ, 11,000 పాయింట్ల స్థాయికి ఎగువున ముగియగలిగింది. వరుసగా రెండవ సెషన్‌లోనూ అప్రమత్తతే కనిపించింది. మార్కెట్లలో పాల్గొన్నవారు తమ పోర్ట్‌ఫోలియోలను విస్తరించుకునేందుకు విముఖత ప్రదర్శించారని, తదుపరి సంకేతాలకు వారు బడ్జెట్ కోసం చూస్తున్నారని బ్రోకర్లు చెప్పారు. బొంబాయి స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బి.ఎస్.ఇ) 30 షేర్ల సెన్సెక్స్ బుధవారం చాలా భాగం ప్రతికూల మండలంలోనే కొనసాగింది. అది 68.71 పాయింట్లు క్షీణించి 35,965.02 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రా-డేలో అది 35,818.41 పాయింట్లు 36,050.69 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. సెన్సెక్స్ మంగళవారం 249.52 పాయింట్లు క్షీణించి, జీవితకాల గరిష్ఠ స్థాయి నుంచి పతనమైన సంగతి తెలిసిందే. 'నిఫ్టీ' బుధవారం 21.95 పాయింట్లు కోల్పోయి 11,027.70 పాయింట్ల వద్ద ముగియడానికి ముందు ఇంట్రా-డేలో 10,979.30 పాయింట్ల కనిష్ఠ స్థితిని చూసింది. నెలవారీ ప్రాతిపదికన చూస్తే, జనవరిలో బి.ఎస్.ఇ. సెన్సెక్స్ 1908.19 పాయింటల, నిఫ్టీ 497 పాయింట్ల పెరుగుదలను చూసినట్లు లెక్క.

''ఇన్వెస్టర్లు బడ్జెట్ కోసం చూస్తున్నారు. కానీ, గత రెండేళ్ళ బడ్జెట్‌లపై సాగిన ఊహాగానాలతో పోలిస్తే, ఈ బడ్జెట్‌పై అంచనాలు నామమాత్రంగానే ఉన్నాయి. కోశ క్రమశిక్షణ-వృద్ధి సంస్కరణల మధ్య సరైన సమతూకం ప్రధాన అవసరం. బడ్జెట్‌లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కీలకం కాబోతోంది. కానీ, మౌలిక వసతుల అభివృద్ధి, సంస్కరణలకు కూడా ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది. కార్పొరేట్, వ్యక్తిగత పన్నుల్లో కొన్ని మార్పు చేర్పులు ఉండవచ్చు'' అని జియోజీత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ చెప్పారు.



తాత్కాలిక డాటా ప్రకారం, ఎఫ్.పి.ఐ.లు మంగళవారం రూ. 105.56 కోట్ల విలువ చేసే షేర్లు విక్రయించగా, దేశీయ మదుపు సంస్థలు కూడా రూ. 281.65 కోట్ల విలువ చేసే ఈక్విటీలను వదిలించుకున్నాయి. ఆసియాలో ఇతర స్టాక్ మార్కెట్‌లు లాభాలు నమోదు చేశాయి.

ప్రాజెక్టులపై ఉన్నత స్థాయి సమీక్ష




న్యూఢిల్లీ: నీటి పైపులు, టెలికాం కేబుళ్ళ వంటి ప్రజోపయోగ సేవా సౌకర్యాలకు మౌలిక వసతులు పంచుకునేందుకు సంబంధించిన విధివిధానాలు రూపొందించేందుకు టెలికాం కార్యదర్శి నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీలో రోడ్డు రవాణా-హైవేలు, విద్యుచ్ఛక్తి, పెట్రోలియం శాఖల కార్యదర్శులు, రైల్వేల (ఇంజనీరింగ్) సభ్యుడు సభ్యులుగా ఉంటారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నేతృత్వంలో ప్రధాని నియమించిన మౌలిక వసతుల బృంద సమావేశంలో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. నీటి పైపులు, టెలికాం కేబుళ్ళ వంటి ప్రజోపయోగ సేవలకు మౌలిక వసతులు పంచుకునేందుకు తగిన మార్గాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. ప్రాజెక్టులు నెలకొల్పడంలో మంత్రిత్వ శాఖలు పరస్పరం చార్జీలు వసూలు చేసుకోకూడదని, ఎందుకంటే, అవి ప్రభుత్వం నుంచి వెళ్ళి తిరిగి ప్రభుత్వానికే వచ్చేవిగా ఉంటాయని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో గడ్కరీతోపాటు, రైల్వే, బొగ్గు శాఖ మంత్రి పీయూష్ గోయల్, టెలికాం మంత్రి మనోజ్ సిన్హా, పర్యావరణ శాఖ మంత్రి హర్ష్ వర్ధన్, విద్యుత్ శాఖ మంత్రి ఆర్.కె. సింగ్ కూడా పాల్గొన్నారు. జాతీయ జలమార్గాల నంబర్ 1 ఫరక్కా-పట్నా మధ్య నదీ సమాచార వ్యవస్థ నాణ్యత ప్రస్తుతం చాలా నాసిరకంగా ఉన్నందువల్ల కనెక్షన్ క్వాలిటీ మెరుగుపరచవలసిందని బి.ఎస్.ఎన్.ఎల్.ను కోరారు. దానిని ఉన్నతపరచే పనిలో ఉన్నట్లు టెలికాం మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. రోడ్లు, హైవేలు, నౌకాయానం, రవాణా, జల వనరులు, నదుల అభివృద్ధి, గంగా నది ప్రక్షాళన వం టి బహుళ శాఖలను గడ్కరీ నిర్వహిస్తున్నారు. ఆయన 12 హైవే ప్రాజెక్టులకు అనుమతిచ్చే పనిని వేగవంతం చేయవలసిందని పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖను కోరారు. ఆ ప్రాజెక్టులు వివిధ రాష్ట్ర ప్రభుత్వాల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమావేశంలో అనేక ప్రాజెక్టుల అమలును సమీక్షించారు.

నేటి నుంచి ఇ-వే బిల్లు అమలు



న్యూఢిల్లీ: విశృంఖలంగా ఉన్న పన్ను ఎగవేతను అరికట్టేందుకు, రాబడులను 20 శాతం పెంపొందించేందుకు తెచ్చిన ఇ-వే బిల్లు రేపటి (ఫిబ్రవరి 1) నుంచి అమలులోకి రానుంది. దేశంలో రాష్ట్రాల మధ్య సరకుల రవాణాకు ట్రాన్స్‌పోర్టర్లు ఎలక్ట్రానిక్ వేబిల్లు లేదా ఇ-వే బిల్లు దగ్గర ఉంచుకోవాల్సి ఉంటుందని జి.ఎస్.టి.లో ఒక నిబంధన నిర్దేశిస్తోంది. జి.ఎస్.టి.ని జూలై 1 నుంచి అమలులోకి తెచ్చిన తర్వాత, ఐ.టి. నెట్‌వర్క్ సంసిద్ధతను పెండింగ్‌లో ఉంచి, ఇ-వే బిల్లును దగ్గర ఉంచుకోవాల్సిన అవసరాన్ని వాయిదా వేశారు. జి.ఎస్.టి. వ్యవస్థకు ముందు రోజుల్లోనే సువ్యవస్థితమైన ఎలక్ట్రానిక్ చలాన్ లేదా ఇ-వే బిల్లు వ్యవస్థ సక్రమంగా ఉన్న 17 రాష్ట్రాలలో కూడా దాన్ని అమలులోకి తేవడాన్ని వాయిదా వేసినట్లు ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఇంతకుముందు కొందరు నగదు లావాదేవీలకు పాల్పడి, పన్ను చెల్లించడానికి ఇష్టపడేవారు కాదు. పన్ను ఎగవేత విశృంఖలంగా ఉండేది. ఇ-వే బిల్లు వ్యవస్థను అమలుజరిపితే పన్ను ఎగవేత చాలా కష్టంగా పరిణమిస్తుంది. రూ. 50,000 విలువ కలిగిన అన్ని వస్తువుల వివరాలు ప్రభుత్వం వద్ద ఉంటాయి. సరఫరాదారు లేదా కొనుగోలుదారు పన్ను రిటర్నులు దాఖలు చేయకపోతే అసమతౌల్యాన్ని తేలిగ్గా గుర్తించవచ్చని ఆ అధికారి చెప్పారు. ఇ-వే బిల్లు యంత్రాంగాన్ని జూన్ 1నాటికి దేశవ్యాప్తంగా అమలులోకి తేవాలని శక్తిమంతమైన జి.ఎస్.టి. కౌన్సిల్ డిసెంబర్ 16న నిర్ణయించింది. రాష్ట్రాల మధ్య సరకుల రవాణాకు ఇ-వే బిల్లు ఫిబ్రవరి 1 నుంచి, రాష్ట్రం లోపల రవాణాకు సంబంధించి జూన్ 1 నుంచి అమలులోకి వస్తుందని అధికారి తెలిపారు. నిత్యావసర వస్తువులన్నింటినీ ఇ-వే బిల్లు అవసరం నుంచి మినహాయించినట్లు కూడా అధికారి తెలిపారు.

'ప్రభుత్వం పన్నేతర రాబడి చూసుకోవాలి'



ముంబయి: పన్ను యేతర రాబడి హెచ్చుగా ఉండేట్లు చూసుకునేందుకు బడ్జెట్‌లో వ్యూహాత్మక రోడ్-మ్యాప్ నిర్దేశించుకోవాలని ఇడెల్‌వెయిస్ గ్రూప్ చైర్మన్ రసేశ్ షా పిలుపునిచ్చారు. పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 'ఫిక్కీ'కి కూడా ఆయన అధ్యక్షుడుగా ఉన్నారు. ''పన్నేతర రాబడులలో స్థిరమైన వృద్ధి కొనసాగేట్లు చూసేందుకు వ్యూహాత్మకమైన రీతిలో'' ఆర్థిక మంత్రి ఒక రోడ్-మ్యాప్‌ను ఆవిష్కరించాలని రసేశ్ షా కోరారు. కార్పొరేట్, ఫైనాన్షియల్ మార్కెట్లలో 25 ఏళ్ళకు పైగా గడిపిన రసేశ్ పరిశ్రమల తరపున అగ్ర శ్రేణి ప్రతినిధులలో ఒకరుగా ఉన్నారు. ఆయన 1996లో ఇడెల్‌వెయిస్ ప్రారంభించారు. అది రకరకాల ఫైనాన్షియల్ సర్వీసులందించే అగ్ర శ్రేణి సమ్మిశ్రమ సంస్థలలో ఒకటిగా వృద్ధి చెందింది. బ్రోకింగ్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, మ్యూచువల్ ఫండ్లు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వంటి భిన్న రంగాల్లో అది కార్యకలాపాలు సాగిస్తోంది. ''పన్నేతర రాబడులు సృష్టించుకోవడంపై ఇన్నేళ్ళుగా వరుసగా ప్రభుత్వాలన్నీ తాత్కాలిక వైఖరినే అనుసరిస్తూ వస్తున్నాయి. వ్యూహం అంటూ ఏదీ లేదు. పన్నేతర రాబడి ప్రవాహాన్ని మనం వ్యూహాత్మకమైన రీతిలో విస్తృతపరచాలి. ఈ దిశగా గతంలో ఏ ప్రభుత్వాలూ ప్రయత్నించ లేదు'' అని రసేశ్ అన్నారు. సాధారణంగా ఏ ప్రభుత్వమైనా ఆస్తి అమ్మకాలు, నగదీకరణ లేదా పన్నేతర మార్గాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలి. కానీ, మనం హెచ్చు పన్నుల పద్ధతిపై ఆధారపడుతున్నామని ఆయన అన్నారు. సరైన ఆస్తుల మానిటైజేషన్ ప్రణాళిక ద్వారా దీన్ని సాధించవచ్చని, మన ప్రభుత్వానికి ఉన్నంతగా స్థిరాస్తులు, సంపద ప్రపంచంలో ఏ ప్రభుత్వానికీ లేవని ఆయన చెప్పారు. ''ఆస్తులను నగదుగా మార్చుకునేందుకు బడ్జెట్‌లో ఐదేళ్ళు లేదా 10 ఏళ్ళ రోడ్ మ్యాప్‌ను పొందుపరచాలి. బడ్జెట్‌లో పేర్కొనే రాబడుల లక్ష్యాలను చేరుకోవడంలో అది దీర్ఘ కాలంలో సహాయపడుతుంది. ప్రభుత్వాలకు అన్ని భూములు, ఆస్తులు దేనికి?'' అని ఆయన ప్రశ్నించారు. అవి విద్యుదుత్పాదన కేంద్రాలు కానివ్వండి లేదా వస్తూత్పత్తి కాంప్లెక్స్‌లు కానివ్వండి మొత్తానికి ప్రభుత్వాలు భారీ ఆస్తులకు యజమానులుగా ఉండకూడదని ఆయన అన్నారు. ''నా ఉద్దేశం ప్రకారం, ప్రభుత్వ పాత్ర ఆస్తులు నిర్మించడానికి, అభివృద్ధిపరమైన రిస్కులు తీసుకోవడానికి పరిమితం కావాలనికానీ, వాటిని నడిపించడంలో, యజమానులుగా వ్యవహరించడంలో కాదు'' అని రసేశ్ అన్నారు. అయితే, అటువంటి పద్ధతిని అనుసరించడానికి ప్రపంచంలో ఎక్కువ ఉదాహరణలు ఏమీ లేవని ఆయన అంగీకరించారు. ''ప్రభుత్వాలు అభివృద్ధిపరమైన రిస్కులు తీసుకోవాలి. ఎందుకంటే, అవి ఆ రకమైన పని చేయగలిగిన స్థితిలో ఉంటాయి. ప్రైవేటు వ్యక్తులు ఆ పనిని ఎక్కువ కాలం కొనసాగించ లేరు కూడా'' అని ఆయన చెప్పారు. అభివృద్ధిపరమైన రిస్కులను కూడా నగదుగా మార్చుకోవచ్చని, దానివల్ల అంచనాలకు మించి వ్యయాలు కాకుండా చూసుకోవచ్చని చెప్పారు. ప్రభుత్వం ఒక ప్రాజెక్టును ప్రారంభిస్తే నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు సులభంగా లభిస్తాయని, ప్రైవేటు రంగ ప్రాజెక్టుల విషయంలో ఆ మాట చెప్పడానికి లేదని ఆయన అన్నారు. ఒకసారి విద్యుత్ కేంద్రాలు నెలకొల్పి, అవి పనిచేయడం ప్రారంభించిన తర్వాత, ప్రభుత్వ యాజమాన్యంలోని ఎన్.టి.పి.సి. ఇంకా వాటిని నడిపిస్తూండడం దేనికి? విద్యుత్ కేంద్రం అవతరించి, పనిచేయడం ప్రారంభించగానే ప్రభుత్వం దాన్ని అమ్మేసి నగదుగా మార్చుకోవాలని అన్నారు. ఎన్.టి.పి.సి. 8 శాతం వార్షిక ప్రతిఫలంపై ఆ ఆస్తిని నగదుగా మార్చుకుని, ఆ డబ్బుతో కొత్తవాటిని నిర్మించాలని ఆయన వాదించారు.

ఫోర్డ్ 'ఫ్రీస్టైల్' ఆవిష్కరణ



న్యూఢిల్లీ: ఫోర్డ్ మోటార్ తాజా కాంపాక్ట్ యుటిలిటీ వెహికల్ 'ఫ్రీస్టైల్'ని బుధవారం ప్రపంచ వ్యాప్తంగా ఆవిష్కరించింది. దీన్ని భారతదేశ మార్కెట్‌లో ఈ ఏడాది రెండవ త్రైమాసికంలో ప్రవేశపెట్టనున్నారు. ఈ కారులో ఫోర్డ్‌కు చెందిన సర్వ నూతన 1.2 పెట్రోల్ ఇంజను అమరుస్తారు. దీనికి 5 స్పీడ్ మాన్యుయల్ గేర్ ఉంటుంది. 96 పి.ఎస్. పీక్ పవర్, 120 ఎన్.ఎం. టార్క్ ఉంటుందని కంపెనీ పేర్కొంది. ''ఫోర్డ్ ఫ్రీస్టైల్ గ్లోబల్ ఆవిష్కరణ, వినియోగదార్లు కోరుకుంటున్న, విలువైన ఉత్పత్తులను భారతదేశానికి తీసుకురావాలన్న ఫోర్డ్ నిరంతర నిబద్ధతను పటిష్టపరుస్తోంది'' అని ఫోర్డ్ ఇండియా అధ్యక్షుడు, మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ మెహ్‌రోత్రా చెప్పారు. ఎస్.యు.వి. లాంటి వాహనాలకు వినియోగదార్ల నుంచి, ముఖ్యంగా యువత నుంచి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడంలో సర్వ నూతన ఫ్రీస్టైల్ తోడ్పడుతుందని అనురాగ్ చెప్పారు. ''అందమైన, సమర్థమైన, ఇట్టే మనసు దోచుకునే ఫ్రీస్టైల్‌తో మేం మా విభిన్న పోర్ట్‌ఫోలియోకి మరో గొప్ప ఉత్పత్తిని జోడిస్తున్నాం. భారతదేశంలో ఫోర్డ్ యజమానుల ఆనందదాయక కుటుంబం విస్తరించడానికి ఇది సహాయపడుతుంది'' అని అనురాగ్ అన్నారు. ఈ కారు ధర ఐదున్నర లక్షల రూపాయల నుంచి 6 లక్షల రూపాయల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు.

పెరిగిన ఎఫ్.పి.ఐల సంఖ్య



న్యూఢి ల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ కాలంలో కొత్తగా దాదాపు 1,235 మంది విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్.పి.ఐ.లు) భారతీయ సెక్యూరిటీలు, ఎక్ఛ్సేంజ్ బోర్డు (సెబి) వద్ద రిజిస్టరయ్యాయి. ప్రధానంగా భారతీయ క్యాపిటల్ మార్కెట్లపై కొనసాగుతున్న ఆసక్తితో అవి నమోదు చేసుకున్నాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 3,500 కొత్త ఎఫ్.పి.ఐ.లు రిజిస్టరయ్యాయి. ఈ మార్కెట్ నియంత్రణ సంస్థ వద్ద మార్చి నెలాఖరునాటికి 7,807గా ఉన్న ఎఫ్.పి.ఐ.ల సంఖ్య డిసెంబర్ ముగిసేనాటికి 9,042కు పెరిగింది. అలా కొత్తగా, 1235 సంస్థలు చేరినట్లు అయింది. ''భారతీయ ఈక్విటీ, బాండ్లు, రియల్ ఎస్టేట్‌పై కొనసాగుతున్న ఆసక్తి వల్ల ఎఫ్.పి.ఐ. రిజిస్ట్రేషన్లు పెరిగాయి'' అని క్వాంటమ్ అడ్వైజర్స్‌లో స్థిరాదాయ, ప్రత్యామ్నాయాల విభాగ అధిపతి అరవింద్ చారి చెప్పారు. సెబి తీసుకున్న వివిధ చర్యలు భారతదేశపు ఆకర్షణను పెంచాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారతీయ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేసేందుకు సుముఖంగా ఉన్న ఎఫ్.పి.ఐ.లకు ప్రవేశ నిబంధనలు సడలించాలని సెబి బోర్డు గత నెలలో నిర్ణయించింది. వ్యాపార నిర్వహణకు అనువైన పరిస్థితుల సూచీలో భారత్ ర్యాంక్ మెరుగుపడింది. ఇది కంపెనీలలో సంరంభంతో కూడిన సెంటిమెంట్ సృష్టించింది. ప్రభుత్వం 2019 సాధారణ ఎన్నికలకు ముందు అభివృద్ధి పథకాలను, ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేయాలని నిబద్ధతతో ఉంది. ఇవి విదేశీ ఇన్వెస్టర్ల విశ్వాసానికి శుభ సంకేతాలుగా నిలిచాయని 5నాన్స్.కామ్ స్థాపకుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ దినేశ్ రోహిర చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ కాలంలో విదేశీ ఇన్వెస్టర్లు భారతీయ క్యాపిటల్ మార్కెట్ల (ఈక్విటీ, రుణం)లోకి రూ. 1.25 లక్షల కోట్లు తీసుకొచ్చారు. ఎఫ్.పి.ఐ.లకు ప్రభుత్వ రుణంలో పెట్టుబడి పరిమితిని సెబి ఇటీవల పెంచింది. సెక్యూరిటైజ్డ్ రుణ సాధనాలతోపాటు, లిస్ట్ కాని కార్పొరేట్ రుణంలో ఇన్వెస్ట్ చేసే వీలు కల్పించింది. సక్రమ నియంత్రణలో ఉన్న విదేశీ ఇన్వెస్టర్లు కార్పొరేట్ బాండ్లలో ఇన్వెస్ట్ చేసేందుకు నేరుగా అనుమతించింది. సెబి 2014లో పెద్దయెత్తున పునర్వ్యవస్థీకరణ చేపట్టి, వివిధ కేటగిరీలకు చెందిన విదేశీ ఇన్వెస్టర్లు అందరినీ ఎఫ్.పి.ఐ.లనే నూతన తరగతి కిందకు తీసుకొచ్చి నిబంధనలు విడుదల చేసింది. వారి రిస్క్ ప్రొఫైల్, కె.వై.సి. అవసరాలను బట్టి వారిని తిరిగి మూడు కేటగిరీలుగా విభజించింది. ఇతర రిజిస్ట్రేషన్ విధానాలను సులభతరం చేసింది. భారతీయ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టాలనుకునే విదేశీ సంస్థలకు గతంలో ఒకటి లేదా ఐదేళ్ళకు అనుమతి మంజూరు చేసేవారు. వారికిప్పుడు శాశ్వత రిజిస్ట్రేషన్ మంజూరు చేశారు. సెబి సస్పెండ్ చేయడమే లేదా రద్దు చేస్తేనో తప్పించి రిజిస్ట్రేషన్ శాశ్వతంగా కొనసాగుతుంది.

పెయింట్లపై పన్ను తగ్గించాలి

కోల్‌కతా: పన్ను రేట్లలో తగ్గింపు. వినిమయాన్ని పెంపొందించే విధానాలు. కేంద్ర బడ్జెట్ నుంచి పెయింట్ల పరిశ్రమ ఆశిస్తున్న రెండు ముఖ్యమైన అంశాలివి. ఈ రంగానికి కీలక ముడి పదార్థమైన టైటానియం డయాక్సైడ్ (టిఐ02)పై సుంకాన్ని తగ్గించడం కోసం కూడా కంపెనీలు ఎదురుచూస్తున్నాయి. జి.ఎస్.టి. అమలులోకి వచ్చిన తర్వాత, ఈ రంగం 28 శాతం పన్ను భరిస్తోంది. ఇది చాలా ఎక్కువగా ఉందని పరిశ్రమ భావిస్తోంది. బడ్జెట్ లేదా జి.ఎస్.టి. కౌన్సిల్ దాన్ని మరింత ఆచరణ సాధ్యమైన 18 శాతానికి తీసుకురాగలదని పరిశ్రమ అధిపతులు ఆశాభావంతో ఉన్నారు. ''పెయింట్లను 18 శాతం పన్ను పరిధిలోకి తీసుకురావడం సమంజసంగా ఉంటుంది. ఇది వినిమయాన్ని పెంచడానికి సహాయపడుతుంది. వ్యయంలో కలిగిన లబ్ధిని కంపెనీలు వినియోగదార్లకు బదలీ చేయవచ్చు'' అని బెర్జర్ పెయింట్స్ మేనేజింగ్ డైరెక్టర్, సి.ఇ.ఓ., ఇండియన్ పెయింట్ అసోసియేషన్ అధ్యక్షుడు అభిజిత్ రాయ్ అన్నారు. పన్నులు తగ్గించడాన్ని పరిశ్రమ స్వాగతిస్తుందని ఏషియన్ పెయింట్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.బి.ఎస్. ఆనంద్ చెప్పారు.

పెరుగుతున్న వినిమయం




భారతదేశంలో ఒకప్పుడు 7 నుంచి 10 ఏళ్ళ కొకసారి మాత్రమే పెయింట్లు వేయించేవారు. ఇప్పుడది 5 నుంచి 7 ఏళ్ళకు తగ్గింది. రీపెయింటింగ్ సైకిల్ 3-5 ఏళ్ళకు రావడం ఆదర్శప్రాయంగా ఉంటుందని అక్జో నోబెల్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ జయకుమార్ కృష్ణస్వామి అన్నారు. ''అలా కనుక మారితే, తక్కువ పన్ను రేటు వినిమయానికి వెసులుబాటు కల్పిస్తుంది. సిరమిక్స్, ఎలక్ట్రికల్స్ వంటి వస్తువుల కేటగిరీలోకి పెయింట్లను తీసుకురావాలన్నది నా అభిప్రాయం'' అని ఆయన అన్నారు. గృహ నిర్మాణాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు వినియోగదార్లకు, భవన నిర్మాణదార్లకు వరాలు ప్రకటించాలని కృష్ణస్వామి కోరారు. ''ప్రైవేటు ఇన్వెస్ట్‌మెంట్ చక్ర భ్రమణం త్వరలో పుంజుకుంటుందని భావిస్తున్నాను. మౌలిక వసతులపై ప్రభుత్వం చేసే వ్యయం కూడా పారిశ్రామిక పెయింట్ల విభాగానికి ఊతం ఇవ్వగలదు'' అని ఆయన అన్నారు. టైటానియం డయాక్సైడ్ దిగుమతులపై సుంకంలో కోతకు పెయింట్ తయారీ సంస్థలు ఎదురుచూస్తున్నాయి. ఈ ముడి సరకులో దాదాపు 85 శాతం వాటాకు పెయింట్ల తయారీ సంస్థలు దిగుమతులపైనే ఆధారపడుతున్నాయి. ఈ ముడిసరకు ధర 2017 ప్రారంభం నుంచి పెరుగుతూ వస్తోంది. ముడి పదార్థాల వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో పెయింట్ల సంస్థలు కూడా వరుసగా ధరలు పెంచుతూ వస్తున్నాయి. గత ఏడాది మార్చి, మే నెలల్లో పెయింట్ల ధరలు సగటున 5 శాతం పైగా పెరిగాయి.

మనం పర్యాటకం

గురువారం, 1 ఫిబ్రవరి 2018

www.manamnews.com



మంచు కురిసే వేళలో..!

చలి గిలిగింతలు పెట్టే కాలం ఎంతో దూరం లేదు. అయితే చలిని మనసారా ఆస్వాదించాలంటే మంచులో తడవాల్సిందే! అందుకే ఇక్కడ మంచు కురవక పోతేనేం? కురిసే చోటికి ఎగిరిపోదాం. ఈ చల్లని ప్రదేశాలకు వెళ్లి మంచులో మునకలేద్దాం! మంచులో తడవటానికి అనువైన టూరిస్ట్ డెస్టినే షన్... ది ల్యాండ్ ఆఫ్ స్నోస్ 'హిమాచల్‌ప్రదేశ్'. హిల్ స్టేషన్లు, ఎత్తైన పర్వతాలు, పచ్చని లోయలు, యాపిల్ తోటలు... ఇలా చూడ దగిన ప్రదేశాలకు ఈ రాష్ట్రంలో కొదవే లేదు. ఈ అందాలను చూడాలంటే ఇవిగో ఈ ప్రాంతాలను దర్శించాలి.

అందాల మనాలి

సముద్ర మట్టానికి 6,726 అడుగుల ఎత్తున ఉన్న మనాలి ప్రకృతి అందాలతో నిండిన సుందర ప్రదేశమే కాదు, సాహస క్రీడలకు అనువైన ప్రదేశం కూడా! మౌంటెన్ బైకింగ్, ట్రెక్కింగ్, రాఫ్టింగ్, పారా గ్లయిడింగ్, స్కీయింగ్ ఇష్టపడే సాహస ప్రేమికులకు అనువైన డెస్టినేషన్ ఇది. బేస్ నది ఒడ్డునున్న మనాలి చేరుకుంటే సోలాంగ్ లోయలో స్కీయింగ్, పార్వతి లోయలో ట్రెక్కింగ్ చేయొచ్చు. రోహ్‌తంగ్ పాస్‌లోని పీర్ పంజాల్ పర్వతాల పైనుంచి పారా గ్లయిడింగ్ చేస్తే జీవితంలో మర్చిపోలేని అనుభవాన్ని సొంతం చేసుకోవచ్చు. దసరా, హడింబ ఫెస్టివల్స్ మనాలిలో జరుపుకునే ప్రధాన పండగలు. ఈ పండగ వేళల్లో మనాలి లోయంతా సంబరాలతో కోలాహలంగా మారుతుంది. దేశం నలుమూలనుంచి వచ్చే పర్యాటకులతో కిటకిటలాడిపోతుంది. మ్యూజియంలో హిమాచల్‌ప్రదేశ్ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను తెలిపే వస్తువులు, పాత్రలు, ఆయుధాలు, పనిముట్లు ఉంటాయి. మనాలికి మూడు కి.మీ దూరంలో బేస్ నదికి కుడి ఒడ్డున రోహ్‌తంగ్ పాస్‌కు వెళ్లే దారిలో ఉన్న చిన్న గ్రామమిది. వేగి నీటి బుగ్గలు, దేవాలయాలు ఈ ప్రాంతం ప్రత్యేకతలు. ఇక్కడి వేడి నీటి బుగ్గలో రోగాల్ని నయం చేసే ఔషధ గుణాలున్నాయని నమ్ముతారు. కాబట్టే ఎంతోమంది పర్యాటకులు వచ్చి ఇక్కడున్న కొలనుల్లో మునుగుతూ ఉంటారు. స్త్రీ, పురుషులకు వేర్వేరు బేథింగ్ ట్యాంక్స్ ఉన్నాయి. దుస్తులు మార్చుకోవటానికి షవర్స్ ఫిట్ చేసిన బాత్రూమ్స్ సౌకర్యాలు కూడా ఇక్కడున్నాయి. అయితే రద్దీ వద్దనుకునేవాళ్లు ఉదయాన్నే కొలను దగ్గరకి వెళ్లిపోవాలి.

గధాన్ టెచ్చొక్లింగ్ గొంప, హిమాలయన్ నింగ్మప గొంప అనే రెండు ప్రసిద్ధ బౌద్ధారామాలున్నాయి. టిబెటన్ల సంస్కృతి సంప్రదాయాలకు ఈ బౌద్ధారామాలు నెలవులు. గొంప బయట ఉన్న గార్డెన్‌లో మెడిటేషన్ చేసుకునే ఏర్పాట్లుంటాయి. ఈ బౌద్ధారామాలు హ్యాండిక్రాఫ్ట్స్, పెయింటింగ్, కార్పెట్లకు ప్రసిద్ధి. మనాలి, మనాలికి ఉత్తర దిశగా ఉన్న ఊళ్లలో అకామడేషన్ చవక. ఓల్డ్ మనాలి, వశిష్టలలో బడ్జెట్ హోటళ్లుంటాయి. ఇక ఓల్డ్ మనాలి వెళ్లే దార్లో ఉన్న సర్క్యూట్ హౌస్, క్లబ్ హౌస్‌లు కాస్త ఖరీదైనవి. వీటితోపాటు విలాసవంతమైన రిసార్ట్‌లకు మనాలిలో కొదవే లేదు.





ఇలా చేరుకోవాలి

హైదరాబాద్ నుంచైతే చండీగఢ్, కులు లేదా ధర్మశాల వరకూ విమానంలో వెళ్లి అక్కడినుంచి బస్ లేదా కార్లో మనాలి చేరుకోవచ్చు. ఇంతకంటే తక్కువ ఖర్చులో మనాలికి మరింత దగ్గర ప్రాంతానికి చేరుకోవాలనుకుంటే ట్రైన్ బెస్ట్ ఆప్షన్. ట్రైన్‌లో నేరుగా ఢిల్లీకి అక్కడినుంచి రోడ్డు ద్వారా మనాలికి చేరుకోవచ్చు. విమాన ఖర్చు సుమారుగా 8 వేలు. ఇక విశాఖపట్నం నుంచి కూడా ఇదే దారి. ప్రయాణ ఛార్జీల్లో రెండు వేలు తేడా ఉంటుంది.

డల్హౌసీ చూశారా!

19వ శతాబ్దానికి చెందిన బ్రిటిష్ గవర్నర్ లార్డ్ డల్హౌసీ పేరుతో ఉన్న హిల్ స్టేషన్ ఇది. 5 కొండల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ హిల్ స్టేషన్ ఎత్తైన పైన్, ఓక్, దేవదారు వృక్షాలతో నిండి ఉంటుంది. ఈ చెట్ల పచ్చదనంతోపాటు కనుచూపు మేరలో కనిపించే మంచు కిరీటాలు తొడుక్కున్న పర్వతాలు ఈ ప్రదేశాన్ని దర్శనీయ స్థలంగా మార్చేశాయి. క్రమపద్ధతిలో ఉండే వీధులు, బిల్డింగ్‌లు, కొలొనియల్ నిర్మాణ కౌశలాలు ఈ ప్రాంతం ప్రత్యేకతలు. డల్హౌసీలో చూడదగిన స్థలాల్లో చెప్పుకోదగ్గది అల్లా. ఇక్కడున్న బంగాళాదుంపల చేలు చూడముచ్చటగా ఉంటాయి. మరో పాపులర్ స్పాట్ కొరెలను. ఇక్కడున్న నీటి చెలమలో నీళ్లు తాగటం వల్లే నేతాజీకున్న క్షయ వ్యాధి నయమైందని నమ్ముతారు. మిని స్విట్జర్లాండ్ అని ముద్దుగా పిలుచుకునే ఈ పర్వత ప్రాంతం సముద్ర మట్టానికి 2000 మీటర్ల ఎత్తులో ఉంది. డల్హౌసీకి అతి దగ్గర్లో ఉన్న ఖజ్జియార్‌లో చెరువు చుట్టూ దేవదారు వృక్షాలు, వెనకగా కనిపించే హిమ పర్వతాలు... ఈ ప్రదేశాన్ని అందమైన చిత్తరువులా మార్చేశాయి. 12వ శతాబ్దపు ఖజింగ దేవాలయం ఇక్కడి ప్రధాన ఆకర్షణ. ఎటువంటి కోలాహలం లేకుండా ప్రక తి ఒడిలో సేద తీరాలనుకునేవాళ్లకి ఇది బెస్ట్ ఆప్షన్.

కలాటాప్ రెస్ట్‌హౌస్

చిక్కని పైన్ వృక్షాల మధ్య నుంచి కలాటాపకు వెళ్లే దారిలో ఉందీ రెస్ట్ హౌస్. పిక్నిక్ స్పాట్‌లా ఉపయోగపడే ఈ గవర్నమెంట్ రెస్ట్ హౌస్‌కు నడిచి వెళ్లాల్సిందే! వాహనాలు ఇక్కడికి చేరుకోలేవు. కుటుంబసమేతంగా లేదా స్నేహితులతో కలిసి ఇక్కడికి చేరుకుంటే తిరిగి రావాలనిపించదు. దీనికి దగ్గర్లో కలాటాప్ వైల్డ్ లైఫ్ రిజర్వ్ కూడా ఉంది. పైన్, ఓక్, దేవదారు అడవుల మధ్యనున్న ఈ రిజర్వ్‌లో హిమాలయన్ బ్లాక్ బేర్స్‌తోపాటు రకరకాల పక్షి జాతులు, జంతువులు ఉంటాయి. డల్హౌసీ నుంచి ఎగువకు 5 కి.మీ. నడిస్తే గంజి పహారి చేరుకోవచ్చు. హిమాలయ పర్వత శ్రేణిలో బోసిగా కనిపించే బర్కోటా కొండలు ఇవి. డల్హౌసీ నుంచి ఓ గంటపాటు నడుస్తూ చుట్టుపక్కన కనిపించే ప్రక తి దశ్యాలను వీక్షిస్తూ గంజి పహారి చేరుకోవడం అదుతేమైన అనుభవం.

అకామడేషన్


డల్హౌసీలో రిసార్ట్‌లు, హోటళ్లు, లాడ్జ్‌లు, ఇండిపెండెంట్ విల్లాలు.. ఇలా స్థోమతను బట్టి అకామడేషన్‌ను ఎంచుకునే వీలుంది. కాబట్టి వసతి గురించి చింతించాల్సిన పని లేదు. ఖజ్జియార్‌లో విడిది ఖర్చు ఎక్కువ.

ఇలా వెళ్లాలి

ఇక్కడికి నేరుగా విమానాలు లేవు. హైదరాబాద్, విశాఖపట్నం నుంచి ధర్మశాల వరకూ విమానంలో వెళ్లి అక్కడినుంచి బస్ లేదా కారు ద్వారా డల్హౌసీ వెళ్లొచ్చు. హైదరాబాద్ నుంచి జమ్ము వరకు ట్రైన్‌లో వెళ్లి అక్కడినుంచి రోడ్డు ద్వారా డల్హౌసీ చేరుకోవచ్చు. ప్రయాణ ఖర్చు 5 వేలు. విశాఖపట్నం నుంచి అమ తసర్ వరకూ ట్రైన్‌లో వెళ్లి అక్కడి నుంచి క్యాబ్ ద్వారా డల్హౌసీ చేరుకోవచ్చు. ఖర్చు 5 వేలు.








ఎక్కడా కురవనంత మంచు

హిమాచల్‌ప్రదేశ్ మొత్తంలో మరెక్కడా కురవనంత మంచు ఇక్కడ కురుస్తుంది. జనవరి నుంచి మార్చి వరకు ఇక్కడ విపరీతంగా మంచు కురుస్తుంది. కాబట్టి అంత తీవ్రతను తట్టుకోలేని మనకు కుఫ్రి సందర్శించటానికి అనువైన సమయం అక్టోబర్ నెలే! సముద్ర మట్టానికి 7,500 అడుగుల ఎత్తున్న కుఫ్రి హిల్ స్టేషన్ సిమ్లా నుంచి 25 కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడ ప్రతి ఫిబ్రవరిలో స్పోర్ట్స్ ఫెస్టివల్ జరుగుతుంది. ఈ పోటీల్లో స్కీయింగ్ కాంపిటీషన్ ప్రధాన అట్రాక్షన్. ఇక స్లెడ్ మీద జారే 'టొబొగ్గానింగ్' క్రీడ సంవత్సరమంతా ఆడొచ్చు. కుఫ్రిలో ఇందుకోసం ఓల్డెస్ట్ స్కీయింగ్ స్లోప్ ఉంది. కుఫ్రిలోని గో కార్టింగ్ సర్క్యూట్‌లో స్కీయింగ్ చేస్తూ ప్రావీణ్యాన్నంతా ప్రదర్శించవచ్చు. మీరు జంతు ప్రేమికులైతే కుఫ్రి ఊరి బయటున్న హిమాలయన్ నేచర్ పార్క్, కుఫ్రి జూలను సందర్శించడం మర్చిపోవద్దు.

ఎక్కడ ఉండాలి?

రిసార్ట్స్‌తోపాటు బడ్జెట్ హోటల్స్ ఉంటాయి. దేన్లో దిగినా మంచు పర్వతాలతో కూడిన అద్భుతమైన దృశ్యాలు పనోరమిక్ వ్యూలో కనిపిస్తాయి. ఈ హోటళ్లన్నీ మెయిన్ బజార్ చుట్టుపక్కలే ఉంటాయి. కులింగ్‌ఫాగ్ రోడ్, చెయిన్ రోడ్లలో రిసార్ట్స్ ఉంటాయి. ఇక ఇక్కడి మెయిన్ బజార్‌కు రెండు వైపులా లోకల్ ఫుడ్ స్టాల్స్ ఉంటాయి. వీటిలో పరోటాలు, పకోడీలు, చాట్, నూడుల్స్ లాంటి ఫుడ్ ఐటమ్స్ లభిస్తాయి. ఇక రెస్టారెంట్లలో ఇండియన్, చైనీస్, కాంటినెంటల్, ఇటాలియన్ డెలికసీస్ దొరుకుతాయి. కుఫ్రి చుట్టుపక్కలున్న టూరిస్ట్ ప్లేసెసలో బోలెడన్ని బడ్జెట్ హోటళ్లుంటాయి.



ఇలా వెళ్లాలి

కుఫ్రికి సమీప ఎయిర్‌పోర్ట్ సిమ్లాలో ఉంది. హైదరాబాద్ నుంచైతే చండీగఢ్ లేదా లూథియానా వరకు విమానంలో వెళ్లి అక్కడినుంచి రోడ్డు మార్గంలో కుఫ్రి చేరుకోవచ్చు. ప్రయాణ ఛార్జీ రూ.5 నుంచి 8 వేలు. ఇక ట్రైన్‌లో వెళ్లాలనుకుంటే నేరుగా లూథియానా చేరుకుని అక్కడినుంచి క్యాబ్‌లో కుఫ్రి చేరుకోవచ్చు. విశాఖపట్నం నుంచైతే విమానంలో చండీగఢ్ అక్కడినుంచి రోడ్డు మార్గంలో కుఫ్రి చేరుకోవచ్చు. ప్రయాణ ఛార్జీ రూ.8 నుంచి 10 వేలు. నేరుగా లూథియానాకు ట్రైన్‌లో వెళ్లి అక్కడినుంచి రోడ్డు ద్వారా కుఫ్రి చేరుకునే వీలు కూడా ఉంది.

పచ్చని భవనం

ట్రావెలింగ్ అంటే ఇష్టపడని వారుండరు. అందులోనూ ఎక్కువ పచ్చదనంతో కూడిన ప్రాంతాలను చూడాలనుకునేవారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. అలాంటి వారికోసం ఇటలీ ఓ మంచి ప్రదేశం అని చెప్పుకోవచ్చు. ఇటలీని గ్రీన్సిటీగా మార్చడానికీ ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ ఒకదానికి మించి మరొక భవనం చూడ్డానికి అందంగా, పచ్చదనంతో నిండి ఉంటాయి. వీటి డిజైన్స్ చూడ్డానికి వింతగా, అద్భుతంగా కనిపిస్తాయి. మనమిప్పుడు మాట్లాడుకుంటున్న భవనం ఇటలీలోని మిలాన్ నగరంలో ఉంది. ఈ భవనం ప్రపంచంలోనే చాలా ప్రసిద్ధి గాంచింది.



జీవవైవిధ్యం ప్రకారం బెస్ట్ అండ్ డ్యూరబుల్ సిటీని సృష్టించే విధంగా ఈ సిటీని మార్చడానికి ఓ ప్రాజెక్టుకు పూనుకున్నారు. ఈ బిల్డింగ్ అధికారికంగా 2014 అక్టోబర్‌లో ప్రారంభించారు. బాస్కో వర్టికల్ (వర్టికల్ ఫారెస్టు)ను బొయరి స్టూడియో ద్వారా డిజైన్ చేశారు. అంతేకాదు, 2015 లో సిటిబియూఎచ్ అవార్డును దక్కించుకుంది. ఈ భవనాన్ని ప్రత్యేకంగా పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్మించారు. ఇందులో రెండు పెద్ద భవనాలను ఒకటిగా కలిపారు. ప్రతి ఫ్లోర్లో పెద్ద బాల్కనీలు ఉండేలా నిర్మించారు. సుమారు 900 చెట్లు, 2000 మొక్కలు ఉంటాయి. దీని ఎత్తు 110, వెడల్పు 76 మీటర్లు ఉంటుంది. ఈ భవన పునాదుల్లోనూ గాలి, సోలార్ ఎనర్జీ ఉండేలా జాగ్రత్తలు తీసుకు న్నారు. భవనానికి అవసరమైన విద్యుత్తును అవే ఉత్పత్తి చేస్తాయి.

ట్రైన్ రెస్టారెంట్

ప్రపంచంలో చాలా రెస్టారెంట్లు, అందంతో, మంచి అలంకరణతో, మంచి మంచి రుచులతో పర్యాటకులను ఆకర్షితులను చేస్తుంటాయి. మనమిప్పుడు అలాంటి ఓ రెస్టారెంట్ గురించి మాట్లాడుకుంటున్నాం. వింత ఆలోచనలతో అద్భుతమైన అలంకరణతో



పర్యాటకులకు ఆకర్షణ కేంద్రంగా మారింది. అక్కడి రుచిని అస్వాదించడానికి ప్రతిరోజూ కొన్ని వేలసంఖ్యలో పర్యాటకులు ప్రత్యక్షమవుతున్నారు. శ్యామల హిల్స్ అశోకా లేక్వ్యూలోని ఉన్న ఈ రెస్టారెంట్లో అందమైన ప్రకృతి అందాలను సైతం తిలకించవచ్చు. ఈ రెస్టారెంట్ పేరు షాన్- ఎ- భోపాల్ రేల్ రెస్టారెంట్ (ట్రైన్ రెస్టారెంట్). భోపాల్ నుంచి నిజాముద్దీన్ వెళ్లే ట్రైన్ పేరును ఈ హోటల్కు పెట్టారు. ఇక్కడ ప్లాట్ఫాం, కోచ్‌లో కూర్చుని లంచ్, డిన్నర్‌ను అస్వాదించొచ్చు. ఈ ప్రాంతాన్ని అద్భుతంగా అలకంరించారు. ఇక్కడ కూర్చుని తింటున్నప్పుడు నిజంగానే ట్రైన్లో కూర్చుని తింటున్నట్లుగా అనిపిస్తుంది. ఇక్కడ ట్రైన్ హారన్, ఫ్లాట్ఫామ్లో వచ్చే అనౌన్స్మెంట్ లాంటి వాయిస్లు కూడా వినిపిస్తుంటాయి. ఈ రెస్టారెంట్ మధ్యప్రదేశ్ టూరిజం డిపార్ట్మెంట్ నిర్మించింది. అలంకరణ, రుచి వల్ల ప్రపంచమంతా దీనిపేరు మారుమోగుతుంది. ఈ రేల్ రెస్టారెంట్ ఇంటీరియర్ విభిన్నంగా డిజైన్ చేశారు. ఇక్కడ లంచ్, డిన్నర్ కానీ చేస్తున్నప్పుడు వారే రాజులు- మహారాజులు అనే ఫీలింగ్ కలుగుతుందట.

సరస్సు చూసొద్దాం

ఈశాన్య భారతదేశం ఎన్నో ఆశ్చర్యదాయక విశేషాలకు నిలయమనే చెప్పుకోవాలి. అందులో ముఖ్యమైనది మణిపూర్ రాష్ట్రంలోని లోక్తక్ సరస్సు. ప్రకృతి సోయగాల నడుమ విస్తరించి ఉన్న మార్మిక అడవులను, స్వచ్ఛ సరస్సులను, ఇక్కడి జీవవైవిధ్యాలనూ చూసేందుకు రెండు కళ్లూ సరిపోవు. వైవిధ్యభరితమైన వాతారణంతోపాటు తేలియాడే సరస్సుగా కూడా ఇది ఎంతో పేరుగాంచింది. ఈశాన్య ప్రాంతంలోని ఎన్నో అందమైన ప్రాంతాల్లో ఒకటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న లోక్తక్ సరస్సు పర్యాటక అందాలను చూద్దాం. ఈశాన్య భారతంలోని అతిపెద్ద మంచినీటి సరస్సుగా పేరొందింది లోక్తక్ సరస్సు. ఫుండీస్ కారణంగా ప్రపంచపు తేలియాడే సరస్సుగా కూడా ఇది గుర్తింపు పొందింది. ఫుండీస్ అనేవి పెద్ద స్పాంజీ, సాసర్ ఆకారంలోని దీవులు. జలమట్టానికి దిగువన మట్టితో ఇవి పచ్చదనాన్ని కలిగి ఉంటాయి. ఈ సహజ ఫుండీస్ వాటి పరిమాణం, అందులో ఉండే జీవరాసుల సంఖ్య పరంగా కూడా పెద్దవే. ఇలాంటి దీవులు ఈ సరస్సులో ఎన్నో ఉన్నాయి. నిత్యం స్థానచలనం చెందుతూ ఉంటాయి. అంతేకాదు, ఇవి వాటి పరిమాణాన్ని (సైజ్) మార్చుకుంటూ ఉంటాయి. ఏడాది పొడుగునా వివిధ రుతువుల్లో సరస్సు అంతటా అలా కదులుతూ సందర్శకులకు ఆహ్లాదాన్ని



పంచుతాయి. లోక్తక్ సరస్సు అపార జీవవైవిధ్యానికి నిలయం. ఇక్కడ 233 రకాల నీటి మొక్కలు న్నాయి. వందకు పైగా పక్షి జాతులు ఈ సరస్సుపై ఆధారపడి జీవనం సాగిస్తుంటాయి.

బ్యాగ్ ప్యాక్ చేసుకోండి

టూర్ వెళదామని ప్లాన్ చేసుకుంటున్నారా? అయితే మంచి బ్యాగ్ కొనుక్కోవాల్సిందే. మరి ప్రయాణాలకు తగ్గట్టుగా రకరకాల బ్యాగ్స్ మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఈ మధ్య కాలంలో బాగా సేల్ అవుతున్న బ్యాగ్స్ ఇవి. ఎంత బరువు ఉన్నా సరే తట్టుకోవడమే కాకుండా, నడుస్తూ ఉంటే కాళ్లకు తగలకుండా సౌకర్యంగా ఉంటుంది. ఒక రోజు కన్నా ఎక్కువ రోజులు ట్రిప్ వెళ్లే వారికి ఈ బ్యాగ్స్ సౌకర్యంగా ఉంటుంది. ఏదైనా ఎత్తైన ప్రదేశం పైకి వెళుతున్నప్పుడు వీపు భాగానికి కాస్త గాలి తగిలేలా ఈ బ్యాగ్లో ఏర్పాటు ఉంటుంది.



కానీ ఇంటర్నల్ బ్యాగ్స్‌తో పోల్చుకుంటే వీటి డిజైన్ ఇబ్బందికరంగా ఉంటుంది. అందుకే ఒక రోజు ట్రిప్కు మాత్రమే వీటిని ప్రిఫర్ చేస్తే మంచిది. ఎక్స్టర్నల్ బ్యాగ్స్ కంటే ఇంటర్నల్ బ్యాగ్స్ ఖరీదు ఎక్కువగా ఉంటుంది. సుమారు వెయ్యి రూపాయల నుంచి వీటి ధర ఉంటుంది.



ఖేలో ఇండియా షురూ

ప్రారంభించిన ప్రధాని మోదీ

తొలి రోజు తమిళనాడుదే ఆధిక్యం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ముద్దుబిడ్డ 'ఖేలో ఇండియా' స్కూల్ గేమ్స్ బుధవారమిక్కడ ఘనంగా ప్రారంభమైంది. బుధవారమిక్కడి ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రధాని నరేంద్ర మోదీ అధికారికంగా ప్రారంభించారు. అట్టడుగు స్థాయి నుంచి దేశంలో క్రీడా సంప్రదాయాన్ని నెలకొల్పాన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ ఖేలో ఇండియా కార్యక్రమానికి తెరలేపింది. వివిధ క్రీడల్లో చిన్నారుల ప్రతిభను వెలికి తీసి వారిని భావి చాంపియన్లుగా తీర్చిదిద్దేందుకు ఖేలో ఇండియా ఉపయోగపడుతుందని ప్రధాని భావిస్తున్నారు. ఈ గేమ్స్‌లో ప్రతిభావంతులైన చిన్నారులకు ఎనిమిదేళ్ల వరకు ఏడాదికి రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తారు. ఖేలో ఇండియా కార్యక్రమాన్ని తొలుత క్రీడల మాజీ మంత్రి విజయ్ గోయెల్ ప్రారంభించారు. కానీ ఆయన వారసుడు రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ దాన్ని సవరించారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ స్టేడియం కాంప్లెక్స్‌లతో పాటు మరికొన్ని వేదికల్లో ఈ పోటీలను నిర్వహించనున్నారు. 8వ తేదీన ఈ గేమ్స్ ముగుస్తాయి. తొలి రోజు పోటీల్లో తమిళనాడు జట్టు ఆధిక్యంలో నిలిచింది. 2 స్వర్ణ, 2 రజత, 1 కాంస్య పతకాలతో మొత్తం 5 పతకాలు సాధించి పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. తమిళనాడుకు చెందిన సి. ప్రవీణ్ అండర్-17 బాలుర ట్రిపుల్ జంప్‌లో స్వర్ణం గెలిచాడు. కాగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన సచిన్ గుజ్జార్, ఆకాశ్ ఎం. వర్ఘీస్ రజత, కాంస్య పతకాలను సాధించారు. బాలికల 1500 మీటర్ల ఈవెంట్‌లో కేరళకు చెందిన సి. చంతిని పసిడి పతకాన్ని కైవసం చేసుకోగా.. మహారాష్ట్రకు చెందిన ప్రగతి ములాని, పలవి జగ్తాలె రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. వారం రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో అండర్-17 కేటగిరిలో 16 క్రీడాంశాల్లో అథ్లెట్లు పతకాల కోసం పోటీ పడనున్నారు. మొత్తం 199 స్వర్ణ, 199 రజత, 275 కాంస్య పతకాలు అందుబాటులో ఉన్నాయి.

మనం స్పోర్ట్స్
గురువారం, 1 ఫిబ్రవరి, 2018
www.manamnews.com

ముంబై జట్టులో పృథ్వీ షా

5 నుంచి విజయ్ హజారే ట్రోఫీ



ముంబై: బ్యాటింగ్ యువ సంచలనం పృథ్వీ షాకు ముంబై జట్టులో చోటు దక్కింది. విజయ్ హజారే ట్రోఫీలో పాల్గొనే ముంబై జట్టును బుధవారం ఎంపిక చేశారు. ఈ అంతర్ రాష్ట్ర వన్డే టోర్నీ ఈ నెల 5వ తేదీన చెన్నైలో ప్రారం భమవుతుంది. ఈ టోర్నీకి ఆదిత్య తారే కెప్టెన్సీ చేయనున్నాడు. పృథ్వీ షాతో పాటు జై బిస్టా, సిద్ధేశ్ లాడ్, సూర్యకుమార్ యాదవ్, అఖిల్ హెర్వాడ్కర్ కూడా జట్టులో ఉన్నారు. బౌలింగ్ విభాగానికి వైస్ కెపెన్ ధావల్ కుల్‌కర్ణి నేతృత్వం వహించనున్నాడు. 5వ తేదీన తొలి మ్యాచ్‌లో మధ్యప్రదేశ్‌తో ముంబై ఆడుతుంది. 6న గుజరాత్‌తో, 8న తమిళనాడుతో, 9న రాజస్థాన్‌తో, 12న గోవాతో, 14న ఆంధ్రతో తలపడుతుంది.

యూఏఈ లీగ్‌పై ఐసీసీ విచారణ

దుబాయ్: వరుస రనౌట్లు, స్టంపింగ్స్ లతో సంచలనం సృష్టించిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) అజ్మన్ ఆల్ స్టార్స్ లీగ్‌పై ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) దర్యాప్తుకు ఆదేశించింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ మ్యాచ్‌లో కొంత మంది బ్యాట్స్‌మెన్ నిర్లక్ష్య ధోరణితో క్రీజులోకి వెళ్లేందుకు కనీస ప్రయత్నం కూడా చేయ కుండా రనౌట్, స్టంపింగ్ అవుటయ్యారు. 'క్రికెట్ సమగ్రతను దెబ్బతీసే ఈ ఘటనపై ప్రస్తుతం ఐసీసీ అవినీతి నిరోధక విభాగం దర్యాప్తు చేస్తోంది. ప్లేయర్స్, అధికారులతో మాట్లాడుతోంది. దీంతో ఈ విషయంపై నేను ఇప్పుడేమీ మాట్లాడలేను' అని ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్ మేనేజర్ అలెక్స్ మార్షల్ అన్నారు.

International Cricket Council

టెస్టు సిరీస్‌లో చివరి మ్యాచ్‌ను నామమాత్రంగా గెలిచిన టీమిండియా.. సౌతాఫ్రికాతో ద్వైపాక్షిక వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. ఆరు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారమిక్కడ ఇండియా, సౌతాఫ్రికా మధ్య తొలి వన్డే జరగనుంది. 2019 వన్డే వరల్డ్ కప్‌కు 14 నెలల సమయం మాత్రమే ఉండడంతో సౌతాఫ్రికా సిరీస్‌ను టీమిండియా సన్నాహకంగా భావిస్తోంది.

ఈ ఏడాది మరో పెద్ద టెస్టు సిరీస్ వరకు సుదీర్ఘ నిర్ణీత ఓవర్ల షెడ్యూల్‌లో కోహ్లి సేన పాల్గొననుంది. సౌతాఫ్రికా గడ్డపై టీమిండియా ఆరు వన్డేలు, మూడు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుంది. తర్వాత టీ20 ముక్కోణపు సిరీస్, తర్వాత ఇంగ్లండ్, ఐర్లాండ్‌లలో మూడు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌లు ఆడుతుంది. తర్వాత 2018 ఐపీఎల్‌లో పాల్గొంటుంది.

తర్వాత ఆగస్టులో ఇంగ్లండ్‌కు వెళ్లి ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడుతుంది. సౌతాఫ్రికా, ఇంగ్లండ్‌లలో నిర్దిష్టమైన నిర్ణీత ఓవర్ల క్రికెట్ ఆడనుండడంతో 2019 వరల్డ్ కప్‌కు కీలకమైన జట్టును తయారు చేయాలని టీమిండియా మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అదే సమయంలో సౌతాఫ్రికాపై తొలి ద్వైపాక్షిక సిరీస్‌ను గెలవాలని మెన్ ఇన్ బ్లూ పట్టుదలగా ఉంది.

'టాప్' ఫైట్

నేడు ఇండియా, సౌతాఫ్రికా తొలి వన్డే

ఆరు మ్యాచ్‌ల సిరీస్

సాయంత్రం 4-30 నుంచి సోనీ టెన్-1లో ప్రత్యక్ష ప్రసారం



దర్బన్: గతంలో టీమిండియా 1992-93లో 2-5తో, 2006-07లో 0-4తో, 2010-11లో 2-3తో, 2013-14లో 0-2తో ఓటమిపాలైంది. అంతేకాకుండా 1996-97, 2001-02లలో జరిగిన ముక్కోణపు సిరీస్‌లలో టీమిండియాతో పాటు జింబాబ్వే, కెన్యా జట్లు పాల్గొన్నాయి. కానీ ఆ రెండు సిరీస్‌లలో సౌతాఫ్రికా జట్టు గెలిచింది. అంతేకాకుండా సౌతాఫ్రికాలో ప్రొటీస్‌పై ఇండియాకు వన్డే రికార్డు పేలవంగా ఉంది. 1992-93 నుంచి ఇప్పటి వరకు ఇండియా, సౌతాఫ్రికా జట్లు 28సార్లు తలపడ్డాయి. ఇందులో 21 మ్యాచ్‌ల్లో సౌతాఫ్రికా, ఐదు మ్యాచ్‌ల్లో ఇండియా



గెలిచాయి. ఇటువంటి పేలవ రికార్డును బద్దలు కొట్టి విదేశాల్లో టీమిండియా ఆల్ రౌండ్ ప్రదర్శనను మెరుగు పరచుకోవాలని ప్రస్తుత టీమ్ మేనేజ్‌మెంట్ కృతనిశ్చయంతో ఉంది. దీనికితోడు డర్బన్‌లోనూ టీమిండియాకు పేలవ రికార్డు ఉంది. 1992-93 నుంచి ఇప్పటి వరకు ఈ గ్రౌండ్‌లో ఇండియా, సౌతాఫ్రికా జట్లు ఏడు మ్యాచ్‌లు ఆడగా.. ఆరింటిలో ప్రొటీస్ ఆరు మ్యాచ్‌ల్లో గెలిచింది. ఒక మ్యాచ్‌లో ఫలితం రాలేదు. అయితే 2003 వన్డే వరల్డ్ కప్‌లో ఇదే మైదానంలో ఇంగ్లండ్, కెన్యా జట్లను ఓడించింది.



ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా నంబర్ వన్‌ను సాధించేందుకు చిన్న అవకాశముంది. అదేంటంటే.. ప్రస్తుతం సౌతాఫ్రికా 120 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. టీమిండియా 119 పాయింట్లో రెండో ర్యాంక్‌లో ఉంది. ప్రతి మ్యాచ్ తర్వాత ర్యాంకింగ్స్‌లో మార్పు జరుగుతుంటుంది. ఈ సిరీస్‌ను టీమిండియా 4-2తో గెలిస్తే నంబర్ వన్ ర్యాంక్ కోహ్లి సేనదే. ఇది కోహ్లి సేనకు గొప్ప ప్రేరణ ఇస్తోంది. ముఖ్యంగా వాండరర్స్ టెస్టులో గెలిచి ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్‌గా నిలిచిన టీమిండియా వన్డేల్లోనూ అదే జోరును కొనసాగించాలని కోహ్లి సేన పట్టుదలగా ఉంది. మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను సౌతాఫ్రికా 2-1తో కైవసం చేసుకుంది. కానీ 63 పరుగులతో ఓటమిపాలైన మూడు టెస్టు వేదిక జొహన్నెస్‌బర్గ్ పిచ్‌ను ఐసీసీ మ్యాచ్ రెఫరీ ఆండీ పిక్రాఫ్ట్ నాసిరకం పిచ్‌గా ప్రకటించారు. అంతేకాకుండా వన్డేల్లో టీమిండియాకు గర్వించదగ్గ రికార్డు ఉంది. 2016 జనవరిలో ఆస్ట్రేలియాలో కంగారూల చేతిలో 4-1తో ఓటమిపాలైన తర్వాత ఇంట గానీ, బయట గానీ మెన్ ఇన్ బ్లూ ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను ఓడిపోలేదు. ఈ మధ్యలో జింబాబ్వేను, న్యూజిలాండ్‌ను (రెండుసార్లు), ఇంగ్లండ్‌ను, వెస్టిండీస్‌ను, శ్రీలంకను (రెండుసార్లు), ఆస్ట్రేలియాను సిరీస్‌లలో టీమిండియా ఓడించింది. 32 ద్వైపాక్షిక మ్యాచ్‌లకు 24 మ్యాచ్‌లలో కోహ్లి సేన గెలిచింది. గతేడాది ఇంగ్లండ్‌లో జరిగిన చాంపియన్స్ ట్రోఫీలో (ఫైనల్లో పాకిస్థాన్ చేతిలో) మాత్రమే టీమిండియా ఓటమిపాలైంది.

ఇప్పుడు ఆరు మ్యాచ్‌ల సిరీస్‌ను శుభారంభం చేసేందుకు సరైన జట్టును కూర్చడంపై టీమ్ మేనేజ్‌మెంట్ ప్రధానంగా దృష్టి పెట్టింది. గత డిసెంబర్‌లో శ్రీలంకతో వన్డే, టీ20 సిరీస్‌లకు దూరమైన కోహ్లి ఈ సిరీస్‌లో ఆడనుండడంతో మిడిలార్డర్‌లో ఒక్క స్థానానికి మాత్రమే ఎంపిక జరగాల్సివుంది. ఈ స్థానానికి శ్రేయాస్ అయ్యర్ పేరు తెరపైకి వస్తోంది. ఎందుకంటే అయ్యర్ శ్రీలంకతో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండు అర్ధ సెంచరీలు చేశాడు. కానీ అనుభవం ప్రస్తుతం గొప్ప విలువైంది. దీంతో ఈ స్థానం కోసం దినేష్ కార్తీక్, మనీష్ పాండే పోటీ పడుతున్నారు.

సౌతాఫ్రికా కూడా వరల్డ్ కప్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ సిరీస్‌కు సిద్ధమవుతోంది. కుడిచేతి చూపుడు వేలుకు గాయం కావడంతో ఏబీ డివిలియర్స్ తొలి మూడు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఈ పరిస్థితుల్లో ఫర్హాన్ బెహర్దీన్ బెస్ట్ ఆప్షన్. కానీ ఇతనికి సెలెక్టర్ల నుంచి ఎటువంటి పిలుపు రాలేదు. అంటే ప్రొటీస్ టీమ్ మేనేజ్‌మెంట్ విభిన్నమైన కాంబినేషన్‌తో బరిలోకి దిగాలని అర్థమవుతోంది. ఈ నేపథ్యంలో డర్బన్‌కు చెందిన బ్యాట్స్‌మన్ ఖయెలిహ్లె జొండొ అంతర్జాతీయ వన్డేల్లో అరంగేట్రం చేసే అవకాశముంది. మిడిలార్డర్‌లో హషీం ఆమ్లా, క్వింటన్ డి కాక్, ఐడెన్ మార్క్రమ్ బరిలోకి దిగనున్నారు. ఈస్ట్ లండన్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డే అరంగేట్ర మ్యాచ్‌లో మార్క్రమ్ 66 పరుగులు చేశాడు. ఏకైక స్పిన్నర్ ఇమ్రాన్ తాహిర్‌తో ప్రొటీస్ బరిలోకి దిగే అవకాశముంది.

టీమిండియా:

విరాట్ కోహ్లి (కెప్టెన్), శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, అజింక్య రహానే, శ్రేయాస్ అయ్యర్, మనీష్ పాండే, దినేష్ కార్తీక్, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోనీ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, యజ్వేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమీ, శార్దూల్ ఠాకూర్.

సౌతాఫ్రికా:

ఫాఫ్ డు ప్లెసిస్ (కెప్టెన్), హషీం ఆమ్లా, క్వింటన్ డి కాక్ (వికెట్ కీపర్), జేపీ డుమిని, ఇమ్రాన్ తాహిర్, ఐడెన్ మార్క్రమ్, డేవిడ్ మిల్లర్, మోర్నే మోర్కెల్, క్రిస్ మోరిస్, లుంగిసని ఎన్‌గిడి, ఆండిలె పెహ్లువాయో, కగిసో రబాడ, తబ్రైజ్ షమ్సీ, ఖయెలిహ్లె జొండొ.

టీమిండియా రికార్డు మెరుగవుతుంది

సౌతాఫ్రికా కెప్టెన్ డు ప్లెసిస్



డర్బన్: ఇప్పటి వరకు సౌతాఫ్రికా గడ్డపై ఒక్క వన్డే సిరీస్ కూడా గెలవని రికార్డును ఈసారి టీమిండియా మెరుగుపరచుకుంటుందని ప్రత్యర్థి కెప్టెన్ ఫాఫ్ డు ప్లెసిస్ అన్నాడు. తొలి వన్డే శుక్రవారమిక్కడ ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు సౌతాఫ్రికాలో ఆడిన 27 వన్డేలకు గాను టీమిండియా ఐదింటిలో మాత్రమే గెలిచింది. ప్రస్తుత టీమిండియాను ఓడించడం కష్టమని ప్లెసిస్ అన్నాడు. 'సౌతాఫ్రికా గడ్డపై టీమిండియాకు పేలవమైన రికార్డు ఉంది. అంటే పర్యటక జట్టులకు ఇక్కడ గెలవడం కష్టమని అర్థమవుతోంది. అయితే టెస్టు సిరీస్‌కు ముందు నేను చెప్పినట్టు భారత క్రికెట్ జట్టు సవాలు విసురుతుంది. సౌతాఫ్రికాలో విజయాలు నమోదు చేస్తుంది. గట్టి పోటీ ఇస్తుందన్న విషయాన్ని టెస్టు సిరీస్‌లో నిరూపించుకున్నారు. టీమిండియా నాణ్యమైన జట్టు. కనుక వన్డే సిరీస్‌లోనూ అదే గట్టి పోటీ ఇస్తుందని భావిస్తున్నాను' అని ప్లెసిస్ అన్నాడు. టెస్టు సిరీస్‌ను సౌతాఫ్రికా 2-1తో కైవసం చేసుకుంది. కానీ భారత బౌలర్లు అద్భుత ప్రతిభ కనబరిచి 60 వికెట్లు తీశారు.

ద్రవిడ్ లాంటి మెంటర్ కావాలి

పాకిస్థాన్ మాజీ క్రికెటర్ రమీజ్ రాజా



కరాచీ: భారత యువ క్రికెటర్ల ప్రతిభకు సాన పెడుతున్న లెజెండరీ బ్యాట్స్‌మన్, కోచ్ రాహుల్ ద్రవిడ్‌ను పాకిస్థాన్ మాజీ క్రికెటర్ రమీజ్ రాజా ప్రశంసలతో ముంచెత్తారు. ప్రతిభను వెలికి తీసేందుకు ద్రవిడ్ వంటి మెంటర్ పాకిస్థాన్‌కు కూడా కావాలని ఆయన అన్నాడు. ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్ సెమీఫైనల్లో పాకిస్థాన్ జట్టు 203 పరుగులతో ఇండియా చేతిలో ఓడిపోవడంపై రమీజ్ స్పందిస్తూ.. అంత భారీ తేడాతో ఓడిపోవడం షాక్‌కు గురి చేసిందన్నారు. అయితే తాను ఆశ్చర్యపోలేదని.. ఒత్తిడిని ఎదుర్కొనేందుకు భారత యువ క్రికెటర్లు పూర్తిగా సిద్ధపడి వచ్చారని రమీజ్ చెప్పారు. 'కొంత మంది భారత క్రికెటర్లు చూపిన సహజ సిద్ధమైన స్వభావానికి ముగ్ధుడనయ్యాను. భారత జట్టులో శుభ్‌మన్ గిల్‌తో పాటు మరికొందరు ప్రతిభావంతులున్నారు. ఈ ఘనత అంతా వాళ్లను తీర్చి దిద్దిన రాహుల్ ద్రవిడ్‌దే' అని రమీజ్ అన్నారు. ద్రవిడ్ వంటి కోచ్ ఉండడం భారత యువకుల అదృష్టమని పేర్కొన్నారు. పాక్ యువకులను తీర్చిదిద్దేందుకు మాజీలకు అవకాశమివ్వాలని కోరారు.

ప్రీ క్వార్టర్స్‌లో సైనా, సింధు

హెచ్ఎస్ ప్రణయ్ ఇంటికి • ఇండియా ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్



న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, పీవీ సింధు రెండో రౌండ్‌కు చేరుకోగా.. హెచ్ఎస్ ప్రణయ్ తొలి రౌండ్‌లోనే ఇంటి ముఖం పట్టాడు. బుధవారమిక్కడ జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ఇండోనేషియా రన్నరప్ సైనా నెహ్వాల్ 21-15, 21-9తో డెన్మార్క్‌కు చెందిన సోఫీ హోంబో డాల్‌ను వరుస సెట్లలో ఓడించింది. మరో మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ సింధు 21-10, 21-13తో డెన్మార్క్‌కే చెందిన నటాలియా కొచ్ రోడెపై సునాయాస విజయం సాధించింది. తదుపరి మ్యాచ్‌లో డెన్మార్క్‌కే చెందిన లిన్ జెమార్క్ జయెర్స్‌ఫెల్ట్‌తో సైనా, బల్గేరియా లిండా జెట్చిరితో సింధు ఆడుతుంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రణయ్ 4-21, 6-21తో యువ సహచరుడు శ్రేయాష్ జైస్వాల్ చేతిలో ఓటమిపాలయ్యాడు. ఈ మ్యాచ్‌లో ప్రణయ్ ఆరంభం నుంచే అసౌకర్యంగా ఉన్నాడు. పాదాలకు కాయలు కాసినా, సరిగా నడవలేని పరిస్థితి ఉన్నా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రణయ్ బరిలోకి దిగాడు. బీడబ్ల్యూఎఫ్ బిజీ షెడ్యూల్‌లో టాప్ 15 సింగిల్స్ ప్లేయర్స్ సూపర్ 1000, సూపర్ 750, సూపర్ 500లతో పాటు 12 టోర్నీల్లో తప్పక ఆడాల్సివుంది. మలేసియా, ఇండోనేషియాలలో జరిగిన తొలి రెండు సూపర్ 500 టోర్నీలకు దూరం కావడంతో ఈ టోర్నీలో తాను తప్పక పాల్గొనాల్సి వచ్చిందని ప్రణయ్ అన్నాడు. మరో పురుషుల సింగిల్స్‌లో బి. సాయి ప్రణీత్ 21-11, 17-21, 21-17తో రాజీవ్ ఓసెఫ్‌పై గెలిచి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్, రుత్విక శివాని గద్దె కూడా తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో గెలిచారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.